గౌతమ్ న్యూస్ తెలుగు దిన పత్రిక
రిపోర్టర్స్ కావలెను.
GTV GAUTHAM NEWS
9441735522
9849440951
అనతి కాలంలోనే విశేష ప్రజాదరణ పొందుతున్న గౌతమ్ న్యూస్ తెలుగు దినపత్రికకు మరియు Gtv లో పని చేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు ,ఆర్ సీ ఇంఛార్జీలు, మండల విలేకరులు కావలెను.

# గౌతమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక

ప్రతి క్షణం ప్రజల కోసం...
24 X 7
GTV GAUTHAM NEWS
Voice of Truth...
GAUTHAM NEWS TV

హైదరాబాద్ సంపుటి : 01 సంచిక : 246, ఎడిటర్,భీముడు నాయక్ పేజిలు : 12, వెల రూ. 1, బుధవారం - 16 - అక్టోబర్ - 2024
PUBILSHED FROM HYDERABAD, CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

## రైలు పట్టాలపై హైటెన్షన్ వైరు... ఉత్తరాఖండ్‌లో తప్పిన పెను ప్రమాదం


2

ఉత్తరప్రదేశ్‌లోని ఉధమ్‌సింగ్ నగర్ జిల్లాలో ఘటన
డెహ్రాడూన్ నుంచి తనక్‌పూర్ వెళుతున్న ఎక్స్‌ప్రెస్ రైలు
దూరం నుంచే గుర్తించి ఎమర్జెన్సీ బ్రేకులు వేసిన లోకో పైలట్లు
గుర్తు తెలియని వ్యక్తులపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు
విచారణకు ఆదేశించిన రైల్వే అధికారులు

## ఉచితాలపై సుప్రీంకోర్టులో విచారణ... కేంద్రం, ఎన్నికల కమిషన్‌లకు నోటీసులు



2

ఉచిత హామీలను లంచాలుగా పరిగణించాలంటూ బెంగళూరు న్యాయవాది సుప్రీంకోర్టులో పిటిషన్
ఈ పిటిషన్‌పై సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ
ఇదే అంశంపై పెండింగ్‌లో ఉన్న పలు కేసులను కూడా విచారించాలని న్యాయస్థానం నిర్ణయం

## గ్లోబల్ డిజిటల్ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించండి: ప్రధాని మోదీ


2

ప్రపంచవ్యాప్తంగా 40 శాతం రియల్ టైం డిజిటల్ లావాదేవీలు భారత్‌లో జరుగుతున్నట్లు మోదీ
భారత్‌లో 120 కోట్ల మంది మొబైల్ యూజర్లు ఉన్నారని, 95 కోట్ల మంది ఇంటర్నెట్ యూజర్లు ఉన్నారన్నారు
ప్రస్తుతం అన్ని జిల్లాల్లోనూ 5జీ సేవలు విస్తరించినట్లు ఉన్నట్లు వెల్లడి

## 'కల్తీ మద్యం గురించి జగన్మోహన్ రెడ్డి మాట్లాడడం హాస్యాస్పదం'


2

మాజీ సీఎం చేసిన వ్యాఖ్యలకు టీడీపీ నేత సోమిరెడ్డి స్ట్రాంగ్ కౌంటర్
జగన్ వేల కోట్లు దోచుకుంటే చంద్రబాబు రూ.5 వేల కోట్ల ఆదాయం తెచ్చారని స్పష్టం
జగన్ ఇప్పటికైనా నీచ రాజకీయాలు ఆపాలని హితవు పలికారు

## ఆ విషయంలో రాజకీయాలు చేయం... చేయనివ్వం.. కేంద్రం వెంటే ఉంటాం


వివరాలు 2లో..



## : రాజ్‌నాథ్‌కు రేవంత్ రెడ్డి హామీ

హైదరాబాద్ : దేశ రక్షణ విష యంలో మేం రాజ కీ యాలు చే యం...

చేయని వ్వమని... తమ ప్రభుత్వం కేంద్రం వెంటే ఉంటుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు హామీ ఇచ్చారు. వికారాబాద్ జిల్లా దామగుండం రిజర్వ్ ఫారెస్ట్‌లో రాడార్ శంకుస్థాపన కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ... ఈ రాడార్ కేంద్రం ద్వారా దేశ రక్షణ రంగం విషయంలో కేంద్రం మరో అడుగు ముందుకు వేసిందన్నారు. దేశ రక్షణ పరికరాల తయారీలో హైదరాబాద్‌కు మంచి పేరు ఉందని వెల్లడించారు. వీఎల్ఎఫ్ ఏర్పాటుకు వికారాబాద్ జిల్లా అత్యంత వ్యూహాత్మక ప్రాంతమన్నారు. కానీ కొంతమంది లేనిపోని ఆరోపణలు

- వికారాబాద్ జిల్లాలో రాడార్ శంకుస్థాపన కార్య క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి
- కొంతమంది లేనిపోని ఆరోపణలు చేస్తూ వివాదాలకు తెరలేపుతున్నారని ఆగ్రహం
- దేశభద్రత విషయంలో రాజకీయాలు సరికాదని సూచన
- పార్టీలు, సిద్ధాంతాలు వేరైనా భద్రత, రక్షణ విషయంలో కేంద్రంతో కలిసే ఉంటామన్న సీఎం
- పర్యావరణ ప్రేమికులకు సీఎం రేవంత్ రెడ్డి కీలక పిలుపు

## అనుచరుల కోసం డబ్బు కట్టిన మంత్రి నారాయణ.. మూడు షాపులు దక్కిన వైనం!


2

- లాటరీ పద్ధతి ద్వారా కొత్త వైన్ షాపులను కేటాయించిన ప్రభుత్వం
- అనుచరుల కోసం రూ.2 కోట్లు కట్టిన మంత్రి నారాయణ
- ఎస్పీవై రెడ్డి కుమార్తెకు 10కి పైగా షాపులు
- మచిలీపట్నంలో రెండు షాపులను దక్కించుకున్న కర్ణాటక, యూపీ వ్యక్తులు

## రాడార్ కేంద్రానికి రేవంత్ రెడ్డి సహకరించారు : రాజ్‌నాథ్ సింగ్ అభినందన

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్ని విధాలుగా సహకరించారు



- సీఎంతో కలిసి వికారాబాద్ జిల్లాలో వీఎల్ఎఫ్ రాడార్ స్టేషన్‌కు శంకుస్థాపన
- పార్టీలు వేరైనప్పటికీ దేశ అభివృద్ధిలో అందరూ కలిసి ముందుకు సాగాలని సూచన
- కమ్యూనికేషన్‌లో పావురాలు, గుర్రాల దశ నుంచి ఈ స్థాయికి వచ్చామన్న కేంద్రమంత్రి

## కరెంటు కోతల కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పుడు వాతలు పెట్టేందుకు రెడీ అవుతోంది: కేటీఆర్


2లో

'ఎక్స్' వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ సుదీర్ఘ పోస్టు
ఒక్క గ్యారెంటీ కరెక్టుగా అమలు చేసింది లేదంటూ విమర్శ
అసమర్థుల పాలనలో ఆఖరికి మిగిలేది కోతలూ వాతలేనన్న కేటీఆర్

## ఈవీఎంల ద్వారా ఎన్నికలు నిర్వహిస్తే పోటీ చేయను: రాచమల్లు శివప్రసాద్ రెడ్డి


2

- ఈవీఎంల ద్వారా మోసం జరుగుతుందన్న రాచమల్లు
- బ్యాలెట్ పేపర్ ద్వారా ఎన్నికలు నిర్వహిస్తే స్వచ్ఛమైన ఫలితాలు వస్తాయని వ్యాఖ్య
- ఈ అంశంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలని విన్నపం

అమరావతి : ఈవీఎంలపై నమ్మకం లేదని, బ్యాలెట్ పేపర్ ద్వారా ఎన్నికలను మిగతా..2లో

## ఢిల్లీకి నేడు సీఎం రేవంత్‌రెడ్డి.. క్యాబినెట్ విస్తరణపై పార్టీ పెద్దలతో చర్చ!



2

- గురువారం హస్తినలో సీడబ్ల్యూసీ సమావేశం
- క్యాబినెట్ విస్తరణపై చర్చించి గ్రీన్ సిగ్నల్‌తో వచ్చే అవకాశం
- నేటి సమావేశంపై ఉత్కంఠగా ఎదురుచూస్తున్న ఆశావహులు

హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రేపు (బుధవారం) మరోమారు ఢిల్లీకి వెళ్లనున్నారు.

## బాబు జమిలికి ఓకే వెనక మోడీ అభయం ?

- ఉన్న అధికారం కత్తిరించుకుని పోతుందంటే బాధ అంతులేనిది గా ఉంటుంది
- ఒక్క రోజు కాదు ఏకంగా రెండేళ్ల అధికారానికి కోత వేసేలా కేంద్రం జమిలి ఎన్నికల అజెండాతో ముందుకు వస్తొంది
- అరకొర మెజారిటీతో కేంద్రంలో బీజేపీ ఉంది.
- టీడీపీకి చరిత్రలో ఎరగని సీట్లు వచ్చిన ఎన్నికలు 2024లో జరిగాయి
- మొత్తం సీట్లలో తొమ్మిది మాత్రమే ఓడి టోటల్ గా గెలవడం అంటే టీడీపీకి రికారు
- షెడ్యూల్ ప్రకారం 2029 ఎన్నికలు రావడమే చంద్రబాబుకు రెండు వందల శాతం కరెక్ట్.




అమరావతి :: బాబు జమిలికి ఓకే వెనక మోడీ అభయం ? ఎవరికైనా అధి కారమే పరమావధి. అలాంటిది ఉన్న అధికారం కత్తిరించుకుని పోతుందంటే బాధ అంతులేనిది గా ఉంటుంది. ఒక్క రోజు రాజు అయినా అది గొప్ప జాతకమే అని అంతా అంటారు. అలాంటిది ఒక్క రోజు కాదు ఏకంగా రెండేళ్ల అధికారానికి కోత వేసేలా కేంద్రం జమిలి ఎన్నికల అజెండాతో ముందుకు వస్తొంది.

## అత్తాకోడళ్లపై సామూహిక అత్యాచారం... హెూంమంత్రి అనిత ఏమన్నారంటే..!


2లో

- ఏపీలోని శ్రీసత్యసాయి జిల్లాలో అత్తాకోడళ్లపై అత్యాచారం
- ఈ ఘటన చాలా బాధాకరమన్న హెూంమంత్రి
- ఈ కేసులో నిందితులను 48 గంటల్లోనే పట్టుకున్నామని వెల్లడి
- నేరాలు చేసినవాళ్లు తప్పించుకోకుండా చర్యలు ఉంటాయని వ్యాఖ్య

# రైలు పట్టాలపై హైటెన్షన్ వైరు... ఉత్తరాఖండ్‌లో తప్పిన పెను ప్రమాదం

న్యూఢిల్లీ : రైల్వే ట్రాక్‌లపై బండరాళ్లు, గ్యాస్ సిలిండర్లు పెట్టిన ఘటనలు ఇటీవల వరుసగా వెలుగు చూస్తుండగా తాజాగా ఓ హైటెన్షన్ వైరును దుండగులు రైల్వే ట్రాకుపై పడేశారు. లోకో పైలట్ దూరం నుంచే దీనిని గమనించి ఎమర్జెన్సీ బ్రేకులు వేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఉత్తరాఖండ్‌లోని ఉధమ్‌సింగ్ నగర్ జిల్లాలో ఈ తెల్లవారుజామున జరిగిందీ ఘటన. డెహ్రాడూన్ నుంచి తనక్‌పూర్ వెళుతున్న వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఖాతిమా రైల్వే స్టేషన్ దాటిన తర్వాత రైల్వే ట్రాక్‌పై 15 మీటర్ల పొడవున్న హైటెన్షన్ వైరు పడి ఉండడాన్ని లోకోపైలట్లు గుర్తించారు. ఆ వెంటనే అప్రమత్తమై ఎమర్జెన్సీ బ్రేకులు వేయడంతో ప్రమాదం తప్పింది. దీనిపై సమాచారం అందుకున్న రైల్వే అధికారులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని ట్రాకుపై పడి ఉన్న హైటెన్షన్ వైరును తొలగించి రైలు వెళ్లేందుకు రూట్ క్లియర్ చేశారు. ఈ ఘటనపై అధికారులు విచారణకు ఆదేశించారు. గుర్తు తెలియని నిందితులపై భారతీయ న్యాయ్ సంహిత (బీఎన్ఎస్)లోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. గత నెలలోనూ లోకో పైలట్ల అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పింది. ప్రయాగ్‌రాజ్ నుంచి భివానీ వెళుతున్న కాళింది ఎక్స్‌ప్రెస్ లోకో పైలట్లు రైల్వే ట్రాక్‌పై గ్యాస్ సిలిండర్‌ను గుర్తించి ఎమర్జెన్సీ బ్రేకులు వేసినప్పటికీ అది సిలిండర్‌ను నెమ్మదిగా ఢీకొట్టి ఆగింది. ఈ ఘటనపైనా దర్యాప్తు జరుగుతోంది.

# ఉచితాలపై సుప్రీంకోర్టులో విచారణ... కేంద్రం, ఎన్నికల కమిషన్‌లకు నోటీసులు

అమరావతి : ఎన్నికల సమయంలో చిన్న పెద్ద అనే తేడా లేకుండా పార్టీలన్నీ వరుసగా ఉచిత హామీలు గుప్పించడం సర్వసాధారణం అయిపోయింది. ఇదే విషయమై అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో ఇవాళ విచారణ జరిగింది. విచారణ అనంతరం కోర్టు... ఎన్నికల కమిషన్‌తో పాటు కేంద్రానికి నోటీసులు ఇచ్చింది. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ఇచ్చే ఉచిత హామీలను లంచాలుగా పరిగణించాలని కోరుతూ బెంగళూరుకు చెందిన న్యాయవాది సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీలు ఎన్నికల ముందు ఉచితాలు ఇస్తామని హామీ ఇవ్వకుండా నిరోధించాల్సిందిగా పోల్ ప్యానెల్‌ను ఆదేశించాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఉచితాల వల్ల ప్రభుత్వానికి అధిక భారంగా పరిణమిస్తుందని తెలిపారు. ఈ పిటిషన్‌పై సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. అనంతరం కేంద్రంతో పాటు ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. అలాగే ఇదే అంశంపై పెండింగ్‌లో ఉన్న పలు కేసులను కూడా ఈ పిటిషన్‌తో కలిపి విచారించాలని న్యాయస్థానం నిర్ణయించింది. ఇక ఎన్నికల సమయంలో ఇచ్చే ఉచిత వాగ్దానాలు ఓటర్లపై తీవ్ర ప్రభావం చూపుతున్నట్లు పిటిషనర్ తరఫు న్యాయవాది పేర్కొన్నారు. ఉచిత హామీలు ఎన్నికల ప్రక్రియను కూడా దెబ్బతీస్తున్నాయని తెలిపారు.

# గ్లోబల్ డిజిటల్ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించండి: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: టెలికాంతో పాటు దాని సంబంధిత టెక్నాలజీలో భారత్ మేటి దేశంగా ఎదుగుతున్నట్లు ప్రధాని మోదీద తెలిపారు. ఢిల్లీలో జరుగుతున్న ఇంటర్నేషనల్ టెలికమ్యూనికేషన్ యూనియన్ సదస్సులో ఇవాళ ఆయన మాట్లాడారు. భారత్‌లో 120 కోట్ల మంది మొబైల్ యూజర్లు ఉన్నారని, 95 కోట్ల మంది ఇంటర్నెట్ యూజర్లు ఉన్నారన్నారు. ప్రపంచవ్యాప్తంగా 40 శాతం రియల్ టైం డిజిటల్ లావాదేవీలు భారత్‌లో జరుగుతున్నట్లు మోదీ చెప్పారు. డిజిటల్ కనెక్టివిటీ చాలా కీలకమైన టూల్‌గా మారినట్లు తెలిపారు. గ్లోబల్ డిజిటల్ ఫ్రేమ్‌వర్క్‌కు చెందిన రూల్స్‌ను రూపొందించాలని ప్రధాని మోదీ కోరారు. టెక్నాలజీని సామరస్యపూర్వకంగా వాడేందుకు ఏం చేయాలి, ఏం చేయవద్దో అన్న అంశాలపై రూల్స్‌ను ఫ్రేమ్ చేయాలని ప్రధాని మోదీ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా యూజర్ల కోసం ఏవియేషన్ రంగం ఎలాంటి రూల్స్‌ను రూపొందించిందో.. అలాగే డిజిటల్ వరల్డ్ కోసం నియమనిబంధనలు తయారు చేయాలని ప్రధాని మోదీ భిప్రాయపడ్డారు. ఈ విషయంలో గ్లోబల్ సంస్థలు ఒక్కటి కావాలన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఎథికల్‌గా వాడే అంశంపై కూడా వర్కౌట్ చేయాలన్నారు. ప్రస్తుతం దేశంలోని అనేక ప్రాంతాల్లో 5జీ టెలికాం సేవలు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. 6జీ ఏర్పాటు కోసం కూడా పనులు మొదలైనట్లు తెలిపారు. గడిచిన పదేళ్లలో దేశవ్యాప్తంగా ఆప్టికల్ ఫైబర్ వేశారని, అయితే చంద్రుడు, భూమి మధ్య ఉన్న దూరం కన్నా.. 8 రెట్లు అధికంగా ఆప్టికల్ ఫైబర్‌ను దేశవ్యాప్తంగా పరిచినట్లు ప్రధాని మోదీ తెలిపారు. గ్లోబల్ డిజిటల్ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించాలని ఆయన కోరారు. రెండేళ్ల క్రితం మొబైల్ కాంగ్రెస్ సమావేశాల్లో 5జీని ఆవిష్కరించినట్లు తెలిపారు. ప్రస్తుతం అన్ని జిల్లాల్లోనూ 5జీ సేవలు విస్తరించినట్లు ఉన్నట్లు వెల్లడించారు. ప్రపంచంలోనే అతిపెద్ద రెండవ 5జీ మార్కెట్‌గా ఇండియా నిలిచినట్లు చెప్పారు. 6జీ కోసం కూడా వేగంగా పనులు జరుగుతున్నట్లు తెలిపారు.

# అత్తాకోడళ్లపై సామూహిక అత్యాచారం... హోంమంత్రి అనిత ఏమన్నారంటే..!

అమరావతి : ఏపీలోని శ్రీసత్యసాయి జిల్లాలో అత్తాకోడళ్లపై జరిగిన అత్యాచార ఘటన బాధాకరమని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఈ కేసులో టెక్నాలజీని ఉపయోగించి నిందితులను 48 గంటల్లోనే పట్టుకున్నామని తెలిపారు. దఇక పట్టుబడ్డ నిందితుల్లో ముగ్గురు మైనర్లు కాగా, మరో నిందితుడిపై 32 కేసులు ఉన్నాయని చెప్పారు. ఈ కేసును స్పెషల్ కోర్టుకు అప్పగిస్తామన్న మంత్రి... నిందితులకు సాధ్యమైనంత త్వరగా శిక్షపడేలా చేస్తామన్నారు. మహిళల భద్రత విషయంలో వెనుకడుగు వేసే ప్రసక్తే లేదని మంత్రి అనిత స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఎవరు నేరాలకు పాల్పడినా కఠినంగా శిక్షిస్తామని తెలిపారు. నేరాలు చేసినవాళ్లు తప్పించుకోకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. నేరాలు తగ్గించడమే తమ ప్రాధాన్యమని అన్నారు. పాఠశాలలు, కళాశాలల వద్ద పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. అలాగే, అన్ని ప్రార్థనాలయాల దగ్గర కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. మహిళల భద్రత విషయంలో తమ ప్రభుత్వం ఎట్టిపరిస్థితుల్లో రాజీపడదని పేర్కొన్నారు. మహిళల భద్రత విషయంలో ఏ చిన్న ఘటన జరిగినా సరే సీఎం స్వయంగా ఆరా తీస్తున్నారని తెలిపారు. ఇలాంటి కేసుల్లో జాప్యం లేకుండా స్పెషల్ కోర్టులు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. కాగా, మహిళలపై నేరాలు చేసేవారిపై అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే చంద్రబాబు అధికారులను ఆదేశించారు. అత్తాకోడళ్లపై జరిగిన సామూహిక అత్యాచార ఘటనపై సోమవారం డీజీపీ, ఇతర ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ ఘటనలో నిందితులకు తక్షణం శిక్షలు పడేలా చేయాల్సిన అవసరం ఉందన్నారు. దీనికోసం ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసి కేసును విచారించాలని ఆదేశించారు. ఆ దిశగా, హైకోర్టుకు విన్నవించి ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేద్దామన్నారు. మహిళలపై జరిగే నేరాల విషయంలో నిందితులకు కచ్చితంగా, వేగంగా శిక్ష పడేలా దర్యాప్తు సాగాలని సూచించారు.

# ఢిల్లీకి నేడు సీఎం రేవంత్‌రెడ్డి.. క్యాబినెట్ విస్తరణపై పార్టీ పెద్దలతో చర్చ!

మొదటి పేజి తరువాయి

చాలాకాలంగా వాయిదా పడుతున్న రాష్ట్ర క్యాబినెట్ విస్తరణ విషయాన్ని ఈసారి తేల్చుకునే వస్తారని సమాచారం. దీంతోపాటు రాష్ట్రానికి సంబంధించిన కీలక విషయాలను హైకమాండ్‌తో చర్చిస్తారని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. ఈసారి సీఎం పర్యటనలో క్యాబినెట్ విస్తరణ అంశం కొలిక్కి వస్తుందని భావిస్తున్న ఆశావహులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి దాదాపు 10 నెలలు అవుతోంది. ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో క్యాబినెట్ విస్తరణ జరగలేదు. ఇదే విషయమై అధిష్ఠానంతో చర్చించేందుకు రేవంత్‌రెడ్డి పలుమార్లు హస్తినకు వెళ్లినా పని కాలేదు. ఇటీవల జరిగిన హర్యానా, జమ్మూకశ్మీర్ ఎన్నికలకు ముందే క్యాబినెట్‌ను విస్తరించాలని అనుకున్నారు. అయితే, హైకమాండ్ పెద్దలు ఆ ఎన్నికలపై దృష్టి పెట్టడంతో క్యాబినెట్ విస్తరణ వాయిదా పడింది. ఈ నేపథ్యంలో రేపు జరగనున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశంలో పాల్గొంటున్న రేవంత్‌రెడ్డి.. అనంతరం పార్టీ పెద్దలతో సమావేశమై క్యాబినెట్ విస్తరణ అంశంపై చర్చించి జాబితాతో తిరిగి వస్తారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

# 'కల్తీ మద్యం గురించి జగన్మోహన్ రెడ్డి మాట్లాడడం హాస్యాస్పదం'




అమరావతి :: ఆంధ్రప్రదేశ్‌లో మద్యం తక్కువ ధరలకు అమ్మడానికి క్వాలిటీ తగ్గిస్తున్నారంటూ మాజీ సీఎం చేసిన వ్యాఖ్యలకు టీడీపీ నేత సోమిరెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. (మంగళవారం) మీడియాతో మాట్లాడిన సోమిరెడ్డి.. కల్తీ మద్యంపై జగన్ మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని, ఐదేళ్లలో మద్యం ద్వారా జగన్ వేల కోట్లు దోచుకుంటే చంద్రబాబు రూ.5 వేల కోట్ల ఆదాయం తెచ్చారని స్పష్టం చేశారు. జగన్ హయాంలో ప్రతి నెల రూ.250 కోట్లు లోటస్‌పాండ్‌కు తరలించేవారని ఆరోపించిన సోమిరెడ్డి.. రూ.100 కోట్ల అవినీతి ఆరోపణలకే కేజ్రీవాల్, సిసోడియా జైలుకెళ్లారని, కానీ వందల కోట్ల స్కామ్ చేసిన జగన్ బయట తిరుగుతున్నారని అన్నారు. జగన్ ఇప్పటికైనా నీచ రాజకీయాలు ఆపాలని హితవు పలికారు. ఇదిలా ఉంటే ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్త మద్యం పాలసీ తీసుకొచ్చి టెండర్ల ద్వారా ప్రైవేటు వ్యక్తులకు మద్యం దుకాణాల బాధ్యత అప్పగించిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై ట్విటర్ వేదికగా స్పందించిన మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి.. ప్రభుత్వం ఆధ్వర్యంలో అద్భుతంగా నడుస్తున్న మద్యం దుకాణాలను ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకుని వేల కోట్లు దోచుకోవాలని ప్లాన్ చేస్తోందని, సిండికేట్లుగా ఏర్పడి మద్యం మాఫియాను సృష్టిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కామెంట్లను టీడీపీ నేతలంతా స్ట్రాంగ్‌గా కౌంటర్ చేస్తున్నారు.

# బాబు జమిలికి ఓకే వెనక మోడీ అభయం ?

మొదటి పేజి తరువాయి

కేంద్రంలోని ప్రభుత్వానికి జమిలి ఎన్నికల వెనక ఉన్న ఆలోచనలు వేరు. వ్యూహాలు కూడా వేరు. అరకొర మెజారిటీతో కేంద్రంలో బీజేపీ ఉంది. పూర్తి స్థాయి అధికారం గత రెండు టెర్ములు చలాయించిన బీజేపీ పెద్దలకు ఈ పరిణా మం అసలు మింగుడుపడటం లేదు. ఊతకర్రల మీద ఆధారపడి ఎంతకాలం ఈ సర్కార్ బండిని నెట్టడం అని కూడా అనుకుంటున్నారు. దాంతో పాటు మరోసారి అధికారంలోకి రావాలీ అంటే సరైన సమయం చూసి ఎన్నికలకు పోవడమే మార్గమని భావిస్తున్నారు. అలా కాకుండా ఈ ఊతకర్రల ప్రభుత్వాన్ని అయిదేళ్ళూ నెట్టించుకుంటూ పోతే 2029లో ఇంకా దారుణమైన ఫలితాలు వస్తాయన్న ఆందోళన కూడా ఉందిట. సో జమిలి అన్నది కేంద్రానికి బీజేపీకి అలా అతి ముఖ్యమైన ఎత్తుగడ. మరి ఏపీలో సీఎన్ చూస్తే అలా కాదు కదా. చంద్రబాబుకు టీడీపీకి చరిత్రలో ఎరగని సీట్లు వచ్చిన ఎన్నికలు 2024లో జరిగాయి. మొత్తం సీట్లలో తొమ్మిది మాత్రమే ఓడి టోటల్‌గా గెలవడం అంటే టీడీపీకి రికార్డు. అలాగే జనసేన మొత్తం 21 సీట్లు గెలిచింది. బీజేపీ పదికి ఎనిమిది గెలిచింది. వైసీపీ దారుణంగా 11 సీట్లకే పరిమితం అయింది. కూటమిదే అసెంబ్లీ. మొత్తానికి మొత్తం హవా చేస్తున్న సందర్భం ఉంది. అయిదేళ్ళ పాటు అధికారంలో ఉంటే అపరిమితమైన అధికారంతో పాటు రాజ్యసభలోనూ శాసనమండలిలోనూ పూర్తి సీట్లు దక్కుతాయి. అంతే కాదు ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా నెరవేరిస్తే మళ్లీ ఆదరణ దక్కుతుంది. అమరావతి పోలవరం ప్రాజెక్టులను పూర్తి చేస్తే చరిత్రలో చంద్రబాబు వైభవం శాశ్వతం అవుతుంది. ఇలా అన్ని లెక్కలూ చూసుకుంటే షెడ్యూల్ ప్రకారం 2029 ఎన్నికలు రావడమే చంద్రబాబుకు రెండు వందల శాతం కరెక్ట్. కానీ 2027లోనే ఎన్నికలకు కేంద్రం రెడీ అవుతోంది అన్న వార్తలు వచ్చాయి. ఇటీవల చంద్రబాబు ఢిల్లీ వెళ్ళి కేంద్ర పెద్దలను కలసినపుడు జమిలి ఎన్నికల మీద ఒక క్లారిటీ వచ్చింది అని అంటున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కేంద్రం జమిలి ఎన్నికలను జరిపించడానికి సిద్ధపడుతోందని అర్థం అయింది అని అంటున్నారు అదే సమయంలో బాబుకు తగిన అభయం కూడా కేంద్ర వర్గాల నుంచి దక్కింది అని అంటున్నారు. అయిదేళ్ళలో పూర్తి చేయాల్సిన పనులు వాయువేగంతో మూడేళ్ళలో పూర్తి చేసుకోవడానికి తగిన ఆర్థిక హార్థిక సాయం కేంద్రం నుంచి ఇతోధికంగా దక్కుతుంది అని అంటున్నారు. అంటే అమరావతి పోలవరం వంటి వాటికి నిధుల కొరత లేకుండా చూడడంతో పాటు



ఏపీకి దండీగా ఆర్థిక సాయం చేయడం ద్వారా కూటమి ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు కూడా సహకరించేలా మాట ఇచ్చారని అంటున్నారు. దాంతో పాటు 2026లోనే అసెంబ్లీ సీట్లను పెంచుతారని దాని వల్ల ఏపీలో మరో యాభై సీట్లు పెరుగుతాయని వాటి వల్ల అధికారంలో ఉన్న టీడీపీకే రాజకీయంగా భారీగా లబ్ది సమకూరుతుందని అంటున్నారు. ఇలా అన్ని విధాలుగా తాము అండగా ఉంటామన్న భరోసా కేంద్ర పెద్దల నుంచి రావడం వల్లనే చంద్రబాబు జమిలి ఎన్నికలకు పచ్చ జెండా ఊపారని అంటున్నారు దాంతో బాబులో స్పీడ్ పెరిగిందని ఆయన వరసబెట్టి చేయాల్సిన పనుల అజెండాను కూడా మార్చుకున్నారని మూడేళ్ళకే తన పొలిటికల్ క్యాలెండర్ ని సిద్ధం చేసుకుని ముందస్తు ఎన్నికలకు వడివడిగా అడుగులు వేస్తున్నారు అని అంటున్నారు. మొత్తం మీద చూస్తే జమిలి ఎన్నికలు టీడీపీకి జనసేనకు బీజేపీకి లాభంగా ఉండేలా ఏపీ విషయంలో కేంద్ర పెద్దలు తగిన చర్యలు తీసుకుంటారు అని అంటున్నారు. దాంతోనే రెండేళ్ళు ముందుగా ఎన్నికలు జరిగినా అదే మెజారిటీతో సీట్లు గెలిచేలా బాబు మార్క్ పాలిటిక్స్ కి తెర తీస్తున్నారు అని అంటున్నారు. సో చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# ఆ విషయంలో రాజకీయాలు చేయం... చేయనివ్వం.. కేంద్రం వెంటే ఉంటాం

మొదటి పేజి తరువాయి

వివాదాలకు తెరలేపుతున్నారని మండిపడ్డారు. దేశ భద్రత, రక్షణ విషయంలో రాజీపడే ప్రసక్తి లేదన్నారు. అలాగే దేశ భద్రత విషయంలో రాజకీయాలు ఏమాత్రం సరికాదన్నారు. ఈ ప్రాజెక్టుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వమే అనుమతులు ఇచ్చిందని ముఖ్యమంత్రి వెల్లడించారు.పర్యావరణ ప్రేమికుల కు సీఎం రేవంత్ రెడ్డి కీలక సూచనలు చేశారు. దేశం, దేశ ప్రజలు సురక్షితంగా ఉంటేనే పర్యావరణ రక్షణ గురించి ఆలోచించగలుగుతాని అన్నారు. దేశ భద్రతకు సంబంధించిన ప్రాజెక్ట్‌ను వివాదాస్పదం చేయడం సమంజసం కాదని అన్నారు. మంగళవారం వికారాబాద్ జిల్లా పూడూర్‌లో భారత నౌకాదళానికి సంబంధించిన 'వెరీ లో ఫ్రీక్వెన్సీ' (వీఎల్ఎఫ్) కమ్యూనికేషన్ ట్రాన్స్‌మిషన్ స్టేషన్ రాడార్ కేంద్రానికి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఎన్నికలప్పుడు మాత్రమే రాజకీయాల గురించి ఆలోచించాలని అన్నారు. దేశ రక్షణ విషయంలో అందరూ కలిసికట్టుగా ముందుకెళ్లాలని చెప్పారు. దేశ రక్షణలో తెలంగాణ రాష్ట్రం మరో కీలక అడుగు ముందుకు వేయబోతోందని అన్నారు. దేశ రక్షణకు సంబంధించి కీలకమైన డిఫెన్స్, ఎన్ఎఫ్‌సీ లాంటి కేంద్రాలకు హైదరాబాద్ గుర్తింపు పొందిందని తెలిపారు. కొందరు వీఎల్ఎఫ్‌ను వివాదం చేసే ప్రయత్నం చేస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. వీఎల్ఎఫ్‌తో ప్రజలకు అన్యాయం జరుగుతుందని అపోహలు కలిగించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. తమిళనాడులోనూ 1990లో ఇలాంటిదే ప్రారంభించారు. అక్కడి ప్రజలకు ఎలాంటి నష్టం జరగలేదని స్పష్టం చేశారు. దేశంలో రెండో వీఎల్ఎఫ్ మన ప్రాంతంలో రావడం గర్వకారణమని అన్నారు. ఈ ప్రాజెక్టు ప్రాధాన్యతను తెలంగాణ సమాజం గుర్తించాలని కోరారు. వివాదాలకు తెరలేపుతున్నవారు దేశ రక్షణ గురించి ఆలోచన చేయాలని రిక్వెస్ట్ చేశారు. 'ప్రాజెక్టును ప్రారంభించాలని రాజ్‌నాథ్ సింగ్ అడగగానే మేం కొనసాగించాం. దేశ రక్షణ విషయంలో రాజీ పడొద్దనే పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించాం. వీఎల్ఎఫ్‌ను ముందుకు తీసుకెళ్లేందుకు మా ప్రభుత్వం పూర్తి మద్దతుగా ఉంటుంది' అని సీఎం రేవంత్ అన్నారు. 'ఇక్కడ ఉన్న రామలింగేశ్వర స్వామి ఆలయానికి వచ్చేవారిని అనుమతించాలని కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్ గారికి విజ్ఞప్తి చేస్తున్నా. ఆలయానికి ఇబ్బందులు కలిగించొద్దని కోరుతున్నా.. ప్రజల సెంటిమెంట్, విశ్వాసాన్ని గౌరవించి ఆలయానికి వెళ్లేందుకు దారి ఇవ్వాలని కోరుతున్నా.. ఈ ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసే విద్యా సంస్థల్లో ఈ ప్రాంత ప్రజలకు 1/3వ వంతు సీట్లు కేటాయించాలని కోరుతున్నా' అని కీలక డిమాండ్లను రాజ్‌నాథ్ సింగ్ ఎదుట సీఎం రేవంత్ రెడ్డి పెట్టారు. దేశ భద్రత విషయంలో రాజీపడకూడదనే ఈ ప్రాజెక్టును కొనసాగించేందుకు తాము ముందుకు వచ్చామన్నారు. దేశ భద్రతకు హైదరాబాద్ చాలా కీలకమైన ప్రాంతమన్నారు. ఈ విషయంలో తాము ఎప్పుడూ కేంద్రం వెంటే ఉంటామని స్పష్టం చేశారు. మన పార్టీలు వేరు... సిద్ధాంతాలు వేరు కావొచ్చు... కానీ దేశ భద్రత, రక్షణ విషయంలో మాత్రం ఎప్పుడూ మీతో కలిసే ఉంటామని రాజ్‌నాథ్ సింగ్‌ను ఉద్దేశించి చెప్పారు. దేశ భద్రతకు సంబంధించిన ప్రాజెక్టుల్లో తమ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. నేవీ కాలేజీలో 25 శాతం సీట్లు స్థానికులకు ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

### బీఆర్ఎస్‌పై కిషన్ రెడ్డి ఆగ్రహం

రాడార్ ప్రాజెక్టుపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు విషయంలో బీఆర్ఎస్ నేతలు, కేసీఆర్ కుటుంబం బాధ్యతారాహిత్యంతో వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే ఈ ప్రాజెక్టుకు సంబంధించి జీవోలు ఇచ్చారన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఒకమాట... ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరో మాట మాట్లాడటం సరికాదన్నారు.నేవీ రాడర్ కేంద్రానికి సహకరించాల్సింది పోయి వ్యతిరేకంగా పోరాటం చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అంటే బీఆర్ఎస్ దేశ సమగ్రత, భద్రతకు వ్యతిరేకంగా పోరాటం చేయాలనుకుంటుందా? అని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. ఈ రాడార్ కేంద్రంతో తెలంగాణకు మరింత పేరు వస్తుందన్నారు. కాగా, రాడార్ శంకుస్థాపన కార్యక్రమంలో కేంద్రమంత్రులు రాజ్ నాథ్ సింగ్, కిషన్ రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

# రాడార్ కేంద్రానికి రేవంత్ రెడ్డి సహకరించారు : రాజ్‌నాథ్ సింగ్ అభినందన



ఢిల్లీ : వీఎల్ఎఫ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేయడం చాలా ఆనందంగా ఉందని, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్ని విధాలుగా సహకరించారని, అందుకు ఆయనకు అభినందనలు తెలుపుతున్నానని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. వికారాబాద్ జిల్లాలో వీఎల్ఎఫ్ కమ్యూనికేషన్ ట్రాన్స్‌మిషన్ రాడార్ స్టేషన్‌కు సీఎం రేవంత్ రెడ్డితో కలిసి కేంద్రమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పార్టీలు వేరైనప్పటికీ దేశ అభివృద్ధిలో అందరూ కలిసి ముందుకు సాగాలని సూచించారు. రక్షణ రంగ పరికరాల తయారీలో హైదరాబాద్‌కు మంచి పేరు ఉందని పేర్కొన్నారు. దేశాభివృద్ధిలో తెలంగాణ పాత్ర కీలకంగా మారిందన్నారు. అబ్దుల్ కలాం జయంతి రోజున ఇలాంటి కార్యక్రమం చేపట్టినందుకు ఆనందంగా ఉందన్నారు. దేశ భద్రతకు వీఎల్ఎఫ్ స్టేషన్ కీలకమని, కమ్యూనికేషన్ విషయంలో ఈ కమాండ్ సెంటర్ ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. దేశ రక్షణకు ఇది అనేక విధాలుగా ప్రయోజనకరంగా ఉంటుందన్నారు.

పావురాలు, గుర్రాల దశ నుంచి ఈ స్థాయికి వచ్చాం

కమ్యూనికేషన్ రంగంలో మనం పావురాలు, గుర్రాల దశ నుంచి ఇక్కడి వరకు వచ్చామన్నారు. తపాలా వ్యవస్థను అనేక ఏళ్ళు వినియోగించుకున్నామని కేంద్రమంత్రి అన్నారు. ఇప్పుడంతా ఇంటర్నెట్ యుగమని, క్షణాల్లో సమాచారం ప్రపంచానికి చేరుతోందన్నారు. సమాచార విప్లవం ఈరోజు దేశాలన్నింటినీ దగ్గర చేస్తోందని పేర్కొన్నారు. విద్య, వైద్య రంగాల్లో సమాచార విప్లవం కీలక పాత్ర పోషిస్తోందని వెల్లడించారు. ఇంట్లో కూర్చొని అనేక కోర్సులు నేర్చుకుంటున్నారని తెలిపారు.

రాడార్ స్టేషన్ కోసం 2,900 ఎకరాల భూమి అప్పగింత

ఇది భారత నౌకాదళానికి సంబంధించిన వెరీ లో ఫ్రీక్వెన్సీ (వీఎల్ఎఫ్) రాడార్ స్టేషన్. వికారాబాద్ జిల్లా పూడూరు మండలం దామగుండం అటవీ ప్రాంతంలో శంకుస్థాపన చేశారు. రాడార్ స్టేషన్ నిర్మాణం కోసం ఇక్కడి అటవీ శాఖకు చెందిన 2,900 ఎకరాలను తెలంగాణ ప్రభుత్వం ఆరు నెలల క్రితం విశాఖపట్నం కేంద్రంగా పని చేస్తోన్న ఈస్టర్న్ నావెల్ కమాండ్‌కు అప్పగించింది. ఇక్కడ రాడార్ స్టేషన్‌తో పాటు టౌన్ షిప్‌ను నిర్మిస్తున్నారు. ఇందులో స్కూల్స్, హాస్పిటల్స్, బ్యాంకు, మార్కెట్ తదితర సదుపాయాలు ఉండనున్నాయి. ఈ టౌన్ షిప్‌లో 3,000 మంది వరకు నివసించే అవకాశం ఉంటుంది. ఉద్యోగులు, సిబ్బంది 600 మందికి పైగా ఉంటారు. ఈ వీఎల్ఎఫ్ కేంద్రాన్ని 2027 లోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

# అనుచరుల కోసం డబ్బు కట్టిన మంత్రి నారాయణ.. మూడు షాపులు దక్కిన వైనం!

అమరావతి : ఏపీలో కొత్త వైన్ షాపులను నిన్న లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక చేశారు. లాటరీలో షాపు తగిలిన వారు సంతోషంలో మునిగిపోగా... అదృష్టం వరించని వారు నిరాశలో మునిగిపోయారు. పలు చోట్ల పలువురు వ్యక్తులు సిండికేట్లుగా ఏర్పడి వారి అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. రాజకీయ నాయకులు సైతం పెద్ద ఎత్తున వైన్ షాపుల కోసం పోటీ పడ్డారు. నంద్యాల దివంగత మాజీ ఎంపీ, పారిశ్రామికవేత్త ఎస్పీవై రెడ్డి కుమార్తె సుజల మద్యం షాపుల టెండర్లలో పలు షాపులు దక్కించుకున్నారు. అన్నమయ్య జిల్లాలో 6, అనంతపురం జిల్లాలో 4, కర్నూలు జిల్లాలో ఒకటి సహా పీలేరు నియోజకవర్గంలో కూడా షాపులు దక్కించుకున్నారు. మరోవైపు, ఏపీ మంత్రి పి.నారాయణ తన అనుచరుల కోసం రూ. 2 కోట్ల సొంత డబ్బుతో 100 మంది కార్యకర్తల ద్వారా వైన్ షాపులకు దరఖాస్తు చేశారు. 100 దరఖాస్తులకు గాను వారికి మూడు షాపులు దక్కాయి. దీంతో, ఒక్కో షాపును ఆరుగురు డివిజన్ ఇన్చార్జీల చొప్పున 18 మందికి ఆయన షాపులను అప్పగించారు. చట్టబద్ధంగా వ్యాపారం చేసుకోవాలని వారికి సూచించారు. ఇంకోవైపు, మచిలీపట్నంలోని ఒకటో నెంబర్ షాపును కర్ణాటకకు చెందిన మహేశ్ బాటే దక్కించుకున్నారు. రెండో షాపు ఉత్తరప్రదేశ్ కు చెందిన లోకేశ్ చంద్ కు దక్కింది. ఈ రెండు షాపులను తమకు ఇవ్వాలని వారితో స్థానిక వ్యాపారులు బేరసారాలకు దిగినట్టు సమాచారం.

# కరెంటు కోతల కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పుడు వాతలు పెట్టేందుకు రెడీ అవుతోంది: కేటీఆర్




హైదరాబాద్ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలతో విరుచుకుపడ్డారు. కరెంటు కోతల కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పుడు వాతలు పెట్టేందుకు రెడీ అవుతోందని చురకలంటించారు. విద్యుత్ సరఫరా కు గ్యారెంటీ లేదు కానీ విద్యుత్ షాకులు మాత్రం గ్యారెంటీ అని అన్నారు. పవర్ లోకి వచ్చి ఏడాది కాకముందే పవర్ చార్జీలు పెంచి జనం మీద భారం మోపడానికి సిద్ధమయ్యారంటూ దుయ్యబట్టారు. ఈ మేరకు ఎక్స్ (ట్విట్టర్) వేదికగా కేటీఆర్ ఒక పోస్ట్ పెట్టారు. "కరెంటు కోతల కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు వాతలు పెట్టేందుకు రెడీ అవుతుంది. విద్యుత్ సరఫరాకు గ్యారెంటీ లేదు కానీ విద్యుత్ షాకులు మాత్రం గ్యారెంటీ. పవర్‌లోకి వచ్చి ఏడాది కాకముందే, పవర్ చార్జీలు పెంచి జనం మీద భారం మోపడానికి సిద్ధమయ్యారు. ఫ్రీ కరెంట్ అమలు అంతంత మాత్రమే. గృహజ్యోతి పథకం ఇంకా గ్రహణంలోనే ఉంది. జీరో బిల్లుల కోసం ఎదురు చూస్తుంటే గుండె గుభిల్లు మనేలా కొత్త బాదుడు షురూ చేస్తారా. ఒక్క గ్యారెంటీ సక్కగా అమలు చేసింది లేదు. 420 హామీలకు అతీ గతీ లేదు. మరి ఖజానా ఖాళీ చేసి ఏం చేస్తున్నారు. 9 నెలల్లో ఎడాపెడా అప్పులు చేసి తెచ్చిన రూ.77 వేల కోట్లు ఎటుబాయే? మళ్లీ ఈ నడ్డి విరిగే వడ్డనలు ఎందుకు? అసమర్థుల పాలనలో ఆఖరికి మిగిలేది కోతలూ వాతలే" అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

# ఈవీఎంల ద్వారా ఎన్నికలు నిర్వహిస్తే పోటీ చేయను: రాచమల్లు శివప్రసాద్ రెడ్డి

మొదటి పేజి తరువాయి

నిర్వహించాలని వైసీపీ అధినేత జగన్ ఇటీవల వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. తాజాగా ఆ పార్టీ అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ... 2029 ఎన్నికల్లో ఈవీఎంల ద్వారా ఎన్నికలను నిర్వహిస్తే పోటీ చేయబోనని తెలిపారు. ఈవీఎంల ద్వారా ఎన్నికలను నిర్వహిస్తే... పోటీ చేసినా ఫలితం ఉండదని చెప్పారు. ఈ ఎన్నికల్లో మోసం జరిగినట్టుగానే 2029 ఎన్నికల్లో కూడా మోసం జరుగుతుందని అన్నారు. బ్యాలెట్ పేపర్ ద్వారా ఎన్నికలు జరిగితేనే స్వచ్ఛమైన ఫలితాలు వస్తాయని చెప్పారు. ఈ ఏడాది జరిగిన ఎన్నికల్లో తీర్పు ఇచ్చింది ప్రజలు కాదని... ఈవీఎంలు తీర్పును వెలువరించాయని శివప్రసాద్ రెడ్డి అన్నారు. ఈ విషయాన్ని కౌంటింగ్ పూర్తయిన అరగంటకే ప్రజలు చెప్పారని తెలిపారు. ఈవీఎంలపై ఎంతో మంది అనుమానాలు వ్యక్తం చేసినప్పటికీ... ఎన్నికల సంఘం స్పందించడం లేదని విమర్శించారు. ఈ అంశంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలని కోరారు. వచ్చే ఎన్నికలను కూడా ఈవీఎంల ద్వారా నిర్వహిస్తే... ఎన్నికల ఫలితాల కోసం ఎదురు చూడాల్సిన అవసరం కూడా లేదని అన్నారు. టెక్నాలజీని ఉపయోగించుకుని, ఈవీఎంల ద్వారా అప్రజాస్వామిక విధానంలో నాయకులు ఎన్నికవుతుంటారని విమర్శించారు.

# వైసీపీ నేత సజ్జలకు లుక్ అవుట్ నోటీస్



: వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి పేరుతో లుక్ అవుట్ నోటీసులు జారీ కావడం సంచలనంగా మారింది. లుక్ అవుట్ నోటీసుల జారీ నేపథ్యంలో ఇమిగ్రేషన్ సిబ్బంది సజ్జలను ఢిల్లీ ఎయిర్ పోర్టులో అడ్డుకున్నారు.దతాను ఇప్పుడే విదేశాల నుంచి తిరిగి వచ్చానని, తనకు కనీస సమాచారం లేకుండానే లుక్ అవుట్ నోటీసులు జారీ చేయడం ఏమిటంటూ ఈ సందర్భంగా మండిపడ్డారు. ఈ వ్యవహారంపై మరింత సమాచారం తీసుకున్న ఇమిగ్రేషన్ అధికారులు సజ్జలకు ఏపీ వెళ్ళేందుకు అనుమతించారు. అప్పటికే హైదరాబాద్‌కు వెళ్లే విమానం టేకాఫ్ కావడంతో మరో విమానం కోసం సజ్జల వేచి చూడాల్సి వచ్చింది. వైసీపీ నేతలు సజ్జల రామకృష్ణారెడ్డి, లేళ్ల అప్పిరెడ్డి, దేవినేని అవినాష్, తలశిల రఘురాం పై లుక్ అవుట్ నోటీస్ జారీ చేసినట్లు పోలీస్ వర్గాల కథనం. లుక్ అవుట్ నోటీస్ కారణంగా ఢిల్లీ ఎయిర్ పోర్టులో సజ్జల రామకృష్ణారెడ్డిని అడ్డుకున్నారంటూ వైసీపీ ఆరోపణలు చేస్తోంది. హీరోయిన్ జేత్వాణి పై వేధింపుల కేసులో వైసీపీ సలహాదారులు సజ్జల ఆరోపణలు ఎదుర్కుంటున్నారు. అటు దేవినేని , తలశిల, లేళ్ల అప్పిరెడ్డిలు టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో నిందితులుగా ఉన్నారు.

## వెంటనే గురుకుల పాఠశాలల అద్దె చెల్లించాలి

**- ఎం డి రియాజ్ అలీ బి.ఆర్.యెస్ విద్యార్థి విభాగం మక్తల్ నియెజికవర్గా అధ్యక్షులు**





(గౌతమ్ న్యూస్): రాష్ట్రవ్యాప్తంగా గురుకుల పాఠశాలలకు తాళాలు సిగ్గు సిగ్గు కనీసం అద్దె కూడా చెల్లించట్లేదు కాంగ్రెస్ ప్రభుత్వం అద్దె చెల్లించకపోవడంతో.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలకు, వసతి గృహాలకు తాళాలు వేస్తున్న బిల్డింగ్ యజమానూలు. తుంగతుర్తి, బెల్లంపల్లి, తాండూరు, వరంగల్, భూపాలపల్లి, హుజూర్ నగర్లలో పాఠశాలలు మరియు





వసతి గృహాలకు తాళాలు వేస్తున్న బిల్డింగ్ యజమానూలు. దీంతో దసరా సెలవులు ముగియడంతో నేటి నుంచి పాఠశాల ప్రారంభం కావడంతో పాఠశాలకు వచ్చిన విద్యార్థులు, ప్రిన్సిపల్, అధ్యాపక బృందం , సిబ్బంది మొత్తం పాఠశాల గేటు ముందు నిలబడ్డారు.

## అర్హత ఉన్న ప్రతి కాంట్రాక్ట్ కార్మికుడికి ఖాతాల్లో బోనస్ వేయాలి

**కాంగ్రెస్ జిల్లా నాయకులు కోరం సురేందర్**



టేకులపల్లి (గౌతమ్ న్యూస్): ఎల్.ఎస్.ఎన్ కంపెనీ లో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారం కొరకు మూడు షిఫ్ట్ ల కార్మికులతో, పి ఓ ని కలిసిన సింగరేణి ఇల్లందు ఏరియా ఐ.ఎన్. టి.యు.సి గౌరవ సలహాదరులు కోరం సురేందర్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు సింగరేణి ఇచ్చే బోనస్ 5000/-రూపాయలు (స్పెషల్ ఇన్సెంటివ్ ) గురించి, అర్హత ఉన్న ప్రతి కార్మికుడికి బోనస్ వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని పి ఓ కు తెలియజేశారు. అనంతరం ఎల్.ఎస్.ఎన్ కంపెనీ సమస్యల గురించి పి ఓ సమక్షంలో లో వివరణ కోరగా ఎల్.ఎస్.ఎన్ ప్రాజెక్ట్ రాజమోహన్ రెడ్డి మాట్లాడుతూ. జనరల్ మేనేజర్ తో మాట్లాడి రేపు లేదా ఎల్లుండి కార్మికుల ఖాతా లో బోనస్ జమ చేసే విధంగా చర్యలు తీసుకుంటామని వివరణ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో ఐ.ఎన్. టి.యు. సి యూనియన్ ప్రెసిడెంట్ ముచ్చ సుధాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు భూక్యా సర్దార్, మోకాళ్ళ పోషాలు, మరియు యూనియన్ సభ్యులు కార్మిక నాయకులు,పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం చేసిన కోట్పల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నారాయణ్ రెడ్డి



తాండూర్ వికారాబాద్ జిల్లా(గౌతమ్ న్యూస్): పెద్దేముల్ మండలం మంబాపూర్ లో చాకలి



వెంకటమ్మ స్వర్గస్తులవడంతో వెంకటమ్మ కు నివాళులర్పించారు కోటపల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నారాయణ్ రెడ్డి. మృతురాలికి ఒక కూతురు ఒక కుమారుడు ఉన్నారు వారు అనాథలు గా ఐనందున వెంకటమ్మ అత్త బీమమ్మ కు 5000 రూపాయలు తన వంతు ఆర్థిక సాయం చేశారు. అలాగే తింసాన్పల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జోగు సాయప్ప చనిపోవడంతో వారి కుటుంబాన్ని నారాయణ్ రెడ్డి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మైపూస్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, టి అంజీలయ్య, శివ రెడ్డి, దాస్తప్ప, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డికి ఘన స్వాగతం పలికిన టేకులపల్లి కాంగ్రెస్ నాయకులు



టేకులపల్లి (గౌతమ్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పినపాక నియోజకవర్గం లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు వెళ్లే మార్గమధ్యంలో ఉన్న టేకులపల్లి లో కాంగ్రెస్ కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలుకుతూ టేకులపల్లి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆవరణలో శాలువాతో సన్మానం చేశారు, సన్మానం చేసిన వారిలో కాంగ్రెస్ పార్టీ మండల ముఖ్య నాయకులు, ఇస్లావత్ రెడ్యానాయక్, బోడ మంగీలాల్ నాయక్, బోడ సరిత, గడ్డం మధుసుధన్ రెడ్డి, బానోత్ భద్రు నాయక్, బాబు, లక్ష్మయ్య, నమోదర్ నాయక్, బానోత్ సక్రు నాయక్, మోకాళ్ళ పోషాలు, గుడిపూడి కృష్ణయ్య, నగేష్ నాయక్, శ్రీకాంత్, నెహ్రూ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## 14వ విడుత ప్రజా వేదిక సమావేశం



సైదాపూర్(గౌతమ్ న్యూస్): సైదాపూర్ మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం రోజున 14వ విడుత సామాజిక తనిఖీల్లో భాగంగా మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజా వేదిక సమావేశం నిర్వహించ నైనది ఇట్టి ప్రజా వేదిక డిఆర్డిఓ శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈజీఎస్ క్రింద ఏప్రిల్1/2023 నుండి మార్చి31/2024 వరకు చేపట్టిన ఉపాధి హామీ పనులపై గ్రామపంచాయతీల వారిగా నివేదిక చదివి వినిపించినారు అలాగే ఇట్టి సామాజిక తనిఖీలోమొత్తం రూపాయలు 61,338 సంబంధికుల నుండి రికవరికై ఆదేశాలు జారీ చేసినారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ శ్రీధర్,ఏపీడి కృష్ణ, విజిలెన్స్ ఆఫీసర్ వెంకటేశ్వర్ రెడ్డి,ఎంపీడీవో యాదగిరి ,ఎమ్మార్వో మంజుల, స్టేట్ రిసోర్స్ పర్సన్ సాయిలు,ఎంపీవో బషీరుద్దీన్, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు మరియు పంచాయతీ కార్యదర్శులు,అంబుడ్స్ మెన్ లక్ష్మీనారాయణ,ఏపీవో రాణి, ఇసి,ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## మానుకోట మున్సిపాలిటీ 50 కోట్లు ఎక్కడ.....! ఎవరు స్వాహా చేశారు....?

### సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సారథి రెడ్డి




మానుకోట జిల్లా ప్రతినిధి (గౌతమ్ న్యూస్): కేసిఆర్ ఇచ్చిన 50 కోట్ల నిధులు ఎప్పుడు వస్తాయి, మానుకోట మున్సిపాలిటీవార్డులు అభివృద్ధి ఎప్పుడు జరుగుతాయి. సిపిఐ మహబూబాబాద్ పట్టణ సమితి సమావేశంలో సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సారథి రెడ్డి. మంగళవారం భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మహబూబాబాద్ పట్టణ సమితి సమావేశం చింతకుంట్ల వెంకన్న అధ్యక్షతన స్థానిక వీరభవన్ లో జరిగింది. సమావేశం ప్రారంభానికి ముందు ప్రొఫెసర్ సాయిబాబా కి సిపిఐ పట్టణ సమితి వైపు నుండి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ పట్టణ సమితి సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సారథి రెడ్డి మాట్లాడుతూ నాడు ఎన్నికల సమయంలో మానుకోట మున్సిపాలిటీకి కేసిఆర్ ప్రకటించిన 50 కోట్ల రూపాయలు ఏమైనాయి, ఇంతవరకు 50 కోట్ల రూపాయలు మానుకోట అభివృద్ధి లేదు. కేవలం మాటలు చెప్పి మానుకోట ప్రజలను ఆనాటి టిఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఇంతవరకు దానిపై ప్రస్తుతం ఉన్న నాటినేటి బిఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు నోరు మెదపడం లేదు, 50 కోట్లు మా కేసీఆర్ ఇచ్చింద్రు అని నాడు గొప్పలు చెప్పుకొని నేడు ముఖం చాటేశారు, కనీసం ఇప్పుడున్న మున్సిపాలిటీ చైర్మన్ బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ఏ రోజైనా 50 కోట్ల నిధులపై మాట్లాకుండా, 50 కోట్ల నిధులు మానుకోటకు వచ్చేవరకు పోరాటం ఆగదు. సిపిఐ ఆధ్వర్యంలో మానుకోట అభివృద్ధికై దశల వారి పోరాటాలు ప్రజల పక్షాన నిలబడి చేస్తామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెరుగు కుమార్, దేశపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిళ్ల సాంబలక్ష్మి, వెలుగు శ్రావణ్, ఎండి మహమూద్, ఆబోతు అశోక్, మాలోతు రవీందర్, వంకాయలపాటి చిరంజీవి, మందశంకర్, నాగేల్లి యాకమ్మ, పురం భాగ్యమ్మ, ఎర్రోజు పద్మ, ముదుసు రాణి, ఆలేటి మహేష్, గాదం శ్యాం ప్రసాద్ యాదవ్, హర్షవర్ధన్, శ్రీనాథ్, కూరాకుల పాల్ దిలీప్, దొనికేని రమేష్, నటరాజ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ వేదికగా రాజీవ్ చౌరస్తా

### రాజకీయం తెలవదు సమాజం పట్ల అవగాహన లేదు!! తెలిసింది కొంచెం తెలియని విషయం చాలా!! ఇది నిజం కాదా!!



నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో(గౌతమ్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలోనే కాదు ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాల్లో వేగవంతంగా విద్యాపరంగా వ్యాపార పరంగా, రాజకీయంగా, సామాజికంగా విస్తరిస్తున్న వనపర్తి పట్టణంలో మహనీయుల విగ్రహాల పక్కన రాజకీయాలు అంతులేకుండా అదుపు లేకుండా విచ్చలవిడిగా అవగాహన లేకుండా మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్యకు అంతరాయం కలిగిస్తున్నట్లు వనపర్తి జిల్లా ప్రజల ఆరోపిస్తున్నారు, ఇది నిజం కాదా?! తప్పుడు కథనాలను తప్పుడు వార్తలను స్వార్థపరమైన వార్తలను ఈ మధ్యకాలంలో కొన్ని ఆన్లైన్ దినపత్రికల్లో ముద్రించి బ్లాక్ మెయిల్ చేస్తున్నారు, నచ్చకపోతే ఒకటి నచ్చితే మరొకటి ఆధారం లేని నిరాదరమైన ఆరోపణలు చేస్తూ తప్పుడు కథనాలను పోలీసులను బెదిరించడానికి గుర్తుపెట్టుని లోకల్ పత్రికలు ముద్రించుకొని స్వార్థ ప్రయోజనాల కోసం పాల్పడుతున్న నిజం కాదా, కుల సంఘాలను అడ్డం పెట్టుకొని



జర్నలిస్టు సంఘాలు ఈ మధ్యకాలంలో చిన్న చిన్న పత్రికలో చిన్న చిన్న వార్తలు ప్రచురించి వర్తక సంఘం నాయకులను కిరాణా షాపుల్లో నల్ల బెల్లం అమ్ముతున్నారని, మరోపక్క వనపర్తి లో గుర్తుతెలియని వ్యక్తులు అంతరిస్తున్నట్లు తప్పుడు న్యూస్ రాయడం ఎంతవరకు సమంజసమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు, ఈ విషయం పట్ల పోలీసులు ఇంటిలిజెన్సీ విభాగం నిషితంగా పరిశీలిస్తున్నట్టు తెలుస్తుంది, కొంతమంది మెడికల్ షాపులలో తొత్తుగా పనిచేస్తూ బ్లాక్మెయిల్ చేస్తూ మెడికల్ షాపుల్లో బిల్లులు ఇవ్వకుండా కోట్ల రూపాయలు సంపాదిస్తున్న వ్యాపారులకు కొమ్ముకాస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి, అయినా అలాంటి వ్యక్తులను వెంటబెట్టుకొని నిత్యం చనిపోవడానికి దగ్గర పడిన సందర్భంలో మతిస్థిమితం లేక కుటుంబాన్ని పోషించలేక తల్లితండ్రులు సంపాదించిన ఇల్లు ఆస్తులు అడ్డం పెట్టుకొని అడ్డంగా దోపిడీ చేస్తున్నారని ఆరాధన వస్తున్నాయి, ఇది నిజం కాదా, ఉదయం 6 గంటల నుంచి బయటకు వచ్చి అన్ని టీ కొట్టుల్లో టీ తాగడం ఆ తర్వాత వ్యక్తుల సమాచారం తెలుసుకోవడం తప్పుడు కథనాలు రాయడం ఒక జర్నలిస్టుకు ఇది సరిపోతుందా దానికి సమాధానం చెప్పాలి, ఒక వ్యక్తి గురించి మాట్లాడినప్పుడు తన వ్యక్తిత్వం గురించి కుటుంబ విషయాల గురించి ఎందుకు గుర్తుకురాలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు, ఎన్ని చెప్పినా చివరిగా ఎప్పుడు ఏ సమయంలో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి తెలిసి కూడా తల పైన ఉన్న బ్రెయిన్ దెబ్బతినింది కాబట్టి తక్షణమే నీరో సర్జన్ సైకియాట్రిక్ తో చికిత్స పొందాలని ప్రజలు సూచిస్తున్నారు, ఈ మధ్యకాలంలో తప్పుడు కథనాలను అడ్రస్ లేని దినపత్రికల్లో ముద్రించుకొని బ్లాక్ మెయిల్ చేస్తున్న వ్యక్తులను వెంటనే పోలీసులు అరెస్టు చేయాలని లేని పక్షంలో రాష్ట్ర ముఖ్యమంత్రి జోక్యం చేసుకోక



తప్పదు చట్టానికి ఎవరు చుట్టం కాదు, అక్రిడేషన్ కార్డులను వెంటనే పోలీసులు స్వాధీనం చేసుకోవాలని వనపర్తి జిల్లా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు, ఏ చెట్టుకున్న గాలి ఆ చెట్టుకుంటుంది కానీ వనపర్తిలో ఏమి తెలవక ఇక్కడ ఉన్న ప్రజలు అమాయకులు కాబట్టి కొంతమంది విర్రవీగుతూ సమాచార చట్టం మానవ హక్కుల కమిషనర్ అని పేరుతోన ప్రభుత్వ కార్యాలయంలో ఫిర్యాదు చేయడం అధికారులను బెదిరించడం చివరకు తన కుటుంబంలో భార్యను కూడా బెదిరించడం వంటి సంఘటన పైన కచ్చితంగా ఏదో ఒక రోజు బయటపడక తప్పదని కొంతమంది ఎక్కడ బ్రతకలేక వనపర్తి ప్రాంతంలో నివసిస్తూ వడ్డీ వ్యాపారం చేస్తూ బ్లాక్మెయిల్ చేస్తూ రాజీ చౌరస్తాలో, ఇతర ప్రాంతాలలో కూరగాయల వ్యాపారస్లను బెదిరించి చిట్టీల పేరుతున్న దోపిడీ చేస్తున్న చరిత్ర ఉంది, అందరు బయటికి రావాలి తప్పకుండా వస్తారు, అంతవరకు వదిలిపెట్టే ప్రసక్తి లేదని ప్రజలు అంటున్నారు, దేశ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ విగ్రహం దగ్గర, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం దగ్గర, దేశ స్వతంత్ర కోసం పోరాటం చేసిన మాత్మ గాంధీ గాంధీ చౌరస్తాలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ కోసం పోరాటం చేసిన పొట్టి శ్రీరాములు చౌరస్తాలో, నిత్యం దోపిడి అందుకే పోలీసులు రాజకీయ పార్టీల నాయకులు విద్యావంతులు మేధావులు, కవులు కళాకారులు ఈ విషయాల పట్ల దృష్టి కేంద్రీకరించాలని వనపర్తి జిల్లా ప్రజలు కోరుతున్నారు, తప్పుడు వార్తలు రాస్తున్న జర్నలిస్టు పైన వెంటనే వనపర్తి జిల్లా ప్రజలు చెంప దెబ్బ కొట్టడానికి సిద్ధంగా ఉన్నట్టు తెలుస్తుంది, ఎంతకాలం ఈ వ్యవస్థ సమాజ మారిన మనుషులు మారలేదు చెప్పేవాడు మారలేదు కానీ ఇతర వ్యక్తుల గురించి మరమని చెప్పడం ఎంతవరకు సమంజసం దీనికి సమాధానం చెప్పాలి, కుటుంబ విషయాలను పట్టించుకోకుండా నిత్యం రోడ్లపై తిరుగుతున్న దొంగలకు ఏ విధంగా పూట గడుస్తుందో బహిరంగంగా ప్రజలకు సమాధానం చెప్పాలి, కొంతమంది ఆస్తులు ఆదాయం ఇతర వనరులు పుష్కలంగా ఉన్నాయి, అది తెలియకుండా ఇతర వ్యక్తుల గురించి మాట్లాడే కంటే ముందు నీ సంగతి తెలుసుకొని ప్రజలకు సమానం చెప్పాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు,

## రాష్ట్ర స్థాయి వ్యాస రచన పోటీల్లో రాజోలు విద్యార్థుల ప్రతిభ




మానుకోట జిల్లా ప్రతినిది(గౌతమ్ న్యూస్): రెండు తెలుగు రాష్ట్రాలలో వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల, జిల్లా మరియు రాష్ట్ర స్థాయిలో సంరక్షణ మరియు గృహ పనులకు గృహిణులకు వేతనం ఇవ్వాల/వద్దా అనే అంశంపై వ్యాసరచన పోటీలను ఆ సంస్థ ఫౌండర్ మోహన్ కంద రిటైర్డ్ సిఎస్, ఐఏఎస్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. రాష్ట్ర స్థాయిలో ఈ పోటీలను గత నెల 25 న నిర్వహించి, ఈ నెల అక్టోబర్ 15 న విజేతలను అతిధులు క్రికెటర్ వివియస్ లక్ష్మణ్ మరియు తెలంగాణ పాఠశాల విద్యా డైరెక్టర్ నరసింహారెడ్డి లచే ప్రకటించగా జడ్పీహెచ్ఎస్ రాజోలు పదవ తరగతి విద్యార్థులు అయిన బి.శివ మరియు డి అంగద్ లను రాష్ట్రస్థాయిలో ద్వితీయ విజేతలుగా ప్రకటించారు. ఇందుకుగాను నగదు బహుమతి 30 వేల రూపాయలను విజేతలకు అందజేయడం జరుగుతుంది. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవి కుమార్, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు, గైడ్ టీచర్ కిషన్ మరియు ఉపాధ్యాయ బృందం వెంకటరెడ్డి, దామోదర్, మోహన్, బీకు, సురేష్, రవికుమార్, రాజేశ్వరి, కాశీనాథ్, వసంత, సతీష్, కిరణ్, భవాని, ప్రభాకర్, ప్రకాష్ మరియు తోటి విద్యార్థిని, విద్యార్థులు, గ్రామ పెద్దలు అభినందించారు.

## కొయ్యలగూడెం మండలం లో ప్రారంభం అయిన పల్లె పండుగ కార్యక్రమం



**పోలవరం (గౌతమ్ న్యూస్): ప్రతినిధి 15/10/2024 :ఏలూరు జిల్లా.. కొయ్యలగూడెం మండలం లో ప్రారంభం అయిన పల్లె పండుగ కార్యక్రమం...కార్యక్రమంలో పలు గ్రామాలలో సీసీ రోడ్లు , మంచినీటి సరఫరా పనుల కు పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు శంకుస్థాపన....కార్యక్రమంలో పాల్గొన్న ట్రైకార్ ఛైర్మన్ బోరగం శ్రీనివాస్ , జన సేన జిల్లా కార్యదర్శి రవి కుమార్ , ఇతర కూటమి నేతలు...**

## ఏపీజే అబ్దుల్ కలాం93వ జన్మదిన వేడుకను పురస్కరించుకొని

**ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ**



గార్ల (గౌతమ్ న్యూస్): మాజీ రాష్ట్రపతి శాస్త్రవేత్త, ఏపీజే అబ్దుల్ కలాం 93 వ,జన్మదిన వేడుకను పురస్కరించుకొని స్థానిక పట్టణ కేంద్రం ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ హనుమంతరావు చేతుల మీదుగా రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మండల పరిధి జిల్లా పరిషత్ సీతంపేట ఉన్నత పాఠశాలలో అబ్దుల్ కలాం చిత్రపటానికి, స్త్రీ శక్తి అవార్డు గ్రహీత శంషాద్ భేగం, విద్యార్థులతో పాటుగా పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. పిల్లలకు చాక్లెట్స్ బిస్కెట్స్ ఆమె చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు దేశభక్తిని అలవర్చుకొని, అబ్దుల్ కలాం ను ఆదర్శంగా తీసుకొని, భవిష్యత్తులో దేశానికి సేవలు అందించాలన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి కృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం కు ఘన నివాళులు అర్పించారు. కృష్ణ గౌడ్ తో పాటుగా పి వెంకటేశ్వర్లు, పృద్వి, దీకొండ రాము ఉన్నారు., ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బి లావణ్య శ్రీనివాస్ సంపసాల ఉపేందర్ రావు సర్వీస్ భాస్కర్ జి వెంకన్న ఈసం రాజు కె వీరభద్రం ఎర్ర నాగుల రామచంద్రు ధావుర్య ఈసం రాజు చంద్రు జానీ షఫీ పంచాయితీ కార్యదర్శి అభిలాష్, టీచర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

## కడుపునొప్పి భరించలేక మహిళ ఆత్మహత్య



నల్లబెల్లి (గౌతమ్ న్యూస్): మండలంలోని లంకాలపల్లి గ్రామంలో ఓ మహిళ కడుపునొప్పి భరించలేక క్రిమిసంహారక మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడింది లింగాలపల్లి గ్రామానికి చెందిన గాదం రాజు భార్య మంజుల (30) కడుపునొప్పి తీవ్రం తట్టుకోలేక జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉన్న క్రిమిసంహారక మందు సేవించింది ఇది గమనించిన కుటుంబ సభ్యులు నర్సంపేట ఆసుపత్రికి చికిత్స కోసం తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది మృతురాలికి కుమారుడు కూతురు ఉన్నారు మృతురాలి తమ్ముడు నానబోయిన నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సాయి రమణ తెలిపారు.

# కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

**జాంకీ రాజు మెమోరియల్ 32వ వార్షికోత్సవ క్రీడలను జయప్రదం చేయాలి.**



గార్ల **(గౌతమ్ న్యూస్):** స్థానిక మండల పరిధి మర్రిగూడెం గ్రామంలో శ్రీ వేట వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 18వ తేదీ నుండి 20 వరకు నిర్వహించుచున్న నాలుగు జిల్లాల గ్రామీణ స్థాయి క్రీడలు,డ్యాన్స్ బేబీ డ్యాన్స్ పోటీలను జయప్రదం చేయాలని బంజార యువజన సేవా సంఘం వ్యవస్థాపకులు భూక్య కస్నానాయక్ కోరారు. మండలంలోని మంరిగూడెం గ్రామంలో మంగళవారం వార్షికోత్సవ క్రీడలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. వెంకటేశ్వర మిని స్టేడియంలో జరిగే మహబూబాబాద్,ఖమ్మం, వరంగల్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కబడ్డీ పోటీలకు 500 రూపాయలు ఎంట్రీ ఫీజు కాగా, మొదటి బహుమతి 20000,రెండవ బహుమతి 15000,మూడవ బహుమతి 10000, నాల్గవ బహుమతి 5000,డ్యాన్స్ బేబి డ్యాన్స్ లకు ఎంట్రీ ఫీజు 200 రూ,లు కాగా, మొదటి బహుమతి 5000,రెండవ బహుమతి 3000, మూడవ బహుమతి 2000 ఇవ్వడం జరుగుతుందని చెప్పారు.ఆసక్తి గల క్రీడా కారులు ఈ నెల 17 తేదీ లోగా టీం పేర్లు నమోదు చేసుకోవాలని అన్నారు. మరిన్ని వివరాలకు మాళోత్ శాంతి కుమార్: 9492064002,భూక్య రమేష్:9010943242 నెంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టి.టి.ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బానోతు వీరు నాయక్,అడ్వకేట్ హరినాయక్,సభ్యులు బి మల్లిబాబు, భూక్య. రాంసింగ్, మాళోత్. శాంతికుమార్, బాదావత్.చిన్న నాయక్,అశోక్,చిరంజీవి, రమేష్, చిన్ని, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

## హరీష్ రావుకు శుభాకాంక్షలు తెలియజేసిన

# హత్నూర బిఆర్ఎస్ నాయకులు



నర్సాపూర్ **(గౌతమ్ న్యూస్):** మంగళవారం మాజీ మంత్రివర్యులు,సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు ను హైదరాబాద్ లోని వారి నివాసంలో కలిసి దసరా పండుగను పురస్కరించుకొని శు భాకాంక్షలు తెలియజేసిన సంగారెడ్డి జిల్లా భారత రాష్ట్ర సమితి ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు శివశంకర్ రావు, దౌల్తాబాద్ పట్టణ బిఆర్ఎస్ అధ్యక్షులు అజ్జు, సురేష్ గౌడ్,సౌకత్, అశ్వక్, అస్లాం తోపాటు తదితరులు పాల్గొన్నారు.

# మనస్థాపం చెంది మహిళ ఆత్మహత్య



నల్లబెల్లి**(గౌతమ్ న్యూస్):** మండలంలో ని అర్శనపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గల బొల్లోనిపల్లి గ్రామ ఊర చెరువులో పడి మహిళ మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది ఈ మేరకు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బోల్లోనిపల్లి గ్రామానికి చెందిన మియాపురం సుగుణ ఆమెకు నలుగురు కుమారులు కాగా ఒక కుమారుడు మరియు తన భర్త కొంతకాలం క్రితం మృతి చెందారు అప్పటినుండి మృతురాలు తీవ్ర మనోవేదనకు చెంది అనారోగ్యానికి గురైంది ముగ్గురు కుమారులు ప్రతినెల ఆసుపత్రికి తీసుకువెళ్లి వైద్యం చేపించిన ఆరోగ్యం నయం కాకపోవడంతో తీవ్ర మనోవేదన చెందిన మహిళ నిన్న మధ్యాహ్నం ఎవరు లేని సమయం చూసి ఇంట్లో నుండి బయటికి వెళ్లి ఆత్మహత్య చేసుకుంది కుటుంబ సభ్యులు వచ్చి చూసేసరికి కనిపించకపోవడంతో ఆచూకీ కోసం వెతుకుతుండగా గ్రామ శివారులోని ఊరగుంట చెరువు కట్టమీద చెప్పులు చేతి కర్ర ఉండగా అనుమానంతో చెరువులో వెతుకగా రాత్రి 11 గంటల సమయంలో మృతదేహం కనిపించిందని చెరువు నుండి శివాని బయటికి తీసి చూడగా మియాపురం సుగుణగా గుర్తించారు మృతురాలు కుమారుడు మియాపురం ఆచారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గ్రామీణ సీఐ సాయి రమణ తెలిపారు

# శ్రీ కంఠమహేశ్వర స్వామి బోనాలు



నల్లబెల్లి**(గౌతమ్ న్యూస్):** మండలంలోని శనిగరం గ్రామంలో గౌడ కులస్తుల తమ ఆరాధ్య దైవం కంఠమహేశ్వరుడికి అంగరంగ వైభవంగా బోనాలు చెల్లించారు మహిళలు బోనాలతో వచ్చి బోనాలు సమర్పించారు బోనాల పండుగకు గౌడ జన హక్కుల పోరాట సమితి మోపు దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు మీ సందర్భంగా గ్రామంలోని గీత కార్మికులు తెల్లని ధోతి తెల్లని బనియన్ తువ్వాలా ధరించి కొత్త బిందెలలో పరిశుభ్రమైన మీరు తీసుకొని తలపై ఎత్తుకొని మహిళలు పసుపు చీర ధరించి ఊరేగింపుగా డబ్బు చప్పులతో శ్రీ కంఠమహేశ్వర ఆలయానికి పెద్ద ఎత్తున తరలి రావడం జరిగింది ఆలయంలో శ్రీ కంఠమహేశ్వర సురమాంబ రేణుక ఎల్లమ్మ జమదగ్ని వనం మైసమ్మలకు భక్తులు జలాభిషేకం నిర్వహించడం జరిగింది. అనంతరం గీత కార్మికులు, కుటుంబ సభ్యులు బంధువులు ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో గౌడ సంఘం గౌరవ అధ్యక్షులు మాజీ ఎంపీపీ కక్కర్ల శ్రీనివాస్ గౌడ్ ,గౌడ సంఘం అధ్యక్షులు మాజీ ఉపసర్పంచ్ భూర కృష్ణ గౌడ్, కమిటీ సభ్యులు చీర్ర రమేష్ గౌడ్, పొన్నం రవి గౌడ్, కక్కర్ల శ్రీధర్ గౌడ్, కొలగాని జంపాయ గౌడ్ ,ఊటుకూరి శ్రీనివాస్ గౌడ్, అనంతుల సాంబయ్య గౌడ్ ,గందు చంద్రమోహన్ గౌడ్, రాజు గౌడ్ ,అనంతుల వెంకటేశ్వర్లు గౌడ్, పెరుమల శ్రీరామ గౌడ్ ,మాజీ సర్పంచ్ ఊటుకూరు లక్ష్మీ అశోక్ గౌడ్ ,పెరుమండ్ల సదయ్య గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# మాజీ రాష్ట్ర పతి అబ్దుల్ కలాం జయంతి వేడుకలు



బయ్యారం**(గౌతమ్ న్యూస్):** బయ్యారం మండల కేంద్రంలో ని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఏపీజే అబ్దుల్ కలాం ఆజాద్ జన్మదిన వేడుకలు మంగళవారం కళాశాలలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఏ.వీరస్వామి ఏపీజే అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.అనంతరం ఏపీజే అబ్దుల్ కలాం దేశానికి చేసినటువంటి సేవలు అనేక విషయాలు విద్యార్థులకు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల , ఎన్ ఎస్ ఎస్ పి. ఓ కే .సంతోష్ అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

# పురుగుమందుల షాపులపై ఆకస్మిక దాడులు



బయ్యారం**(గౌతమ్ న్యూస్):** మండలంలోని కొత్తపేట గ్రామంలో ,మహబూబాద్ డివిజనల్ సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏ.డి.ఏ) శ్రీనివాసరావు పురుగుమందుల షాపుల్లో అకస్మికంగా తనిఖీలు చేపట్టడం జరిగినది, ఆగ్రోస్ రైతు సేవ కేంద్రం ,శ్రీదివ్య ఫెర్టిలైజర్ పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ ,కర్షక క్రాంతి ఫెర్టిలైజర్స్ అండ్ సీడ్స్ ,సాయిబాబా ట్రేడర్స్ షాపులలో స్టాక్ బుక్ లను పరిశీలించారు. తనిఖీలో భాగంగా పురుగు మందులు సంబంధించిన ఈ బిల్ బుక్స్ ప్రిన్సిపల్ సర్టిఫికేట్స్ స్టాగ్ రిజిస్టర్ అదేవిధంగా ఎరువులకు సంబంధించిన లైసెన్స్ లో ఇంక్లూషన్ ఉందా లేదా గ్రౌండ్ బ్యాలెన్స్ మరియు ఈ పాస్ మిషన్ బ్యాలెన్స్ సరిగా ఉన్నాయా లేదా తనిఖీలు చేసినట్లు తెలిపారు. పీసీలు లేని షాపుల యజమానుల మీద ఆగ్రహం వ్యక్తం చేయడం జరిగినది. నకిలీ పురుగు మందులు అమ్మినట్లు రుజువైన లేదా షాపుల్లో పెట్టుకున్న షాప్ యజమానుల మీద కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఆకస్మిక దాడులు నిత్యం జరుపుతూనే ఉంటామని , షాప్ యజమానులు నియమ నిబంధన ప్రకారం గా నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ రాంజీ ,ఏఇఓ లు తదితరులు పాల్గొన్నారు.

# బయ్యారం గ్రామపంచాయతీ సిబ్బందికి నిత్యావసర సరుకుల పంపిణీ

మాజి ఉపసర్పంచ్ దంపతులు.



బయ్యారం**(గౌతమ్ న్యూస్):** ఎన్జీవోస్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో బయ్యారం గ్రామపంచాయతీ కార్మికులకు నిత్యావసర వస్తువులను బయ్యారం మాజీ ఉప సర్పంచ్ కవిత సంపత్ యాదవ్ దంపతులు మంగళవారం పంపిణీ చేశారు. రామచంద్రపురం మాజీ ఎంపీటీసీ మంగీలాల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లతీఫ్ చంద్రకళ, కుమార్, వీరన్న, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు..

# గురుకుల భవనాల అద్దె కట్టలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం

**తొర్రూరు లోని గురుకులానికి తాళం**



తొర్రూరు**(గౌతమ్ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణ కేంద్రంలోని జ్యోతిరావు పూలే పాఠశాల అద్దె కొన్ని నెలలుగా చెల్లించడం లేదని గేట్లకు తాళం వేసిన భవన యజమాని ప్రభుత్వం వెంటనే బకాయిలు చెల్లించాలని, అప్పుడే తాళం తీస్తామని భవన యజమాని డిమాండ్, రాష్ట్రంలోని అద్దె భావనలో ఉన్న గురుకుల పాఠశాలకు అద్దె చెల్లించక పోవడంతో భావన యజమానులు తలం వేశారు, దసరా పండుగా సెలవులు ముగియడంతో పిల్లలు స్కూల్ కి తిరిగి వెళ్ళే సమయంలో ఇలా పాఠశాలకు తాళం వెయ్యడంతో తల్లి తండ్రులు ఆందోళన చెందుతున్నారు, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అద్దెను చెల్లించి తమ పిల్లల చదువుకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా మరియు ఇలాంటి సంఘటనలు జరగకుండా అన్ని గురుకుల పాఠశాలకు సొంత భవనాలు వుండే విధంగా చెయ్యాలని కోరుతున్నారు

## ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ఇచ్చే

# ఉచిత హామీలపై సుప్రీంకోర్టులో పిటిషన్..



ఎన్నికల సమయంలో పార్టీలు ఇచ్చే ఉచితాలను లంచాలుగా పరిగణించాలంటూ దాఖలైన పిటిషన్‌పై మంగళవారం సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ ఉచితాలపై స్పందన తెలియజేయాలంటూ కేంద్ర ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘానికి నోటీసులు ఇచ్చింది. కర్ణాటక రాజధాని బెంగళూరుకు చెందిన లాయర్ శశాంక్ జే శ్రీధర దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను.. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్థివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. లోక్‌సభ, అసెంబ్లీ సహా ఇతర ఎన్నికల్లో గెలిచేందుకు అన్ని పార్టీలు ఇచ్చే ఉచిత హామీలను కట్టడి చేయడానికి కఠిన చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని పిటిషనర్ తన పిటిషన్‌లో సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల్లో పార్టీలు ఇచ్చే ఉచితాలను లంచంగా పరిగణించాలని కోరారు. అంతేకాకుండా ఉచితాల నియంత్రణకు ఈసీ కఠిన చర్యల చేపట్టాలని పిటిషనర్ విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలోనే ఉచితాలపై గతంలో దాఖలైన వివిధ పిటిషన్లు అన్నింటినీ కలిపి విచారిస్తామన్న సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఎన్నికలకు ముందు రాజకీయ పార్టీలు ఉచిత హామీలు ఇవ్వకుండా చూడాలని పిటిషనర్ కోర్టుకు విన్నవించారు. ఈ మేరకు వెంటనే కఠిన చర్యలు తీసుకునేలా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని పేర్కొన్నారు. పార్టీలు ఉచిత వాగ్దానాలు చేయకుండా కట్టడి చేసేందుకు ఎన్నికల సంఘం చర్యలు తీసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఎన్నికల సమయంలో పార్టీలు తమ గెలుపు కోసం ఇచ్చే ఉచిత హామీల కారణంగా ఆయా ప్రభుత్వాల ఖజానాపై మోయలేని భారం పడుతోందని తన పిటిషన్‌లో లాయర్ శశాంక్ జే శ్రీధర తెలిపారు. పిటిషనర్ అభ్యర్థనలను పరిగణలోకి తీసుకున్న జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని బెంచ్.. గతంలో పెండింగ్‌లో ఉన్న కేసులతో కలిపి విచారణ జరపాలని నిర్ణయించింది. ఈ క్రమంలోనే కేంద్రానికి, ఈసీకి తాజాగా నోటీసులు జారీ చేశారు. ఎన్నికల సమయంలో పార్టీలు, నాయకులు ప్రకటించే ఉచిత వాగ్దానాలు.. ఎన్నికల్లో ఓటర్లపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని.. అంతేకాకుండా ఎన్నికల పారదర్శకతను దెబ్బతీస్తున్నాయని పిటిషనర్ పేర్కొన్నారు.


# గ్లోబల్ ఫ్రేమ్‌వర్క్ కావాలి

**'ఇండియా మొబైల్ కాంగ్రెస్'లో ప్రధాని మోదీ సూచన**




న్యూఢిల్లీ: ఆధునిక యుగంలో ప్రపంచ మొత్తం పరస్పరం అనుసంధానమైన నేపథ్యంలో డిజిటల్ టెక్నాలజీ, కృత్రి మేధ(ఏఐ)ని ఉపయోగించుకొనే విషయంలో స్పష్టమైన విధివిధానాలు అవసరమని ప్రధాని మోదీ చెప్పారు. గ్లోబల్ ఫ్రేమ్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకొనే అంశంపై అన్ని దేశాలు దృష్టి పెట్టాలని సూచించారు. డిజిటల్ టెక్నాలజీని వాడుకొనే పౌరుల వ్యక్తిగత వివరాల భద్రత, గోప్యతను తప్పనిసరిగా కాపాడాలని పేర్కొన్నారు. మంగళవారం ఢిల్లీలో 'ఇంటర్నేషనల్ టెలికమ్యూనికేషన్ యూనియన్–డబ్ల్యూటీఎస్ఏ, ఇండియా మొబైల్ కాంగ్రెస్'ను మోదీ ప్రారంభించారు. డిజిటల్ సాంకేతికత విషయంలో నిబంధనల ఆధారిత ఫ్రేమ్‌వర్క్ ప్రాధాన్యతను ప్రపంచస్థాయి సంస్థలు గుర్తించాల్సిన సమయం వచ్చిందని స్పష్టంచేశారు. ఈ నిబంధనలు కేవలం వ్యక్తిగత భద్రత, టెక్నాలజీ సంస్థల పారదర్శకతకే కాదు, అంతర్జాతీయ డేటా ప్రవాహంపై ఆధారపడి ఉన్న వాణిజ్యం, వస్తు సేవలకు సైతం కీలకమేనని ఉద్ఘాటించారు. సైబర్ మోసాల నుంచి ఏ ఒక్క దేశమూ ఒంటరిగా తమ ప్రజలకు రక్షణ కల్పించలేదని అభిప్రాయపడ్డారు. అందుకే అంతర్జాతీయ స్థాయిలో నిబంధనలు ఏర్పాటు చేసుకోవాలని, ఇందుకు అంతర్జాతీయ సంస్థలు బాధ్యత తీసుకోవాలన్నారు. డిజిటల్ టెక్నాలజీ రంగంలో భారత్ సాధించిన ప్రగతిని ప్రధాని మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. దేశంలో మొబైల్ ఫోన్ల వినియోగదారుల సంఖ్య 120 కోట్లకు చేరిందని గుర్తుచేశారు. 95 కోట్ల మంది ఇంటర్నెట్ ఉపయోగిస్తున్నారని తెలిపారు. ప్రపంచంలోని మొత్తం డిజిటల్ లావాదేవీల్లో ఏకంగా 40 శాతం భారత్‌లోనే జరుగుతున్నాయని వివరించారు. డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాల విషయంలో తమ అనుభవాన్ని ఇతర దేశాలతో పంచుకోవడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

# ఎవుసం చేసెటోళ్లు తగ్గుతున్నరు .. నాబార్డు 2021-22 రిపోర్టు..!!




హైదరాబాద్ **(గౌతమ్ న్యూస్):** ఒకప్పుడు పల్లె అంటే ఎవుసం. గ్రామీణ ప్రాంతాల్లోని జనం మొత్తం వ్యవసాయం, దాని అనుబంధ వృత్తులపై ఆధారపడి జీవించేవాళ్లు. కానీ కాలక్రమేణా పల్లెల్లో వ్యవసాయంపై ఆధారపడేవాళ్ల సంఖ్య తగ్గిపోతున్నది. తాజాగా నాబార్డ్ రిలీజ్ చేసిన 'సెకండ్ ఆలిండియా రూరల్ ఫైనాన్షియల్ ఇంక్లూజన్ సర్వే 2021ь22'లో ఇదే తేలింది. తెలంగాణ పల్లెల్లో 55% మంది మాత్రమే వ్యవసాయంపై ఆధారపడి బతుకుతుండగా.. మిగిలిన 45% కుటుంబాలు వ్యవసాయేతర పనులు చేస్తున్నట్లు వెల్లడైంది. రాష్ట్రంలో రైతు కుటుంబాలకు సగటున కేవలం 2 ఎకరాల భూమి ఉందని, ఈ తరహా చిన్నకమతాల వల్ల వ్యవసాయం గిట్టుబాటు కాక చాలా మంది ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు వెతుక్కున్నట్లు సర్వే తేల్చింది.

### భూమి కౌలుకు ఇచ్చి వేరే పనులకు..

రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కలిపి 2,330 కుటుంబాలను నాబార్డ్ సర్వే చేసింది.దీని ప్రకారం.. వ్యవసాయ ఆదాయం తగ్గిపోవడంతో గ్రామీణులు ప్రత్యామ్నాయ ఉపాధి వైపు మళ్లుతున్నారు. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న రైతు కుటుంబాలు, అందుబాటులో ఉన్న భూమిని పరిగణనలోకి తీసుకుంటే సగటున ఒక్కో కుటుంబానికి 2 ఎకరాల భూమి మాత్రమే ఉంది. చిన్నకమతాల వల్ల రైతుకుటుంబాలకు వ్యవసాయం గిట్టుబాటు కావడం లేదు. రాష్ట్రంలోని వ్యవసాయ కుటుంబ నెలవారీ సగటు ఆదాయం రూ.13,874 కాగా.. నెలవారీ ఖర్చు 13,093గా ఉంది. అంటే ప్రతి నెలా రూ.781 మాత్రమే మిగులుతున్నది. గతంలో ఇది రూ.998గా ఉండేది. వ్యవసాయ కుటుంబ ఆదాయం తక్కువ ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణది 8వ స్థానం. అత్యధికంగా పంజాబ్‌లో ఒక్కో రైతు కుటుంబానికి రూ.31,433 ఆదాయం వస్తుండగా.. అక్కడ నెలకు రూ.5,683 మిగులుతున్నట్లు నాబార్డు సర్వేలో వెల్లడైంది. గతంలో రైతుకుటుంబాలు తమకున్న భూమిలో పండే పంటలపై ప్రత్యక్షంగా ఆధారపడి జీవిస్తే.. వడ్రంగి, కమ్మరి, కుమ్మరి లాంటి కులవృత్తులవాళ్లు పరోక్షంగా వ్యవసాయంపై ఆధారపడి జీవించేవాళ్లు. యాంత్రికీకరణ కారణంగా కులవృత్తులు దెబ్బతినడంతో వాళ్లంతా ప్రత్యామ్నాయ ఉపాధి చూసుకుంటున్నారు. వ్యవసాయ కూలీలది కూడా ఇదే పరిస్థితి. ఈ క్రమంలో కొత్తతరంలో చాలా మంది వ్యవసాయాన్ని వదిలేస్తున్నారు. కొందరు ఆయా గ్రామాల్లో, ఇంకొందరు సమీప పట్టణాల్లో చిన్నచిన్న ఉద్యోగాలు చూసుకుంటున్నారు. స్వయం ఉపాధితో పాటు సర్వీస్రంగంలోనూ ఎక్కువ మంది కొలువులు వెతుక్కుంటున్నారు. ఇక చిత్రమైన పరిస్థితి ఏమిటంటే వ్యవసాయంలో తగినంత ఆదాయం లేక తమ భూములను ఇతరులకు కౌలుకు ఇచ్చి,కుటుంబపోషణ కోసం రైతు కుటుంబాలు ఉద్యోగాలు చేసుకుంటున్నాయని నాబార్డు రిపోర్ట్ స్పష్టం చేసింది.


### సగటు అప్పుల్లోనూ మనమే టాప్

దేశంలో ఒక్కో కుటుంబంపై సగటున రూ.90,372 అప్పు ఉంటే.. రాష్ట్రంలో మాత్రం రూ.1,29,599 అప్పు ఉంది. ఇందులో వ్యవసాయ కుటుంబాలే అధికంగా ఉన్నాయని నాబార్డ్ తన రిపోర్ట్లో పేర్కొంది. 2016లో రాష్ట్రంలో అప్పుల్లో ఉన్న కుటుంబాల సంఖ్య 79% ఉంటే.. 2021-22 నాటికి అది 92%కి పెరిగింది. ఇది రాష్ట్రంలోని భూముల హెూల్డింగ్స్పై ప్రభావం చూపుతున్నది. ఈ సర్వే ప్రకారం రాష్ట్రంలో భూముల హెూల్డింగ్ క్రమంగా తగ్గుతున్నది. గతంలో వ్యవసాయ కుటుంబాలకు ఇంటి జాగాతో పాటు సగటున రెండున్నర ఎకరాల భూమి ఉంటే అది రెండు ఎకరాలకు తగ్గింది. అదే దేశవ్యాప్తంగా సగటు భూమి హెూల్డింగ్ 2016ь17లో 1.08 హెక్టార్ల నుంచి 2021ь22లో 0.74 హెక్టార్లకు తగ్గింది.

### ఆదాయంతో పాటే పెరిగిన ఖర్చులు

కొన్నేండ్లుగా పంటల మద్దతు ధరలు పెరుగుతు న్నందున రైతుల ఆదాయం పెరుగుతున్నదని, కానీ, ఖర్చులు కూడా అదే స్థాయిలో పెరుగుతు న్నాయని నాబార్డు తన రిపోర్ట్‌లో విశ్లేషించింది. వ్యవసాయంలో పెరిగిన పెట్టుబడులు, పెట్టుబడు ల కోసం చేస్తున్న అప్పులు, వాటి వడ్డీలతో రైతుల పై భారం పడుతున్నది. అదీగాక ఒకప్పుడు రైతు లు తమకు కావాల్సిన అన్నిరకాల కూరగాయలు, పండ్లు, పప్పులు, నూనెగింజలు తమ పొలంలో పండించుకునేవాళ్లు. అయితే.. ప్రస్తుతం అవన్నీ బయట నుంచి ఎక్కువ రేట్లకు కొనుగోలు చేయా ల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనికితోడు పెరిగిన విని యోగ సంస్కృతి పల్లెను తాకింది. ఖర్చులు విపరీ తంగా పెరిగిపోయాయి. మారిన వాతావరణ పరిస్థి తులు, పెరిగిన గాలి కాలుష్యం, నీటి కాలుష్యం, ఆహారపు అలవాట్లలో మార్పు వెరసి రోగాలు, వైద్య ఖర్చులు రెట్టింపయ్యాయి. ఫలితంగా ఆదాయం పెరిగినా ఖర్చులు తీసేస్తే మిగులు అంతంత మాత్రమేనని నాబార్డు తేల్చింది. రాష్ట్రంలో ఒక రైతు కుటుంబానికి సగటున రూ.781 మాత్రమే మిగు లుతున్నాయంటే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

## ఏఐపై అతిగా ఆధారపడొద్దు: శక్తికాంత దాస్



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ వంటి టెక్నాలజీలతో ప్రయోజనాలు పొందాలే తప్ప వాటిపై అతిగా ఆధారపడరాదని బ్యాంకులకు రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ సూచించారు. ఈ సాంకేతికతలతో ఆర్థిక సంస్థలకు కొత్త వ్యాపార అవకాశాలు అందుబాటులోకి వచ్చినప్పటికీ వాటి వల్ల ఆర్థిక స్థిరత్వానికి రిస్కులు కూడా పొంచి ఉన్నాయని ఆర్‌బీఐ నిర్వహించిన సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆయన చెప్పారు. ఏఐ వినియోగం అతిగా పెరిగే కొద్దీ సైబర్‌దాడులు, డేటా ఉల్లంఘనలు వంటి రిస్కులు కూడా పెరిగే అవకాశం ఉందని వివరించారు. అంతే గాకుండా, ఏఐ పారదర్శకంగా ఉండకపోవడం వల్ల, నిర్ణయాలు తీసుకునే ప్రక్రియను ప్రభావితం చేసే అల్గారిథంలను ఆడిట్ చేయడం లేదా అన్వయించుకోవడం కూడా కష్టతరమవుతుందని దాస్ చెప్పారు. దీనితో మార్కెట్లలో అనూహ్య పరిస్థితులు నెలకొనే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

జియోభారత్ కొత్త ఫోన్స్ ఇవే.. ధర తెలిస్తే కొనేస్తారు!

డిజిటలీకరణతో మనీ ట్రాన్స్‌ఫర్ ఎంత వేగంగా క్షణాల వ్యవధిలో జరుగుతోందో అంతే వేగంగా సోషల్ మీడియా ద్వారా వదంతులు కూడా వ్యాప్తి చెందుతున్నాయని, ఇలాంటివి లిక్విడిటీపరమైన ఒత్తిళ్లకు దారి తీసే అవకాశం ఉందని దాస్ చెప్పారు. ఈ నేపథ్యంలో రిస్కులను సమర్థంగా ఎదుర్కొనేందుకు బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు తగిన చర్యలు తీసుకోవాలని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## ఏపీలో మందుబాబులకు సర్కారు షాక్.. !



**అమరావతి,:** ఆంధ్రప్రదేశ్‌లో మందుబాబులకు రాష్ట్ర ప్రభుత్వం షాకిచ్చింది. మద్యంపై డ్రగ్స్ రిహాబిలిటేషన్ సెస్ విధిస్తూ జీవో జారీ చేసింది. మద్యంపై రెండు శాతం సెస్ విధించింది. మద్యం ల్యాండెడ్ రేట్లపై సెస్ విధించేలా ఉత్తర్వులు జారీ చేసింది. సెస్ ద్వారా సుమారు రూ. 100 కోట్ల ఆదాయం వస్తుందని ప్రభుత్వం అంచనా వేసింది. సెస్ ద్వారా వచ్చిన నిధులను డ్రగ్స్ నియంత్రణ, రిహాబిలిటేషన్ సెంటర్లకు ప్రభుత్వం వినియోగించనుంది. సోమవారం మద్యం షాపులను లాటరీ విధానం ద్వారా కేటాయించిన సంగతి తెలిసిందే. ఇక రేపటి నుంచి కొత్త మద్యం పాలసీ అమల్లోకి రానుంది. తాజా నిర్ణయం ప్రకారం.. అదనపు ప్రివిలేజ్ ఫీజు కింద చిల్లర కాకుండా తదుపరి 10 రూపాయలకు పెంచుతూ సవరణ చేశారు. అంటే ఒకవేళ మద్యం బాటిల్ ఎమ్మార్పీ ధర50 క రూ.150.నుక ఉంటే.. దానిని రూ.160కి పెంచేలా అదనపు ప్రివిలేజ్ ఫీజు ఉంటుంది. విదేశీ మద్యం బాటిళ్లపై అదనపు ప్రివిలేజ్ ఫీజు కింద ఎమ్మార్పీ ధరలో చిల్లర కాకుండా.. తదుపరి పది రూపాయలకు పెంచారు.

## రాష్ట్రంలో విద్యారంగాన్ని ప్రభుత్వం భ్రష్టు పట్టించింది



**హైదరాబాద్, :** రాష్ట్రంలో విద్యారంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా భ్రష్టు పట్టించిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. తాజాగా ఆయన ట్విట్టర్ వేదికగా స్పందించారు. గురుకుల భవనాలకు అద్దె చెల్లిస్తలేరు. కాలేజీల యాజమాన్యాలకు ఫీజు రీయింబర్స్ మెంట్ ఇస్తలేరు. కనీసం అన్నం పెట్టలేని స్థితికి కాంగ్రెస్ ప్రభుత్వం దిగజారింది. చదువు పక్కనపెట్టి విద్యార్థులు, కాలేజీ యాజమాన్యాలు రోడ్లపై ధర్నాలు చేసే దుస్థితి తెచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ, పీజీ ప్రైవేట్ కాలేజీలను నిరవధికంగా మూసివేయటంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు చెల్లించకుండా పేద విద్యార్థులను చదువుకు దూరం చేస్తున్నారు. మూసీ కోసం రూ. లక్షా 50 వేల కోట్లు ఖర్చు చేసే కాంగ్రెస్ సర్కార్ దగ్గర అద్దె, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు ఇవ్వటానికి పైసలు లేవా? రాష్ట్రానికి విద్యా శాఖ మంత్రి లేడు, ముఖ్యమంత్రికి విద్యారంగంలో సమస్యలను తెలుసుకునే ఓపిక లేదు. రాష్ట్రంలో విద్యార్థులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాల్సిందిపోయి. ఎంతసేపు ఢిల్లీకి మూటలు పంపించే పనిలోనే ముఖ్యమంత్రి బిజీగా ఉన్నాడు. లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో రేవంత్ రెడ్డి సర్కార్ చెలగాటమాడుతోంది అంటూ ట్వీట్ చేశారు కేటీఆర్.

## ట్రూడో ఆరోపణల్లో నిజం లేదు - భారత్



ఇంటర్నెట్ డెస్క్: కెనడాలో నేర కార్యకలాపాలకు భారత్ మద్దతు ఇస్తోందంటూ ఆ దేశ ప్రధాని జస్టిన్ ట్రూడో చేసిన వ్యాఖ్యలను భారత్ తోసిపుచ్చింది. అస్పష్టమైన ఆరోపణలు చేయడం, తిరస్కరిస్తే నిందలు మోపడం వంటి విధానాన్ని కెనడా మొదటి నుంచీ అవలంబిస్తోందని ఆరోపించింది. నిజ్జర్ హత్య కేసుకు సంబంధించి విశ్వసనీయమైన సమాచారాన్ని ఇచ్చామని కెనడా చేస్తున్న వాదనల్లో నిజం లేదని తెలిపింది. గతంలో చేసిన ఆరోపణల్లో భాగంగానే పాత విషయాలను ట్రూడో మళ్లీ తెరపైకి తెచ్చారని విదేశాంగశాఖ వర్గాలు పేర్కొన్నట్లు సమాచారం. "నిజ్జర్ హత్య కేసులో భారత్‌కు విశ్వసనీయమైన సాక్ష్యాధారాలను అందించామన్న కెనడా అధికారుల వాదనలో నిజం లేదు. అస్పష్టమైన ఆరోపణలు చేయడం, తిరస్కరిస్తే భారత్‌పై నిందలు మోపడం.. మొదటి నుంచి కెనడా విధానం ఇదే. దక్షిణాసియా వర్గాలను లక్ష్యంగా చేసుకోవడానికి నేరస్థులను భారత ఏజెంట్లు ఉపయోగించుకుంటున్నారని కెనడా పోలీసుల ఆరోపణలకు సంబంధించి ఎటువంటి సమాచారం ఇవ్వలేదు. కెనడాలోని భారత హైకమిషనర్‌తో గతేడాది చర్చలు జరిపిన తర్వాత.. ఇప్పుడు ఆయనను ట్రూడో ప్రభుత్వం లక్ష్యంగా చేసుకోవడం అసంబద్ధం" అని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. కెనడా-భారత్ మధ్య తాజాగా చోటుచేసుకున్న పరిణామాలపై స్పందించిన ట్రూడో.. మళ్లీ పాత పాటే పాడారు. హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యలో భారత ప్రభుత్వ ఏజెంట్ల ప్రమేయం ఉందని తమ నిఘా వర్గాలు పేర్కొన్నాయని.. ఇందుకు సంబంధించి ఆధారాలు ఇచ్చామని అన్నారు. ఈ విషయంలో ఏజెంట్లపై చర్యలు, తదితర అంశాలపై చర్చించేందుకు భారత్ సహకరించడం లేదని ఆరోపించారు. ఈ క్రమంలోనే ట్రూడో వ్యాఖ్యలను భారత్ తోసిపుచ్చింది.

## కేటీఆర్‌పై బండిసంజయ్ ఫైర్



హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఫైర్ అయ్యారు. వికారాబాద్ నేవీ రాడార్ కేంద్రానికి మీరే అనుమతిచ్చి మీరే ఎలా వ్యతిరేకిస్తారని ప్రశ్నించారు. 'కేటీఆర్.. మీ అయ్య ఫాంహౌజ్ ముందు ధర్నా చేయ్. ఆనాడు రాడార్ వ్యవస్థకు ఎందుకు అనుమతి ఇచ్చారో అడుగు. మీ అయ్య ఆనాడు సోయిలో ఉండే ఆమోదం తెలిపారో లేదో అడుగు. మీరే అనుమతి ఇచ్చి మీరే వ్యతిరేకిస్తారా? దేశ భద్రత వ్యవస్థ ఏర్పాటును వ్యతిరేకించడమంటే.. దేశ ప్రయోజనాలను వ్యతిరేకించినట్లే. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పినా మార్పు రాలేదు. కాగా, వికారాబాద్ దామగుండంలో నేవీ ఏర్పాటు చేయనున్న వీఎల్ఎఫ్ రాడార్ స్టేషన్‌కు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ మంగళవారం(అక్టోబర్ 15) శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండిసంజయ్ తదితరులు పాల్గొన్నారు.

# దిగ్భ్రాంతికర హత్యాకాండ




మాజీ మంత్రి, మహారాష్ట్రలోని అధికార జాతీయవాద కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) నేత బాబా సిద్దిఖీని ముంబయ్‌లో మాఫియా శైలిలో హత్య చేసిన తీరు దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టిస్తోంది. సినీ నటుడు సల్మాన్ ఖాన్ సహా పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు తదుపరి లక్ష్యాలంటూ వినిపిస్తూ ఉండడం ఆందోళన రేపుతోంది. మరికొద్ది రోజుల్లో శాసనసభ ఎన్నికలు జరగనున్న ఆ రాష్ట్రంలోని శాంతి భద్రతల పరిస్థితిపై సందేహాలు కలిగిస్తోంది. సల్మాన్‌తో సన్నిహిత సంబంధాల రీత్యా సిద్దిఖీ లక్ష్యంగా మారారని కథనం. కుమారుడి నియోజకవర్గంలోని మురికివాడల పునరభివృద్ధి వ్యవహా రంలో కుంభకోణం ఆయన మెడకు చుట్టుకుందని మరో వాదన. ఇంకా అనేక రకాల కుట్ర కోణాలూ వినవస్తున్నాయి. సిద్దిఖీ దారుణ హత్యకు కారణాలు ఏమైనప్పటికీ, రానున్న ఎన్నికల్లో ఈ ఘటన తాలూకు రాజకీయ పర్యవసానాలు కచ్చితంగా ఉండే అవకాశం మాత్రం కనిపిస్తోంది. ఇప్పటికే మహారాష్ట్రలో అస్తుబిస్తుగా ఉన్న పాలక కూటమిని ఎన్నికల వేళ ఇది ఇరుకునపెట్టే అంశం కానుంది. విద్యార్థి నేత నుంచి గ్యాంగ్‌స్టర్‌గా మారిన లారెన్స్ బిష్ణోయ్ జైలులో ఉన్నా, అనేక నెలలుగా ఈ హత్యకు పథకం వేసినట్లు కథనం. జైలులో ఉన్నా సెల్‌ఫోన్ సహా సమస్త సౌకర్యాలతో బిష్ణోయ్ లాంటి కొందరు ఖైదీలు రాజభోగాలు అనుభవిస్తూ ఉండడం మన వ్యవస్థకు పట్టిన తెగులు. ముంబయ్‌లో రద్దీగా ఉండే బాంద్రా ప్రాంతంలో శనివారం, విజయదశమి నాటి రాత్రి సిద్దిఖీపై దాడి చేసిన ముగ్గురు దుండగులు ముందుగా ఆయన రక్షకుడిపై పెప్పర్‌స్ప్రే జల్లి, ఆపైన సూటిగా 6 బుల్లెట్లు కాల్పులు జరిపి ఊరేగింపులో కలిసిపోయారట. హాస్పిటల్‌కు హుటాహుటిన తరలించి, దాదాపు రెండు గంటల పాటు వైద్యులు శ్రమించినా సిద్దిఖీ ప్రాణాలను కాపాడలేకపోయారు. ఇద్దరు నిందితుల్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నప్పటికీ, కాల్పులు జరిపిన మూడో వ్యక్తి ఇప్పటికీ పరారీలో ఉన్నాడు. బిష్ణోయ్ పక్షాన ముగ్గురు సుపారీ ఇచ్చి పథక రచన చేయగా, మరో ముగ్గురు కాల్పులు జరిపారనీ, నిందితులు యూపీ, పంజాబ్, హర్యానా - ఇలా వేర్వేరు రాష్ట్రాల నుంచి వచ్చి రెక్కీ జరిపినట్లూ, దొరకకుండా వాట్సప్, సిగ్నల్ యాప్‌ల ద్వారా కథ నడిపినట్లూ సమాచారం. సరిగ్గా వారం పైచిలుకు క్రితమే ముంబయ్‌లోని బైకులా ప్రాంతంలో మరో ఎన్సీపీ నేత కత్తిపోట్లకు గురయ్యారు. ఆ ఘటనను మర్చిపోకముందే ఇప్పుడీ దారుణహత్య జరగడం విషాదం. దాదాపు 48 ఏళ్ళ పాటు కాంగ్రెస్‌లో ఉండి, పాపులర్ రాజకీయ నేతగా ఎదిగిన చరిత్ర సిద్దిఖీది. ఏటేటా ఆయన ఆర్భాటంగా నిర్వహించే ఇఫ్తార్ విందులు, వాటికి హాజరయ్యే నగర ప్రముఖులు, మరీ ముఖ్యంగా హిందీ సినీ అగ్ర తారలు జగత్ప్రసిద్ధం. అంత పేరు, పలుకుబడి, ప్రజాక్షేత్రంలో సుదీర్ఘ అనుభవం ఉన్న బాబా సిద్దిఖీని స్వయంగా ఎమ్మెల్యే అయిన ఆయన కుమారుడు జీషన్ కార్యాలయం ఎదుటే హత్య చేయడం దిగ్భ్రాంతికరం. 'వై ప్లస్' కేటగిరీ భద్రత ఉన్నప్పటికీ ఇలా ఓ పాపులర్ నాయకుడు దారుణహత్యకు గురికావడం వ్యవస్థల వైఫల్యానికి ఉదాహరణ. అదీ పోలీసు బందోబస్తు ఎక్కువగా ఉన్న దసరా ఉత్సవాల హంగామా సమయంలోనే జరగడం పరాకాష్ఠ. దేశ వాణిజ్య రాజధానిలో ఇలాంటి ఘటన జరిగిందంటే, పాలకులకు ఇది మరీ మాయని మచ్చ. గ్లామర్ నిండిన హిందీ చిత్రసీమ, ఖరీదైన ముంబయ్ రియల్ ఎస్టేట్, ఈ రెంటితోనూ ముడి పడ్డ మాఫియా ముఠా నేతల ముక్కోణపు వ్యవహారం ముంబయ్‌లో ఎప్పుడూ ఒక డెడ్లీ కాంబి నేషన్. కొన్ని నియోజకవర్గాలు అచ్చంగా మాఫియా నేతల కనుసన్నల్లోనే నడుస్తూ వచ్చాయి. 1980, '90లలో ముంబయ్‌లో దావూద్ ఇబ్రహీమ్, ఛోటా రాజన్ లాంటి మాఫియా నేతల గ్యాంగ్ వార్ తెలిసినదే. గతంలో చాలా ఏళ్ళ క్రితం ప్రముఖ సినీ నిర్మాత, ఆడియో కంపెనీ అధినేత గుల్షన్ కుమార్ హత్య ఇలాగే జరిగిందీ ప్రజలకు గుర్తే. కానీ, ఇప్పుడు కటకటాల వెనుక ఉన్న ఓ గ్యాంగ్‌స్టర్ ఇలాంటి చర్యలకు దిగడమే దిగ్భ్రాంతి కలిగిస్తోంది. ప్రముఖులపై హింసాత్మక దాడులు, హత్యలు ఈ ఏడాది వరుసగా జరుగుతూ ఉండడం ఆందోళనకరమైనది. ఇదే ఏడాది ఫిబ్రవరిలో ఫేస్‌బుక్ లైవ్‌లో ఉండగా శివసేన (యూబీటీ) నేత ఒకరు దారుణంగా హత్యకు గురయ్యారు. ఆ ఘటనపై క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తులో లోపాలతో ఆగ్రహించిన హైకోర్ట్ చివరకు ఆ కేసును గత నెలలో సీబీఐకి బదలాయించాల్సి వచ్చింది. ఇవన్నీ పోలీసులకూ, పాలకపక్షానికీ చెంపపెట్టు. మహారాష్ట్రలో శివసేన, బీజేపీ, ఎన్సీపీలతో కూడిన మహాయుతి సర్కార్‌కు ఇప్పటికే బోలెడన్ని చిక్కులున్నాయి. అధికారం కోసం ఈ పార్టీలన్నీ అనైతిక కూటమి కట్టాయనే భావన ఉంది. కూటమి పాలనపై అసంతృప్తి సహా ఇంకా అనేకం ఉండనే ఉన్నాయి. ప్రతిపక్ష మహావికాస్ అఘాడీ బలం పుంజుకుంటూ ఉండడంతో, ఎన్నికల వేళ... ముంబయ్‌లో టోల్‌ఫ్రీ ప్రయాణం సహా రకరకాల జిమ్మిక్కులకు సర్కారు సిద్ధమవుతున్న పరిస్థితి. ఇలాంటప్పుడు సిద్దిఖీ హత్య జరిగింది. రాష్ట్రంలో శాంతి భద్రతలకు బాధ్యత వహించాల్సిన హోమ్ శాఖకు బీజేపీ నేత, సాక్షాత్తూ డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ సారథి. అదీ కాషాయపార్టీకి ఇబ్బందికరమే. సిద్దిఖీ మీద గతంలో అనేక అవినీతి ఆరోపణలున్నా ఈ హత్య ఊహించనిది. ముంబయ్‌లో మళ్ళీ ఒకప్పటి గ్యాంగ్‌వార్ పరిస్థితులు రాకుండా ఉండాలంటే, సర్కారు ఉక్కుపాదం మోపాలి. అన్ని పక్షాలూ రాజకీయాల కన్నా రాష్ట్రంలో భయరహిత వాతావరణం నెలకొనేందుకు కృషి చేయాలి. గతంలో ఎంతో పేరున్న ముంబయ్ పోలీ సులు ఈ కేసును సవాలుగా తీసుకోవాలి. దోషులకు శిక్ష పడేలా చూడాలి. పోయిన ప్రతిష్ఠను తెచ్చుకోవాలి. చట్టం మీద ప్రజలకు మళ్ళీ నమ్మకం నెలకొనేలా చూడడం పాలకుల తక్షణ కర్తవ్యం.

# చక్కని బొమ్మా.. నిను చెక్కిన చేతులకు సలాం

- ప్రపంచాన్ని చుట్టేసిన ఏటికొప్పాక లక్కబొమ్మ
- అంకుడు కర్రతో అద్భుత కళారూపాలు
- సహజరంగుల వినియోగంతో ఇనుమడించిన ఖ్యాతి
- రాంచీ నుంచి లక్క.. తూర్పు కనుమల నుంచి రంగులు
- మన్‌కీ బాత్‌లో లక్క బొమ్మల విశిష్టతను ప్రస్తావించిన ప్రధాని
- సహజసిద్ధమైన ఈ బొమ్మల తయారీ డాక్యుమెంట్‌కు అంతర్జాతీయ అవార్డు



అనకాపల్లి: ఏడు దశాబ్దాల కిందట అనకాపల్లి జిల్లా యలమంచిలి మండలం ఏటికొప్పాక గ్రామంలో నాలుగు విశ్వకర్మ కుటుంబాలు జీవనోపాధి కోసం లక్కబోమ్మల తయారీ ప్రారంభించాయి. నాడు అవసరం కోసం బీజం పడిన ఈ కళ ఇప్పుడు ఆ గ్రామానికి ప్రపంచపటంలో ఒక గుర్తింపు తీసుకువచ్చిం ది. అంకుడు కర్రలతో లక్కబోమ్మలు తయారు చేసే హస్తకళాకార కుటుంబాలు ఈ గ్రామంలో దాదాపు 150 వరకూ వున్నాయి. మారుతున్న కాలానికి, సాంకేతికతకు అనుగుణంగా ఇక్కడి కళాకారులు కూడా విశేష నైపుణ్యంతో అపురూప కళాఖండాలను తమ మునివేళ్లతో సృష్టించి అబ్బురపరుస్తున్నారు.

### జార?ండ్ నుంచి లక్క దిగుమతి

రసాయన రంగులతో పోలిస్తే సహజ రంగులే ఆకర్షణీయంగా కనిపిస్తాయి. అందుకే లక్కకి సహజమైన రంగులను కలిపి ఇక్కడి కళాకారులు అనేక ప్రయోగాలు చేస్తుంటారు. చుట్టుపక్కల లభించే ఉసిరి, కరక్కాయ, వేప వంటి వాటితో సహజ రంగులను తయారు చేస్తారు. సహజమైన లక్కను ఎక్కువగా జార?ండ్‌లోని రాంచీ నుంచి దిగుమతిచేసుకుంటారు. అక్కడ ఒక రకమైన సూక్ష్మజీవి విసర్జితాల నుంచి ఇది లభిస్తుంది. స్థానిక గిరిజనులు దాన్ని సేకరించి అమ్ముతారు. ఆ లక్కకి తూర్పుకనుమల్లో దొరికే వివిధ రకాల మొక్కలు, వాటి విత్తనాలు, ఆకులు, వేళ్లు, కాండం నుంచి వచ్చే సహజ సిద్ధమైన రంగులను కలుపుతారు. 100 డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రత వద్ద లక్కని వేడిచేసి, రంగుని కలిపి... దాన్ని బొమ్మలకు అద్దుతారు. గది ఉష్ణోగ్రతవద్ద వద్ద ఈ రంగులు ఎంత కాలమైనా పాడవకుండా ఉంటాయి. 1990 వరకు ఏటికొప్పాక బొమ్మలకు రసాయన రంగులే పూసేవారు. గ్రామానికి చెందిన సీవీ రాజు (చింతలపాటి వెంకటపతిరాజు) రసాయన రంగుల స్థానంలో సహజ సిద్ధమైన రంగులను వాడటం మొదలుపెట్టారు. క్రమంగా గ్రామంలోని కళాకారులందరూ సహజరంగులు వినియోగించడం ప్రారంభించారు.

### బొమ్మల తయారీలో మహిళలే ఎక్కువ..

ఏటికొప్పాకలో దాదాపు ప్రతి ఇంటిలోనూ బొమ్మల తయారీ కళాకారులుంటారు. ఇందులో మహిళలే అధిక సంఖ్యలో ఉంటారు. ఇంటి పనులు చూసుకుంటూ వీలు దొరికినప్పుడల్లా వీరు బొమ్మలు తయారు చేస్తుంటారు. మరికొందరు దీన్నే వృత్తిగా తీసుకుంటారు. కుంకుమ భరిణెలు, ఆభరణాలు దాచుకునే డబ్బాలు, పిల్లలు ఆడుకునే బొమ్మలు, మహిళలు ధరించే గాజులు, కీచైన్లు, ఫ్లవర్‌వాజ్‌లు, దేవతామూర్తుల బొమ్మలు మొదలుకుని గ్రామీణ వాతావరణం, శ్రీ వేంకటేశ్వరస్వామి, రామాంజనేయ యుద్ధ సన్నివేశాలు,పెళ్లి తంతు, పెళ్లి సారె ఇలా ఎన్నో రకాల బొమ్మలు ఇక్కడి కళాకారుల చేతిలో రూపుదిద్దుకుంటాయి. పొట్టకూటి కోసం తయారుచేసిన లక్క బొమ్మ.. కాలాంతరంలో ఆ గ్రామానికి ఖండాంతర ఖ్యాతిని ఆర్జించిపెట్టింది. వంట చెరకుగా కూడా పనికిరాని అంకుడు కర్ర మూలవస్తువుగా, ఆకులూ అలములే సహజ రంగులుగా, కళాకారుడి సృజనాత్మకతే అతిపెద్ద పెట్టుబడిగా తయారవుతున్న ఏటికొప్పాక లక్కబొమ్మ ప్రపంచం నలుమూలలా గొప్ప ఆదరణ పొందుతోంది. వరాహనది ఒడ్డున ఉన్న ఈ ప్రశాంత గ్రామంలో నిరంతరం ఉలి శబ్దం వినిపిస్తూనే ఉంటుంది. వైవిధ్యమైన బొమ్మల తయారీ కోసం కళాకారులు తమ సృజనకు పదును పెడుతూనే ఉంటారు. చేయితిరిగిన ఇక్కడి కళాకారుడి ఉలి నుంచి జాలువారిన ఒక్కో బొమ్మా ఒక్కో కళాఖండమే.. వందలాదిమందికి ఉపాధి కల్పిస్తున్న ఏటికొప్పాక బొమ్మ రాష్ట్రపతి, ప్రధాని ప్రశంసలు సైతం అందుకుంది. ఏటికొప్పాక హస్తకళా నైపుణ్యంపై 'సాగా ఆఫ్ ది విమెన్' పేరిట ప్రొఫెసర్ బొగాది నీలిమ తీసిన డాక్యుమెంటరీ ప్రపంచ స్థాయిలో రెండో స్థానం దక్కించుకుంది.

### విదేశాలకు ఎగుమతి

ఏటికొప్పాక లక్కబొమ్మలకు దేశ విదేశాల్లో మంచి డిమాండ్ ఉంది. సహజసిద్ధమైన రంగులతో ఎంతో ఆకర్షణీయంగా కనిపించడం ఎన్నాళ్లయినా ఈ రంగులు సహజత్వాన్ని కోల్పోకుండా ఉండటంతో విదేశీయులను ఇవి ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఆన్‌లైన్ ఆర్డర్ల ద్వారా తెప్పించుకునే వెసులుబాటు ఉండటం, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి వాటిలో అందుబాటులో ఉండటంతో అమ్మకాలు భారీగా పెరుగుతున్నాయి. అమెరికా, ఆస్ట్రేలియా, పోలెండ్, హాలెండ్, స్విట్జర్లాండ్, బ్రిటన్, జర్మనీ, శ్రీలంక, నేపాల్ దేశాలకు ఏటికొప్పాక బొమ్మలు ఎగుమతవుతున్నాయి.

### జాతీయ, అంతర్జాతీయ అవార్డులు

ఏటికొప్పాక లక్కబొమ్మలను వినూత్న రీతిలో తయారు చేసిన పలువురు కళాకారులకు జాతీయ, అంతర్జాతీయ అవార్డులు లభించాయి. ప్రధాని మోదీ "మన్ కీ బాత్ కార్యక్రమంలో లక్క బొమ్మల విశిష్టత గురించి ప్రస్తావించారు. భారత నౌకాదళం విశాఖలో నిర్వహించిన ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ-2016లో ఏర్పాటు చేసిన ఏటికొప్పాక బొమ్మల స్టాల్‌ని ప్రధాని మోదీ సందర్శించారు. అక్కడ తన ఫొటోతో తయారు చేసిన లక్క డబ్బాని చూసి ముచ్చటపడి దాని మీద సంతకం కూడా చేశారు. సహజసిద్ధమైన రంగులతో ప్రయోగాలు చేసి, ఏటికొప్పాక బొమ్మకి కొత్త కళను తెచ్చినందుకు సీవీ రాజుకి 2002లో రాష్ట్రపతి అవార్డు, 2012 లో నేషనల్ ఇన్నోవేషన్ అవార్డు వచ్చిం ది. అదేవిధంగా ఏటికొప్పాకకు చెందిన మరో కళాకారుడు శ్రీశైలపు చిన్నయాచారి మైక్రో ఆర్ట్స్‌లో నిపుణుడు. 2003లో జాతీయ హస్త కళల పోటీలో ఇతను తయారు చేసిన బొమ్మకు ప్రథమ బహుమతి లభించింది. అలాగే బియ్యపు గింజమీద పట్టేంత వీణ, గుండుసూది మీద పట్టేంత తాజ్ మహల్, ఏనుగు, బుద్ధుడు, ఎడ్లబండి, శ్రీరామ పట్టాభిషేకం, తల వెంట్రుక మీద నిలబెట్టగలిగే పక్షులు... ఇలా అనేక మినీయేచర్ ఆర్టులను చిన్నయాచారి తయారుచేసి అవార్డులు పొందారు.

### కళ అంతరించిపోకూడదనే..

ఒకప్పుడు రూ.400కు దొరికే అంకుడు కర్రల మోపు.. ఇప్పుడు రూ.4వేలకు పెరిగింది. ఇది కళాకారులకు భారంగా మారింది. స్థానికంగా అంకుడు కర్ర డిపో ఏర్పాటు చేస్తే కళాకారులకు ఉపయుక్తంగా ఉంటుంది. అద్భుతమైన లక్కబొమ్మల తయారీ కళ అంతరించిపోకూడదు. ఇది మా పూర్వీకుల నుంచి మాకు వచ్చిన అరుదైన కళ. బొమ్మల తయారీ గిట్టుబాటు కావడం లేదని గతంలో చాలా మంది కళాకారులు ప్రత్యామ్నాయ పనులకు వెళ్లిపోయారు. దీనిని కుటీర పరిశ్రమగా అభివృద్ధి చేసేందుకు గ్రామంలో సుమారు 100 మందికి పైగా మహిళలకు శిక్షణ ఇచ్చాం. ప్రస్తుతం వారికి ఇది ఉపాధినిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తే మరింత మందికి ఉపాధి దొరుకుతుంది.

### కనుమరుగవుతున్న పల్లె నేస్తాలు
### ప్రకృతి సిద్ధంగా లభించేవన్నీ మటుమాయం
### భవిష్యత్ తరాలు గూగుల్‌లో చూసుకోవాల్సిందే..

# ఔషధ మొక్కకు ఆపద

కామారెడ్డి: గ్రామీణ జన జీవనంతో ముడిపడి ఉన్న అనేక రకాల చెట్లు, ఔషధ మొక్కలు కాలక్రమేణా కనుమరుగవుతున్నాయి. ఒకప్పుడు పల్లెల్లో అడుగుపెట్టగానే ఎన్నో రకాల చెట్లు కనిపించేవి. ఇప్పుడా పరిస్థితి లేదు. ప్రధానంగా మారేడు, బ్రహ్మజెముడు, నాగజెముడు, ఉమ్మెంత, ఉత్తరేని, జిల్లెడు, తిప్పతీగె, కలమంద వంటి ఔషధ మొక్కలు ఎక్కడా కనిపించడం లేదు. చెలకల్లో తంగేడు, గునుగు పూల చెట్లు ఎక్కువగా ఉండేవి. చేను చుట్టూరా కంప చెట్లు, వాయిలాకు చెట్లు ఉండేవి. చాలా గ్రామాల్లో ఇప్పుడవి లేవు. ఇళ్ల ముందర వేప చెట్లు, పెరట్లో చింత చెట్లు ఉండేవి. ఊరి నడుమ వివిధ రకాల పెద్ద పెద్ద వృక్షాలు ఉండేవి. ఆలయాల దగ్గర రావి, ఉసిరి, మారేడు (పత్రి) చెట్లు కనిపించేవి. అయితే పల్లెలకు ఆధునికత చొచ్చుకు వచ్చిన తర్వాత పెంకుటిళ్లు, పూరి గుడిసెల స్థానంలో బంగళాలు నిర్మించారు. వాటిని నిర్మించే క్రమంలో చాలా ఇళ్ల ఎదుట ఉన్న వేప చెట్లు, చింత చెట్లు నరికివేశారు. కొత్తగా నాటే విషయం ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో కొత్త తరానికి ఔషధ మొక్కల ప్రాధాన్యం కూడా తెలియని పరిస్థితి ఏర్పడుతోంది.

### తంగేడు దొరకని పరిస్థితి...

చెలకల వద్ద, అటవీ ప్రాంతంలో విరివిగా లభించే తంగేడు పువ్వు ఇప్పుడు గగనమైంది. చాలా గ్రామాల్లో తంగేటు చెట్లు కనిపించడం లేదు. దీంతో బతుకమ్మ పేర్చడానికి తంగేడు పువ్వు దొరకడం లేదు. అక్కడక్కడ తంగేడు మిగిలి ఉన్నా, చాలా ప్రాంతాల్లో తంగేడు చెట్లు కనుమరుగయ్యాయి. మక్క, పత్తి చేలల్లో గునుగు పూల చెట్లు విపరీతంగా మొలిచేవి. బతుకమ్మ సీజన్‌లో జనం వెళ్లి కోసుకుని వచ్చేవారు. వ్యవసాయంలో వచ్చిన మార్పుల కారణంగా విత్తనం వేసేటపుడే కలుపు నివారణ మందులు పిచికారీ చేయడం, మొలకలు వచ్చిన తర్వాత కూడా కలుపు నివారణ మందులు పిచికారీ చేయడంలో గునుగు దొరకడం లేదు. గునుగు పువ్వును ఔషధ మొక్కగా గుర్తిస్తారు. పసరికలు అయిన వారికి ఆరబెట్టిన గునుగు పువ్వును చూర్ణం చేసి మందు బిల్లలుగా మింగిస్తే తగ్గిపోతుందని చెబుతారు. అంత గొప్ప ఔషధ గుణాలున్న గునుగు పూల చెట్లు రానురాను తగ్గిపోతున్నాయి.



### కనిపించని నాగజెముడు, బ్రహ్మజెముడు

ఊళ్లల్లో చాలా చోట్ల బ్రహ్మజెముడు, నాగజెముడు చెట్లు కనిపిస్తాయి. దళసరిగా ఉండే ఆకులపై ముళ్లు ఉండే ఈ చెట్లలో ఎన్నో ఔషధ గుణాలుంటాయని చెబుతారు. బ్రహ్మజెముడు పండ్లలో మంచి పోషకాలుంటాయని, డ్రాగన్ ఫ్రూట్ కన్నా వెయ్యి రెట్లు ఎక్కువ పోషకాలు లభిస్తాయని చెబుతారు. ముఖ్యంగా బీ12, ఏ, సీ విటమిన్లు అందులో ఉంటాయని పేర్కొంటున్నారు. అయితే చాలా చోట్ల బ్రహ్మజెముడు మొక్కలు కానరావడం లేదు. వ్యవసాయ యాంత్రీకరణతో చేల వద్ద పెద్దపెద్ద చెట్లను జేసీబీలతో తొలగించి పొలం మడుగులు చేయడం మూలంగా బ్రహ్మజెముడు, నాగజెముడు వంటి చెట్లు కనుమరుగయ్యాయి.

### ఉమ్మెత్త లేదు.. ఉత్తరేణి దొరకదు

చర్మ సమస్యలు, పైత్యం వేడి, దురద, గడ్డలు, దగ్గు, దమ్ము, ఆయాసం వంటి వాటికి ఉమ్మెత్త ఆకులను కాల్చి దాని నుంచి వెలుబడే పొగను పీల్చడం వల్ల ఆయా సమస్యలు తొలగిపోతాయని చెబుతుంటారు. ఉమ్మెత్త మొక్కలు ఎలా గుంటాయో కూడా నేటి తరానికి తెలియడం లేదు. ఉత్తరేణి ఆకులను పూజల్లో వాడుతారు. ఉత్తరేణి మంచి ఔషధ మొక్క. ఉత్తరేణి వేర్లతో పళ్లు తోముకుంటే ధృడంగా తయారవుతాయని చెబుతారు. ఉత్తరేణి ఆకుల రసంతో నొప్పులు, పంటినొప్పి కూడా తగ్గించొచ్చని పేర్కొంటున్నారు. ఊళ్లల్లో ఇప్పుడు ఉమ్మెత్త మొక్కలు కనిపించడం లేదు. ఆఖరుకు ఉత్తరేణి కూడా దొరకడం అరుదుగా మారింది.

### జిల్లేడు, తిప్పతీగ కూడా...

చాలామంది ఆరోగ్య సమస్యలను అధిగమించేందుకు జిల్లేడు ఆకులను వాడుతారు. ఆకులను దంచి దాని రసాన్ని గాయాలపై రుద్దితే గాయాలు త్వరగా మానుతాయని, ఉబ్బులు తగ్గుతాయని చెబుతుంటారు. జిల్లెడు ఆకు తెంపి దాని నుంచి కారే పాల చుక్కలను నొప్పి ఉన్న చోట పెట్టడంతో నొప్పులు తగ్గుతాయని విశ్వసిస్తారు. మరిన్ని సమస్యలకూ జిల్లెడును వాడుతారు. కీళ్ల సమస్యలు ఉన్న వారు తిప్పతీగను పొడిగా చేసి పాలల్లో కలుపుకొని తాగుతుంటారు. తిప్పతీగ చాలా రకరాల ఆరోగ్య సమస్యలకు మంచి ఔషధిగా చెబుతుంటారు. ఆర్థరైటీస్ సమస్యలకు బాగా పనిచేస్తుందని పేర్కొంటున్నారు. ఇప్పుడు పల్లెల్లో తిప్పతీగలే కాదు జిల్లెడు కూడా కనిపించడం లేదు.

## ఏనుగుల వల్ల రైతు దుర్మరణం చెందటం బాధాకరం



**అమరావతి,:** అన్నమయ్య జిల్లా పీలేరు సమీపంలోని బందార్లపల్లెలో ఏనుగుల సంచారం వల్ల రాజారెడ్డి అనే రైతు దుర్మరణం పాలైన ఘటనపై అటవీ శాఖ ఉన్నతాధికారులతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చర్చించారు. ఏనుగుల వల్ల రైతు దుర్మరణం చెందటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మృతి చెందిన రైతు కుటుంబాన్ని అటవీ శాఖ అధికారులు పరామర్శించి భరోసా ఇవ్వాలని ఆదేశించారు. మృతుని కుటుంబానికి అందాల్సిన నష్ట పరిహారం అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కర్ణాటక రాష్ట్ర అటవీ శాఖ అందించే కుంకీ ఏనుగులు వీలైనంత త్వరగా మన రాష్ట్రానికి వచ్చేలా చూడాలన్నారు. పీలేరు సమీపంలోని బందార్లపల్లెలో ఏనుగుల గుంపు హల్‌చల్ చేసింది.. అటవీప్రాంతం నుంచి పంటపొలాల్లోకి దూసుకెళ్లిన ఏనుగులు గుంపు విధ్వంసం సృష్టించాయి.. దేవళంపేట, అయ్యావాండ్లపల్లె, ఎర్రపాపిరెడ్డి పల్లెలో ఏనుగుల గుంపు పంటలకు తీవ్ర నష్టం కలిగించాయి.. వరి పంటను తొక్కి నాశనం చేశాయి ఏనుగులు.. ఇక, ఏనుగుల దాడిలో ఓ రైతు మృతి చెందాడు.. పుంగనూరు నుండి పీలేరు వైపునకు వెళ్తున్న ఏనుగుల గుంపు.. పీలేరు సమీపంలో ఇందిరమ్మ కాలనీ వద్ద మామిడి తోటలోకి చొరబడ్డాయి.. ఏకంగా 15 ఏనుగులు గుంపు మామితోటలను ధ్వంసం చేసింది.. అయితే, మామిడి తోపు యజమాని రాజారెడ్డిని ఏనుగులు తొక్కి చంపేశాయి. దీంతో, ఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు పోలీసులు.. మరోవైపు ఏనుగుల గుంపు సృష్టించిన విధ్వంసంపై అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు రైతులు.. ఇక, ఆ ఏనుగులను తిరిగి అటవీ ప్రాంతంలోకి పంపించే విధంగా తీసుకోవాల్సిన చర్యలపై దృష్టిసారించారు ఫారెస్ట్ అధికారులు.కాగా, ఇప్పటికే ఏనుగుల సమస్యపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టిసారించిన విషయం విదితమే.. దీనిపై ఏపీ-కర్ణాటక మధ్య ఒప్పందాలు కూడా జరిగాయి.

## గురుకులాల విషయంలో డిప్యూటీ సీఎం కీలక ఆదేశాలు..!



**హైదరాబాద్, :** తెలంగాణలో గురుకులాల పరిస్థితి దారుణంగా ఉందని ప్రతిపక్షనేతలు గత కొద్ది రోజుల నుంచి విమర్శిస్తున్న విషయం తెలిసిందే. మరోవైపు ఇవాళ తెలంగాణలోని కొన్ని గురుకుల పాఠశాలలకు అద్దె చెల్లించడం లేదని తాళాలు వేశారు. దీంతో వెంటనే మంత్రి స్పందించి.. తాళాలు వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను హెచ్చరించారు. తాజాగా గురుకుల పాఠశాలల విషయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇకపై గురుకుల కార్యదర్శి రోజూ ఒక పాఠశాలను పరిశీలించాలని ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నాణ్యతతో కూడిన విద్యాబోధన, సౌకర్యాల కల్పన వంటి అంశాలపై ఆ శాఖ కార్యదర్శులతో భట్టి విక్రమార్క సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడారు. గురుకుల పాఠశాలల భవనాల అద్దె చెల్లింపునకు నిధులు వెంటనే విడుదల చేయాలన్నారు. అద్దె భవనాల యజమానులతో మాట్లాడి అన్ని సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గురుకుల కార్యదర్శి క్షేత్ర స్థాయి పరిశీలన వివరాలతో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

### ఆమ్రపాలితో సహా ఆ ఐఏఎస్‌లకు భారీ షాక్..

## మొట్టికాయలు వేసిన క్యాట్



**హైదరాబాద్, :** తమ కేడర్ రాష్ట్రానికి వెళ్లేందుకు వెనుకడుగు వేస్తున్న ఐఏఎస్ అధికారులకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. కాట ఆమ్రపాలితో సహా ఐఏఎస్ అధికారులు ఖంగుతిన్నారు. తమను తెలంగాణలోనే కొనసాగించాలని చేసిన విజ్ఞప్తికి క్యాట్ ససేమిరా అని చెప్పింది. వెంటనే ఆంధ్రప్రదేశ్‌లో బాధ్యతలు చేపట్టాలని స్పష్టం చేసింది. విచారణ సమయంలో ఐఏఎస్ అధికారుల తీరుపై క్యాట్ అసహనం వ్యక్తం చేసింది. ముఖ్యంగా ఆమ్రపాలికి చీవాట్లు పడ్డాయి. ఏపీ కేడర్‌కు చెందిన వాకాటి కరుణ, వాణి ప్రసాద్, ఆమ్రపాలి, రోనాల్డ్ రోస్‌ను ఈనెల 16వ తేదీలోపు మీకు కేటాయించిన ఆంధ్రప్రదేశ్‌కు తిరిగి వెళ్లాలని డీఓపీటీ ఆదేశించిన విషయం తెలిసిందే. అయితే ఏపీకి వెళ్లేందుకు సమ్మతం లేని ఆ అధికారులు సోమవారం క్యాట్‌లో పిటిషన్ వేశారు. ఆ పిటిషన్‌పై మంగళవారం విచారణ చేపట్టిన క్యాట్ అధికారుల వైఖరిపై అసహనం వ్యక్తం చేసింది. బాధ్యతాయుతమైన అధికారులు ఇలా చేయడం సరికాదని పేర్కొంది. ఈ సందర్భంగా విచారణ హాట్‌హాట్‌గా కొనసాగింది. ఐఏఎస్ అధికారుల పిటిషన్‌పై క్యాట్‌లో ఐఏఎస్ అధికారులకు చుక్కెదురైంది. డీఓపీటీ ఇచ్చిన ఆదేశాలు పాటించాలని క్యాట్ ఆదేశించింది. ఈ సందర్భంగా ఐఏఎస్ తరపున న్యాయవాదులు బలంగా వాదనలు వినిపించారు. కాగా క్యాట్ ఇచ్చిన తీర్పుపై హైకోర్టులో సవాల్ చేస్తామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వానికి క్యాట్ నోటీసులు ఇచ్చింది. నవంబర్ మొదటి వారంలో మళ్లీ కేసు విచారణ జరుగుతుంది. 'ఏపీలోని విజయవాడ ప్రాంతాల్లో వరదల తో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు . అలాంటి చోట్లకు వెళ్లి ప్రజలకు సేవ చేయాలని లేదా?' అని క్యాట్ ఘాటుగా ప్రశ్నించింది. సరిహద్దులో సమస్యలు వస్తే వెళ్లలేరా? అని నిలదీశారు. ఇంట్లో కూర్చొని సేవ చేస్తామంటే ఎలా? క్యాట్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. వెంటనే ఆంధ్రప్రదేశ్‌లో రిపోర్టు ఇవ్వాలని ఆదేశించింది. అయితే క్యాట్ తీర్పుపై న్యాయ పోరాటం చేస్తామని ఐఏఎస్ అధికారుల న్యాయవాది తెలిపారు. క్యాట్‌లో దాఖలు చేసిన పిటిషన్‌లో వాకాటి కరుణ, వాణి ప్రసాద్, ఆమ్రపాలి, సృజన, రోనాల్డ్ రోస్ డీఓపీటీ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరారు. తమను తెలంగాణలోనే కొనసాగేలా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఏపీలో విధులు నిర్వహిస్తున్న సృజన కూడా తనను ఏపీలోనే కొనసాగించాలని కోరగా వారందరి విజ్ఞప్తులను క్యాట్ తిరస్కరించింది. డీఓపీటీ ఇచ్చిన తీర్పును పాటించాలని స్పష్టం చేసింది. క్యాట్ ఇచ్చిన తాజా తీర్పుతో ఈ అధికారులు తమ కేడర్ రాష్ట్రాలకు వెళ్తారా? లేదంటే న్యాయస్థానంలో పోరాటం చేస్తారా? అనేది ఆసక్తికర చర్చ జరుగుతోంది.

## పరిశీలకులుగా తెలంగాణ మంత్రులకు చోటు



న్యూఢిల్లీ: మహారాష్ట్ర, జార?ండ్ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ సీనియర్ పరిశీలకులను నియమించింది. ఈ మేరకు ఏఐసీసీ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.ఈ జాబితాలో తెలంగాణ నుంచి ముగ్గురికి చోటు కల్పించింది. మహారాష్ట్రలోని 5 డివిజన్లకు 11 మందిని నియమించగా.. వీరిలో రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్క ఉన్నారు. ఝూర?ండ్‌కు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు ఆ పార్టీ సీనియర్ నేతలు తారిక్ అన్వర్, అధిర్ రంజన్ చౌదరిని నియమించారు. కాగా మహారాష్ట్ర, జార?ండ్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన విషయం తెలిసిందే. మహారాష్ట్రకు ఒకే దశలో, జార?ండ్‌కు రెండు విడతల్లో పోలింగ్ జరగనుంది. నవంబర్ 20న మహారాష్ట్రకు, నవంబర్ 13న, 20న జార?ండ్‌కు ఎన్నికలు జరగనున్నాయి.

# ఇజ్రాయెల్‌పై హెజ్‌బొల్లా భీకర దాడి

### నలుగురు సైనికులు మృతి మరో 61 మందికి గాయాలు.. ఏడుగురి పరిస్థితి విషమం



డెయిర్ అల్-బలాహ్: ఇజ్రాయెల్‌లోని ఆర్మీ బేస్‌పై ఆదివారం హెజ్‌బొల్లా చేపట్టిన భీకర దాడిలో నలుగురు సైనికులు చనిపోగా మరో 61 మంది గాయపడ్డారు. వీరిలో ఏడుగురి పరిస్థితి విషమంగా ఉందని ఇజ్రాయెల్ ఆర్మీ తెలిపింది. రెండు వారాల క్రితం లెబనాన్‌లో తాము భూతల దాడులు మొదలు పెట్టాక హెజ్‌బొల్లా జరిపిన అతిపెద్ద దాడిగా ఇజ్రాయెల్ పేర్కొంది. గురువారం బీరుట్‌పై చేపట్టిన వైమానిక దాడులకు ప్రతీకారంగానే ఆదివారం బిన్యామియా నగరంపై డ్రోన్‌లతో దాడి చేశామని హెజ్‌బొల్లా ప్రకటించింది. ఇజ్రాయెల్ ప్రత్యేక బలగాలైన 'గొలాన్ బ్రిగేడ్'లక్ష్యంగా ఇజ్రాయెల్ గగనతల రక్షణ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు డజన్ల కొద్దీ మిస్సైళ్లను, అదే సమయంలో పదుల సంఖ్యలో డ్రోన్లను ప్రయోగించామని పేర్కొంది. ఇజ్రాయెల్ వద్ద అత్యాధునిక గగనతల రక్షణ వ్యవస్థలున్నప్పటికీ క్షిపణులు, డ్రోన్ల దాడిలో ఇంత భారీ స్థాయిలో నష్టం వాటిల్లడం చాలా అరుదైన విషయమని చెబుతున్నారు.

### స్కూలుపై దాడి..20 మంది మృతి

గాజాలోని నుసెయిరత్ శరణార్థి శిబిరంలోని స్కూలుపై ఆదివారం రాత్రి ఇజ్రాయెల్ ఆర్మీ జరిపిన వైమానిక దాడిలో పలువురు చిన్నారులు సహా 20 మంది చనిపోయారు. సోమవారం ఉదయం డెయిర్ అల్-బలాహ్‌లోని అల్ అక్సా మార్టిర్స్ ఆస్పత్రి వెలుపల జరిగిన మరో దాడిలో ముగ్గురు చనిపోయారు. దాడులతో టెంట్లతో మంటలు చెలరేగి, 50 మందికి కాలిన గాయాలయ్యాయి.

### లెబనాన్‌లో 21 మంది మృత్యువాత

లెబనాన్‌లో ఉత్తర ప్రాంత అయిటో నగరంలోని ఓ చిన్న అపార్టుమెంట్ భవనంపై జరిగిన ఇజ్రాయెల్ వైమానిక దాడిలో 21 మంది చనిపోయారని రెడ్ క్రాస్ తెలిపింది. హెజ్‌బొల్లా బలంగా ఉన్న దక్షిణ లెబనాన్, బీరుట్ ఉత్తర శివారు ప్రాంతాలపైనే ప్రధానంగా దాడులు జరుపుతున్న ఇజ్రాయెల్ ఆర్మీ ఉత్తర భాగంపై దాడికి దిగడం ఇదే మొదటిసారి.

### 'ఐరాస దళాల మాటున హెజ్‌బొల్లా'

లెబనాన్‌లోని శాంతి పరిరక్షక దళాలు హెజ్‌బొల్లా మిలిటెంట్లకు మానవ రక్షణ కవచాలుగా ఉపయోగపడుతున్నాయని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఆరోపించారు. ఐరాస దళాల ముసుగులో హెజ్‌బొల్లా మిలిటెంట్ల కార్యకలాపాలు దక్షిణ లెబనాన్ ప్రాంతంలో చురుగ్గా కార్యకలాపాలు సాగిస్తున్నాయని విమర్శించారు. తమ బలగాలు హెచ్చరికలను పాటించి, ఆ ప్రాంతం నుంచి వెంటనే ఐరాస బలగాలు వైదొలగాలన్నారు.

### ఉత్తర గాజాను ఖాళీ చేయించేందుకు ప్రయత్నం

ఉత్తర గాజా ప్రాంతంలో ఉన్న సుమారు 4 లక్షల మందిని అక్కడి నుంచి ఖాళీ చేసి దక్షిణం వైపు వెళ్లి పోవాలని ఇజ్రాయెల్ ఆదేశించింది. వీరిని ఎలాగైనా ఖాళీ చేయాలనే లక్ష్యంతోనే ఈ నెల ఒకటోతేదీ నుంచి ఈ ప్రాంతానికి ఆహార సరఫరాను సైతం నిలిపివేసింది. వెళ్లకుండా అక్కడే ఉండే వారిని మిలిటెంట్లుగా గుర్తించేందుకు ఉద్దేశించిన ప్రణాళికను మాజీ సైనిక జనరళ్లు ప్రభుత్వానికి అప్పగించినట్లు సమాచారం.

# దామగుండం.. అగ్నిగుండం కారాదు




వికారాబాద్ జిల్లా పూడూరు మండలంలోని 'దామగుండం' అటవీ ప్రాంతంలో భారత నావికాదళం(ఇండియన్ నేవీ) నిర్మించ తలపెట్టిన వీఎల్ఎఫ్ స్టేషన్ నిర్మాణానికి రూ.2,500 కోట్లతో వెచ్చించటానికి ముహూర్తం ఖరారైంది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా హాజరవుతారని సమాచారం. వీఎల్ఎఫ్ స్టేషన్ కోసం 2,900 ఎకరాల అటవీ భూమి నేవీకి అధికారికంగా అప్పగించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధంచేశారు. దామగుండం పరిరక్షణకు స్థానిక ప్రజలు, యువతీ యువకులతోపాటు, పర్యావరణ వేత్తలు ఆందోళన బాట పట్టారు. విపక్షాలు గొంతువిప్పుతున్నాయి. ప్రజలతో సంఘర్షణ లేకుండా ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరైన నిర్ణయం తీసుకోవాలి.

### వీఎల్ఎఫ్ రాడార్ స్టేషన్ అంటే ఏమిటి ?

వీఎల్ఎఫ్ రాడార్ అంటే 'వెరీ లో ఫ్రీక్వెన్సీ రాడార్' అని అర్థం. దీని ద్వారా సముద్రంలో దూర ప్రాంతంలో ఉన్న ఓడలు, జలాంతర్గాముల్లోని సిబ్బందితో నావికా సిబ్బంది సమాచారాన్ని ఇచ్చి, పుచ్చుకో కోవచ్చు. ఈ వ్యవస్థ మూలంగా 3కేజీ హెచ్ జెడ్ రేంజ్‌లో తరంగాలను ప్రసారం చేస్తుంది. నీటిలోపల 40 మీటర్ల లోతు వరకు ఈ తరంగాలు చొచ్చుకెళ్తాయి. అలాగే, 1000 కిలోమీటర్ల దూరంలో ఉన్నవారికి సిగ్నల్స్ నిరాఘాటంగా అందించటానికి వీలవుతుంది. రక్షణ రంగం అవసరాలతో పాటు, రేడియో కమ్యూనికేషన్ అవసరాలకు కూడా ఉపయోగపడుతుందట. ఇలాంటిది ఇప్పటివరకు మన దేశంలో తమిళనాడులో 'తిరునెల్వేలి'లో ఉంది.

ఇక్కడే ఎందుకు.. ప్రత్యామ్నాయం లేదా?

తెలంగాణలో సముద్రం లేదు. అయినా ఈ నిర్మాణం ఇక్కడే ఎందుకు? అనేది పెద్ద ప్రశ్న. నేవీ అధికారులు చెప్పేదేమిటంటే తూర్పున బంగాళాఖాతం, పశ్చిమాన అరేబియా సముద్రంలో ఉన్న ఓడలు, జలాంతర్గాములోని సిబ్బందితో మాట్లాడటానికి వీలుగా ఈ రెండు ప్రాంతాలకు మధ్యలో తెలంగాణలోని దామగుండం ప్రాంతం సాంకేతికంగా అనువుగా ఉంటుందట. దామగుండం సముద్ర మట్టానికి 360 అడుగుల ఎత్తున ఉంది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు 60 కి.మీ.దూరంలో ఉండటమే ఈ నిర్ణయానికి ప్రధాన కారణంగా నేవీ అధికారులు చెబుతున్నారు. దామగుండం రిజర్వ్ ఫారెస్ట్ లోని 2900 ఎకరాల అటవీ భూమిని జనవరి 24న నావికాదళ అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి లాంఛనంగా అప్పగించారు. ఈ ప్రాజెక్టు శంకుస్థాపన జరగనుంది కాబట్టి ప్రజల ఆందోళనలు దృష్టిలో పెట్టుకుని ప్రస్తుత ప్రభుత్వం అత్యంత జాగ్రత్తగా వ్యవహరించవలసి ఉంది.

### అడవికి, పర్యవరణానికి నష్టం జరగదా?

మొత్తం 2900 ఎకరాలకు గాను 1500 ఎకరాల్లో ఎలాంటి కార్యకలాపాలు నేవీ చేపట్టదు. పర్యావరణానికి నష్టం లేకుండా మొక్కలు, చెట్లు లేని ప్రాంతంలో 350 ఎకరాల్లోనే సుమారు 3000 మందికి నివాసం ఉండే విధంగా ఓ టౌన్ షిప్‌ను నిర్మిస్తారు. ఇక్కడ 600 మంది సిబ్బంది తమ విధులు నిర్వహిస్తారు. వందల ఏళ్ళ నాటి వట వృక్షాలను తెగనరికి పర్యావరణ పరిరక్షణ కోసం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిసర ప్రాంతాలలో విరివిగా మొక్కలు నాటుతారు. అయితే ఈ రాడార్ ప్రాజెక్ట్ నిర్మాణంలో వివిధ అవసరాల కోసం అడవిలో సుమారు 12 లక్షల చెట్లు నరికివేయాల్సి ఉంటుంది. మూసీ నది పరివాహక ప్రాంతం దెబ్బతింటుంది. అడవిలోని జీవవైవిధ్యం నాశనం అవుతుంది. అక్కడ ప్రసిద్ధి చెందిన పురాతన శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం ఉంది. ఇకపై దేవాలయానికి రహదారిని నేవీ మూసివేస్తుంది. దీంతో భక్తులు స్వేచ్ఛగా వెళ్ళే అవకాశం ఉండదు.


### రేడియేషన్‌తో ప్రమాదం లేదా?

ఈ అటవీ ప్రాంతాన్ని ఆవరించి ఉన్న 20 గ్రామాలు, దాదాపు 60 వేల మంది ప్రజలు అడవి పై ఆధారపడి జీవిస్తున్నారు. వారి పశు వులకు మేతకు ఇకపై అవకాశం ఉండదని స్థానికులు బాధపడుతున్నారు. పైగా దాదాపు వెయ్యి సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ అడవిలో 500 రకాల వైవిధ్యభరితమైన చెట్లు,150 రకాల ఔషధ వృక్షాలు, మొక్కలు నరికి వేస్తారు. వీటితో పాటు ఎంతో అరుదైన జింకలు, తోడేళ్లు, అడవి పందులు మొదలైన జంతువులతో పాటు వేలరకాల పక్షులు తమ గూడును కోల్పోతాయి. ఈ రాడార్ స్టేషన్ వల్ల ప్రాణాంతకమైన రేడియేషన్ వెలువడుతుంది. గాలి, నీరు, పర్యావరణం తీవ్రంగా కలుషితం అవుతుంది. చుట్టుప్రక్కల ప్రజలకు మానసిక ఆందోళన, నిద్ర లేమి, మానసిక రుగ్మతలు, సంతాన లేమి, వంధ్యత్వం, చర్మ రోగాలు మొదలైన అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. అందుకే ఇక్కడ స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనలో ఉన్నారు. ప్రభుత్వమే స్వయంగా రాడార్ కేంద్రం శంకుస్థాపనకు పూనుకుంటే! ప్రజలు తమ గోడు ఎవరికి చెప్పుకోవాలి?

### 'సేవ్ దామగుండం' పేరిట ఆందోళనలు

రాడార్ స్టేషన్ ఏర్పాటు రద్దు కోరుతూ దామగుండం అటవీ సంరక్షణ జేఏసీ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. అయితే, ప్రభుత్వ షరతులన్నింటినీ పాటించాలని హైకోర్ట్ నేవీకి ఆదేశించింది. ఎలాంటి ఇబ్బంది పెట్టకుండా రామలింగేశ్వర స్వామి ఆలయానికి భక్తులను అనుమతిస్తామని నేవీ కోర్టుకు స్పష్టం చేసింది. కాగా రాడార్ స్టేషన్ ఏర్పాటయితే 12 లక్షల మొక్కలు నరికి వేతకు గురవుతాయనే వ్యాఖ్యలను అటవీశాఖ కొట్టిపారేసింది. నేవీకి ఇచ్చిన భూముల్లో ఉన్న1.93 లక్షల చెట్లకు నష్టం జరగదని.. చెట్లు లేని చోటే తాము నిర్మాణాలు చేపడతామని నమ్మబలుకుతుంది. జీవ వైవిధ్యాన్నీ, అరుదైన పశు, పక్షుల ఆవాసాన్ని పరిరక్షించే బాధ్యత ఈ ప్రభుత్వంపై, ఈనాగరిక సమాజం మీదనే ఉంది. ప్రజలతో సంఘర్షణ లేకుండా ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరైన నిర్ణయం తీసుకోవాలి.

# ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేద్దాం!



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఇటీవల స్కిల్ యూనివర్సిటీని పెట్టి, ఐటిఐలకు అనుసంధానం చేసి, కార్పొరేట్ కంపెనీలకు ఎటాచ్ చేసి ఉద్యోగాలను కల్పించాలనే భావన హర్షణీయం. రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక, సంస్థల పాఠశాలల్లో 11,062 ఉపాధ్యాయ పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలనుకోవడం, కార్యరూపం దాల్చడం శుభపరిణామం. భారత ప్రభుత్వం జాతీయ విద్యా పాలసీ 2020 (ఎన్ఇపి 2020)లో మన దేశానికి ఒక మిలియన్ పైగా ఉపాధ్యాయుల అవసరం ఉన్నట్లు అంచనా వేసినప్పటికీ క్షేత్రస్థాయిలో గణాంకాల ప్రకారం 2.5 లక్షల పైగా ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నట్లు నిర్ధారించారు. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి, కేవలం ప్రభుత్వానిదే బాధ్యత కాదు, ప్రజలందరి బాధ్యత. ప్రతి ఒక్కరూ విద్యార్థి భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని విద్యా రంగాన్ని బలోపేతం చేయవలసిన అవసరం ఉంది. "మీ పైన ఉన్న బల్బును చూస్తే, మీకు థామస్ అల్వా ఎడిసన్ గుర్తుకు వస్తారు. టెలిఫోన్ బెల్ మోగినప్పుడు మీకు అలెగ్జాండర్ గ్రాహం బెల్ గుర్తుకు వస్తారు. నోబెల్ బహుమతి పొందిన మొదటి మహిళా వ్యక్తి మేరీక్యూరీ. మీరు నీలాకాశాన్ని చూసినప్పుడు, మీకు గుర్తుకు వచ్చేది సర్.సి.వి. రామన్". మాజీ రాష్ట్రపతి స్వర్గీయ డాక్టర్ ఎ.పి.జె. అబ్దుల్ కలామ్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించినప్పుడు మాట్లాడిన మాటలివి.

ఉపాధి అవకాశాలు ఎలా?

ప్రతి విద్యార్థి పరిశోధనలపై, తన సొంత ఆలోచనలను పదును పెట్టి, మన దేశ ఖ్యాతిని నిలబెట్టాలి. ప్రతి ఉన్నత పాఠశాలలో, ప్రతి జూనియర్ కాలేజీలో ప్రభుత్వం ఒకేషనల్ కోర్సులను ప్రవేశపెట్టాలి. ఐ.టి.ఐ.లకు ప్రాధాన్యతను ఇవ్వాలి. ప్రభుత్వం సైన్స్ అండ్ టెక్నాలజీ, పరిశోధనా రంగంలో ప్రాముఖ్యతనిస్తే, తయారీ, నిర్మాణం, పునరద్పాదకత, ఇంధన వనరులు, రవాణా తదితర రంగాల్లో భారీ ఎత్తున ఉపాధి అవకాశాలు పుట్టుకొస్తాయి. స్వర్గీయ డా. అబ్దుల్ కలాం మాజీ రాష్ట్రపతి ఎక్కడో రామేశ్వరంలో డైలీపేపర్లు వేసుకుంటూ జీవించిన ఓ పిల్లాడు, రోజు రోజుకు ఎదుగుతూ, దేశం గర్వించదగ్గ సైంటిస్ట్‌గా మారడం, తదనంతరం దేశ రాష్ట్రపతిగా ఎదగడం, పద్మభూషన్, పద్మవిభూషణ్, భారతరత్న మొదలగు అతి గొప్ప అవార్డులు పొందడం, దేశం గర్వించదగ్గ విషయం. ఆయన నేటి విద్యార్థులకు ఆదర్శం, విద్యార్థులలో విజ్ఞానాన్ని నింపడానికి ప్రయత్నం చేశాడనీ, భారత రాష్ట్రపతిగా ప్రపంచ శాంతి కోసం పరితపించాడనీ కొనియాడుతూ.. ఐక్యరాజ్య సమితి ఆయన జయంతి రోజైన 15 అక్టోబర్‌ను ప్రపంచ విద్యార్థుల దినోత్సవంగా నిర్ణయించింది. ఆయన భారతదేశానికి 11వ రాష్ట్రపతి(2002-2007) రాజకీయ నాయకుడిగా, శాస్త్రవేత్తగా, ఉపాధ్యాయుడిగా ఉండి, 27 జులై 2015న ఐఐఎం షిల్లాంగ్‌లో విద్యార్థులకు ఉపన్యాసం ఇస్తూనే తన 83వ ఏట గుండెపోటుతో మరణించాడు. ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలుగా ఉండి, విద్యార్థుల్లో జ్ఞానాన్ని, నైపుణ్యాలను పెంపొందిస్తేనే మంచి సమాజం నిర్మితమవుతుందని డా. అబ్దుల్ కలామ్ అన్నారు.

సంఖ్య కాదు విద్యా నాణ్యత పెంచాలి

ప్రభుత్వాలు, విద్యారంగ నిపుణుల సలహాలు తీసుకుని, విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని ప్రణాళికలు వేయాలి. అధికారంలోకి వచ్చిన ప్రతి ప్రభుత్వం తన ఇమేజ్ కొరకు కొత్త తరహా పాఠశాలలను, కళాశాలలను నెలకొల్పడం, పాఠశాలల విద్యా నాణ్యతను పట్టించుకోకుండా కేవలం పాఠశాలలు, కళాశాలల సంఖ్యను పెంచడం పైనే దృష్టి పెట్టింది. కనీసం ఇప్పుడైనా విద్యా నాణ్యతను పెంచడంపై ప్రస్తుత ప్రభుత్వం దృష్టి పెట్టాలని ఆశిద్దాం. తెలంగాణ ప్రభుత్వం విద్యారంగానికి కేవలం 7.3% మాత్రమే నిధులు కేటాయించింది. 2022-23 సంవత్సరంలో దాదాపు 8500 ప్రభుత్వ పాఠశాలల్లో 20 మంది కన్నా తక్కువ విద్యార్థులున్నారు. 1864 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులే లేరు. పాఠశాలల, కళాశాలల పర్యవేక్షణాధికరులు సరిపోయినంత మంది లేరు. ప్రస్తుతం ఉన్న పాఠశాలల్లో టీచర్ పోస్టులు చాలా వరకు ఖాళీగా ఉన్నాయి.

కనీస వసతులు లేని స్కూళ్లు ఎందుకు?

ప్రభుత్వ యూనివర్సిటీలలో 2వేలకు పైగా ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్రంలోని సెకండరీ విద్యాశాఖలో 64 డిప్యూటీ జిల్లా విద్యాశాఖాధికారుల పోస్టులు, 8 జిల్లా విద్యాశాఖాధికారుల పోస్టులు ఉపాధ్యాయులను తయారు చేసే డైట్ కళాశాలల్లో 189 లెక్చరర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ గురుకుల విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలలు, కెజిబివి పాఠశాలల నాణ్యతపైన ప్రభుత్వం దృష్టి పెట్టవలసిన అవసరం ఉంది. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో సరిపడా తరగతి గదులు ఉన్నాయా? లేదా? సబ్జెక్టుకు ఒక ఉపాధ్యాయుడు ఉన్నాడా, మరుగుదొడ్లు, నీటి సౌకర్యం ఉందా? ఇటువంటి విషయాలపైనా ప్రభుత్వం దృష్టి పెట్టవలసిన అవసరం ఉంది. ప్రస్తుతం ఉన్న 17 ప్రభుత్వ విశ్వ విద్యాలయాలు, 4036 కాలేజీలను సమగ్రంగా అభివృద్ధి చేసినప్పుడే విద్యలో నాణ్యతను సాధించగలం. కాలానుగుణంగా వస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆకళింపు చేసుకుంటూ, బోధనా నైపుణ్యాలను ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులు మెరుగుపరుచుకోవలసిన అవసరం ఉంది.

ప్రభుత్వ విద్య బలోపేతం అందరి బాధ్యత

ఆధునిక ఉపాధ్యాయుడు విద్యార్థికి %-%ఒక స్నేహితుడుగా, ఒక తత్త్వవేత్తగా, ఒక మార్గదర్శకుడిగా ఉండాల్సిన అవసరం ఉంది. ఉపాధ్యాయులు ఉన్నత ప్రమాణాలను పాటించి మంచి పౌరులను అందించాల్సిన బాధ్యత ఉంది. ఉపాధ్యాయులు తమ అలవాట్లలో, ఆలోచనలలో, జీవిత విధానాలలో విద్యార్థికి ఆదర్శంగా ఉండాలి. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి, కేవలం ప్రభుత్వానిదే బాధ్యత కాదు, ప్రజలందరి బాధ్యత. ప్రజల పన్నుల ద్వారా ప్రజాప్రభుత్వాలు, ప్రభుత్వ బడ్జెట్ ఏర్పడుతుంది. ప్రజలకు, అధికార, ప్రతిపక్ష ప్రజాప్రతినిధులకు, అందరిది సమిష్టి బాధ్యత. ప్రతి ఒక్కరూ విద్యార్థి భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని విద్యా రంగాన్ని బలోపేతం చేయవలసిన అవసరం ఉంది.


# విస్తరణ కోసం సామ్రాజ్యవాదం పాట్లు - ప్రమాదాలు




“తన ప్రభావాన్ని, తన పెత్తనం కింద ఉండే భూభాగాన్ని సైతం విస్తరించుకోడానికి ద్రవ్య పెట్టుబడి అనివార్యంగా తీవ్రంగా పాటు పడుతుంది” అని లెనిన్ తన ప్రసిద్ధ గ్రంథం “సామ్రాజ్యవాదం-పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ”లో పేర్కొన్నారు. సామ్రాజ్యవాద దేశాలు వాటిలో అవి తీవ్ర శత్రుత్వంతో తలపడుతున్న కాలంలో లెనిన్ ఈ గ్రంథాన్ని రాశారు. ఆ కాలంలో ప్రత్యర్థులుగా ఉన్న ఆ యా దేశాల ద్రవ్య పెట్టుబడులు అప్పటికే ప్రపంచాన్ని తమ నడుమ పంచుకుని వున్నందున ఇక విస్తరించడానికి అదనంగా మిగిలిన జాగా అంటూ ఏదీ లేకపోయింది. అందుచేత తమ తమ పెత్తనాల కింద ఉన్న ప్రాంతాలను మళ్ళీ మరోసారి పునర్విభజన చేసుకోవడం మినహా వారికి వేరే దారి లేకపోయింది. అందుకు పరస్పరం యుద్ధాలలో తలపడడం తప్ప వేరే పద్ధతి లేకుండా పోయింది. ఐతే ఆ యుద్ధాలు సామ్రాజ్యవాదం మొత్తంగా బలహీన పడడానికే దారి తీశాయి. అంతేకాక, సామ్రాజ్యవాద పెత్తనం నుండి విడిపోయి విప్లవాల ద్వారా సోషలిస్టు దేశాలు ఏర్పడడానికి, ఆ సోషలిస్టు దేశాల మద్దతుతో అనేక వలస దేశాలు సామ్రాజ్యవాదుల ఆధిపత్యం నుంచి బైట పడడానికి కూడా ఆ పరిస్థితులు దారి తీశాయి. అనంతర కాలంలో పెట్టుబడి కేంద్రీకరణ కొనసాగింది. అంతేగాక అది బలపడింది. ఆ శక్తితోనే ద్రవ్య పెట్టుబడి ఇప్పుడు సామ్రాజ్యవాదుల నడుమ ఉండే వైరుధ్యాన్ని అదుపు చేయగలుగుతోంది. అక్కడితో ఆగకుండా ఇప్పుడు యావత్తు ప్రపంచమూ తన స్వైర విహారానికి దాసోహం అనాలనే వైఖరి తీసుకుంది. ఈ నేపథ్యంలో ఐక్యంగా వ్యవహరిస్తున్న సామ్రాజ్యవాద శిబిరం ఒకప్పుడు తన పెత్తనం కింద ఉన్న భూభాగాల్లో మళ్ళీ పెత్తనం చెలాయించడానికి తయారౌతోంది. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి, సామ్రాజ్యవాదం తమ లక్ష్యాలను నెరవేర్చుకోడానికి రెండు మార్గాలను అనుసరిస్తున్నాయి. మొదటిది: ప్రపంచం మొత్తం మీద నయా ఉదారవాద ఆర్థిక వ్యవస్థను బలవంతంగా రుద్దడం. ఈ విధానాలు వలస విముక్తి అనంతరం ఆ యా దేశాలు సాధించిన పురోగతిని దెబ్బ తీస్తాయి. రెండవది: ఈ మొదటి ప్రయత్నం పని చేయని చోట్ల యుద్ధాలను పురికొల్పడం. నయా ఉదారవాద వ్యవస్థ ప్రపంచ వ్యాప్తంగా కార్మిక వర్గాన్ని బలహీన పరచింది. తన ఉత్పత్తి కార్యకలాపాలనన్నింటినీ తక్కువ వేతనాలకే పని చేసే కార్మికులుండే మూడవ ప్రపంచ దేశాలకు తరలించుకు పోతానని బెదిరిస్తూ అది అభివృద్ధి చెందిన దేశాల కార్మిక వర్గాన్ని బెదిరిస్తోంది. ఆ విధంగా అక్కడ వేతనాలను పెరగనివ్వకుండా స్తంభింపజేసింది. ఉత్పత్తి కార్యకలాపాలు తరలివచ్చిన మూడవ ప్రపంచ దేశాలలో సైతం కార్మికుల నిజ వేతనాలలో పెరుగుదల ఏమీ లేదు. అక్కడ నిరుద్యోగం ఏ మాత్రమూ తగ్గకపోవడమే దీనికి కారణం. వేతనాలలో ప్రపంచం మొత్తం మీద ఎక్కడా పెరుగుదల లేకపోవడంతో బాటు శ్రామిక ఉత్పాదకత బాగా పెరిగింది. దాని ఫలితంగా ఆర్థిక సంపదలో పెట్టుబడిదారుల వాటా బాగా పెరిగింది. ముఖ్యంగా సంపన్న దేశాల వాటా బాగా పెరిగింది. ఆర్థిక అసమానతలు వేగంగా పెరిగిపోయాయి. దానితోబాటు శ్రామికుల వేతనాలలో పెరుగుదల లేని కారణంగా వారిలో అత్యధికులు, ముఖ్యంగా మూడవ ప్రపంచ దేశాల శ్రామికులు పోషకాహార లేమితో బాధ పడుతున్నారు. మరోపక్క సంపన్నుల వద్ద పోగుబడే సంపద ఎంత పెరిగినా, వారి వినిమయం ఆ మేరకు పెరగదు. కనుక సమాజంలో అధికోత్పత్తి సమస్య ముందుకొచ్చింది (అధికోత్పత్తి అంటే ఉత్పత్తి అయ్యే సరుకుల పరిమాణం పెరగడం అని మాత్రమే అనుకోరాదు. ప్రజల కొనుగోలు శక్తికి మించి ఉత్పత్తి ఉంటే అది అధికోత్పత్తి అవుతుంది. ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోయి, ఉత్పత్తి అయ్యే సంపద ఇదివరకటి స్థాయిలోనే ఉన్నా అది అధికోత్పత్తి అవుతుంది.). ఈ అధికోత్పత్తి సమస్యను పరిష్కరించడానికి కీన్స్ సూచించిన మార్గం ప్రభుత్వ వ్యయాన్ని పెంచడం. ఆ మార్గం ప్రస్తుత నయా ఉదారవాద వ్యవస్థలో అమలు చేయడం ప్రభుత్వాలకి సాధ్యం కాదు. ప్రభుత్వ వ్యయాన్ని పెంచి దేశంలో డిమాండ్‌ను బలపరచడానికి రెండు మార్గాలు ఉన్నాయి. మొదటిది ద్రవ్య లోటును బాగా పెంచి రుణాలు తెచ్చి దానిని ఖర్చు చేయడం. రెండవది సంపన్నుల మీద అధికంగా పన్నులు వేసి ఆ ధనం ఖర్చు చేయడం. ఈ రెండు మార్గాలూ నయా ఉదారవాదానికి అంగీకారం కాదు. దానిని కాదని ఏ దేశమైనా ముందుడుగు వేస్తే వెంటనే ఆ దేశం నుండి అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఒక్కపాటున తరలిపోతుంది. ఆ దేశ ఆర్థిక వ్యవస్థ ఇబ్బందుల్లో పడుతుంది. అందుచేత ప్రతీ దేశమూ దాని నిబంధనలకు తలొగ్గి వ్యవహరిస్తున్నది. నయా ఉదారవాద పెట్టుబడిదారీ వ్యవస్థలో అనివార్యంగా తలెత్తిన ఈ అధికోత్పత్తి ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ఆర్థిక మాంద్యంలోకి నెడుతోంది. ఇదే సమయంలో నయా ఫాసిజం ఉవ్వెత్తున ముందుకొస్తోంది. ఈ నయా ఫాసిస్టు శక్తులతో కార్పొరేట్లు జత కట్టడానికి అనుకూలంగా ఉంటాయి. ఎందుకంటే నయా ఫాసిజం ప్రజానీకపు దృష్టిని ప్రస్తుత ఆర్థిక దోపిడీ నుంచి పక్కకు మళ్ళించగలిగే శక్తి కలిగివుంది. నయా ఫాసిస్టులు ప్రజల ముందు వారి నిత్య జీవితపు భౌతిక పరిస్థితుల గురించి కాక, ఆ ప్రజల్లోని ఏవో కొన్ని మైనారిటీ సమూహాలపై (అవి మత పరంగా కాని, జాతి పరంగా గాని మైనారిటీలు కావచ్చు) విద్వేషాన్ని రెచ్చగొట్టి వారిని పరాయివారిగా చిత్రిస్తుంది. కొన్ని దేశాలలో నయా ఫాసిస్టు శక్తులు అధికారాన్ని చేజిక్కించుకున్నాయి. మరికొన్ని దేశాలలో అధికారం కోసం అర్రులు చాస్తున్నాయి. ఉదారవాద ప్రజాస్వామ్య వ్యవస్థల్లో నయా ఫాసిస్టు శక్తులు అధికారాన్ని పూర్తిగా చేజిక్కించుకోడానికి సాపేక్షంగా కొంత సమయం పట్టవచ్చు. ఈ నయా ఫాసిస్టు శక్తులు అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఆ యా దేశాలలో అధికోత్పత్తి సమస్య పరిష్కారం కాదు. ఆ దేశ ఆర్థిక వ్యవస్థ నయా ఉదారవాద చట్రం లోపలే నడుస్తూ వుంటుంది. అందుచేత అక్కడ ప్రభుత్వ వ్యయం పెంచి అధికోత్పత్తి సమస్యను పరిష్కరించడం ఆ నయా ఫాసిస్టు ప్రభుత్వాలకి కూడా సాధ్యం కాదు. ఆ యా దేశాల ప్రభుత్వాలు ఆర్థిక మాంద్యం సమస్యని పరిష్కరించడంలో విఫలం అయినందువల్ల అక్కడ నయా ఫాసిస్టు శక్తులు బలపడితే దానికి సామ్రాజ్యవాదాన్ని ఎలా బాధ్యుల్ని చేస్తారు మీరు? అని కొందరు అడగవచ్చు. సమాధానం ఒక్కటే. ఆర్థిక మాంద్యం నుండి బైట పడాలంటే ఏ దేశమైనా నయా ఉదారవాద చట్రం పట్టునుండి బైట పడాలి. అలా బైట పడేందుకు ఏ దేశమైనా ప్రయత్నిస్తే వెంటనే సామ్రాజ్యవాద దేశాలు, మరీ ముఖ్యంగా అమెరికా ఆ దేశం మీద ఆంక్షలు విధిస్తాయి. ఆ విధంగా సామ్రాజ్యవాదం తన గతకాలపు పెత్తనాన్ని తిరిగి సాధించడానికి చేస్తున్న ప్రయత్నాలు ప్రపంచమంతటా ప్రజానీకాన్ని తీవ్ర దారిద్ర్యంలోకి, కడగండ్లలోకి నెట్టడమే కాకుండా నయా ఫాసిస్టు శక్తులు బలపడడానికి సైతం ఊతం ఇస్తున్నాయి. ఇక సామ్రాజ్యవాదం అనుసరించే రెండో మార్గం యుద్ధాలను పురికొల్పడం. ప్రస్తుతం నడుస్తున్న రెండు యుద్ధాలూ ప్రపంచాన్ని వినాశనం అంచుకు నెడుతున్నాయి. ఈ రెండు యుద్ధాలూ ఇలా కొనసాగడానికి వాటి వెనుక సామ్రాజ్యవాదం పోషిస్తున్న పాత్రే ప్రధాన కారణం. అంతే కాదు, ఈ రెండు యుద్ధాలూ అణు యుద్ధాలుగా మారిపోయే ప్రమాదం కూడా ఉంది. ఉక్రెయిన్ యుద్ధాన్నే తీసుకోండి. సోవియట్ యూనియన్ పతనం అయిన తర్వాత ఇకముందు నాటో ను తూర్పు దిశగా విస్తరించబోము అని సామ్రాజ్యవాద దేశాలు మిఖాయిల్ గోర్బచేవ్ కు హామీ ఇచ్చాయి. కాని దానిని ఉల్లంఘించి ఉక్రెయిన్ వరకూ విస్తరించాయి. వాస్తవానికి ఉక్రెయిన్ కూడా నాటోలో చేరడానికి సుముఖత చూపలేదు. ఆ దేశంలో ఎన్నికల్లో గెలిచి దేశాధ్యక్షుడు అయిన విక్టర్ యానుకోవిచ్ నాటోలో చేరడానికి అంగీకరించలేదు. దానితో అతడిని కుట్ర ద్వారా కూలదోశారు. ఆ దేశానికి అమెరికా ప్రతినిధిగా వ్యవహరించిన విక్టోరియా న్యూలాండ్ ఉక్రెయిన్ లో గతంలో హిట్లర్ కు అనుచరుడుగా వ్యవహరించిన స్టెపాన్ బందేరా కు చెందిన మద్దతుదారులను ఈ కుట్ర తర్వాత గద్దెనెక్కించారు. ఈ కొత్త తొత్తు ప్రభుత్వం నాటో కూటమిలో చేరడానికి సిద్ధపడింది. అంతేగాక, ఉక్రెయిన్ లో రష్యన్ భాష మాట్లాడే ప్రజలు ఎక్కువగా ఉన్న డాన్‌బాస్ ప్రాంతం మీద దాడికి తలపడి వేలాది మంది ప్రాణాలు తీసింది. దాంతో రష్యా జోక్యం చేసుకోవలసి వచ్చింది. ఈ యుద్ధం కొనసాగడానికి రష్యా ప్రధాన కారణమా లేక సామ్రాజ్యవాదులా అన్నది ప్రశ్న. దీనిని నిగ్గు తేల్చాలంటే ఒకే ఒక ప్రశ్నకు సమాధానం చెప్పాలి. ఇప్పుడు ఉక్రెయిన్ కు, రష్యాకు మధ్య శాంతి ఒప్పందం జరగకుండా అడ్డు పడుతున్నదెవరు? గతంలో ఫ్రాన్స్, జర్మనీ చొరవ చేసి ఈ రెండు దేశాలకూ నడుమ ఒక ఒప్పందం జరగడానికి కృషి చేశాయి. దానినే మిన్స్క్ ఒప్పందం అంటారు. ఆ ఒప్పందం మీద ఉక్రెయిన్ దేశాధ్యక్షుడు సంతకం చేసే లోగానే అమెరికా పనుపున అప్పటి బ్రిటిష్ ప్రధాని బోరిస్ జాన్సన్ హుటాహుటిన కీవ్ పట్టణానికి వెళ్ళి ఆ సంతకాలు జరగకుండా అడ్డుపడ్డాడు. పోనీ, సామ్రాజ్యవాద దేశాలలో కనీసం ఫ్రాన్స్, జర్మనీ అయినా శాంతి కావాలి అని తాపత్రయంతో ఉన్నాయి అనుకుందామా అంటే అదీ లేదు. ఈ మధ్యనే జర్మనీ దేశాధినేత ఏంజెలా మెర్కెల్ ఒక ప్రకటన చేసింది. మిన్స్క్ ఒప్పందం అనేది ఉక్రెయిన్ యుద్ధానికి పూర్తిగా సిద్ధపడేవరకూ వ్యవధి తీసుకోడానికి ఒక సాకుగా మాత్రమే ప్రతిపాదించాం అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. వాస్తవానికి ఈ యుద్ధం వెనుక అసలు లక్ష్యం ఏమంటే రష్యా దేశాన్ని సామ్రాజ్యవాదుల పెత్తనం కిందకు తీసుకురావడమే. రష్యాకు బోరిస్ ఎల్సిన్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు దాదాపు రష్యా సామ్రాజ్యవాదుల పెత్తనం కిందకు పోయినంత పనైంది. ఇక రెండో యుద్ధాన్ని తీసుకోండి. ఇజ్రాయిల్ అత్యంత క్రూరంగా, నిర్దాక్షిణ్యంగా పాలస్తీనా ప్రజలమీద అదే పనిగా దాడులు చేస్తూనే వుంది. ఇప్పుడు ఆ దాడులు లెబనాన్ కు కూడా వ్యాపించాయి. అమెరికా సామ్రాజ్యవాదం ఇజ్రాయిల్ లోని జాత్యహంకార ప్రభుత్వానికి పూర్తి అండగా నిలిచింది. ఇజ్రాయిల్ ప్రభుత్వ నేతలకు అమెరికా రాజకీయాలను ప్రభావవంతం చేసే శక్తి ఉన్నందునే ఈ మద్దతు పొందగలుగుతోంది అని పైపైన చూస్తే అనిపిస్తుంది. కాని అది పూర్తి గా తప్పు. బైట నుండి వలసదారులుగా పాలస్తీనా వచ్చి ఆఖరికి ఆ దేశస్తులైన పాలస్తీనా ప్రజలనే అక్కడినుంచి వెళ్ళగొట్టే “వలసదారీ సామ్రాజ్యవాదం” (సెటిలర్ కొలోనియలిజం)లో పాత్రధారి ఇజ్రాయిల్ అయినా. అసలు సూత్రధారి మాత్రం సామ్రాజ్యవాదమే. ఆ వలసదారీ సామ్రాజ్యవాద విస్తరణ కోసమే ఇజ్రాయిల్ అక్కడ పాలస్తీనా జాతిని మొత్తంగా తుడిచి పెట్టడానికి పూనుకుంది. ఆ మధ్య ఆసియా ప్రాంతాన్ని మొత్తంగా ఇజ్రాయిల్ ద్వారా తన ఆధీనం లోకి తెచ్చుకోవడమే సామ్రాజ్యవాదం అసలు లక్ష్యం. హమాస్ దుందుడుకుగా వ్యవహరించినందువల్లనే ఈ యుద్ధం మొదలైందని కొందరు వాదిస్తున్నారు. ఇజ్రాయిల్ ది ప్రతీకారంగానే పరిగణిస్తున్నారు. కాని ఈ యుద్ధం కొనసాగడానికి ఎవరు కారణమో నిగ్గు తేల్చాలంటే ఇందాకటి ప్రశ్ననే ఇక్కడ కూడా వేసుకోవాలి. ఇప్పుడు మధ్య ఆసియాలో శాంతి నెలకొనడానికి ఎవరు ఆటంకం? పాలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తిస్తూ%ౌ%ఐరాస లో 194వ సభ్య దేశంగా ప్రకటించడానికి ఐరాస జనరల్ అసెంబ్లీలో తీర్మానం పెట్టిన ప్రతీసారీ దానిని వీటో చేస్తున్నది అమెరికానే. ఆ తీర్మానాన్ని ఆమోదించడం వలన ఆ ప్రాంతంలో సుస్థిరమైన శాంతిని నెలకొల్పడానికి సాధ్యపడుతుంది. ఒకవైపు ఇజ్రాయిల్, పాలస్తీనా రెండు దేశాలుగా పరిగణించడానికి అంగీకరిస్తూనే అమెరికా దానిపై తీర్మానాన్ని వీటో చేయడం బట్టి అమెరికా పాలస్తీనాను ఒక దేశంగా అంగీకరించడం అనేదే బూటకం అని స్పష్టం ఔతోంది. ఇజ్రాయిల్, పాలస్తీనాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కోసం చర్చలు జరుగుతున్నాయి అంటూ అప్పుడప్పుడూ అమెరికా చేసే హడావుడి అంతా ఒక నాటకం. ఇజ్రాయిల్ ప్రభుత్వం మాత్రం అమెరికా అందిస్తున్న పూర్తి దన్నుతో విర్రవీగుతూ విచ్చలవిడిగా వ్యవహరిస్తోంది. ఈ దాడులు తీవ్రం అవుతున్నకొద్దీ అది ఒక అణుయుద్ధంగా మారిపోయే ప్రమాదం నడినెత్తిన ఉంది. ఆ విధంగా సామ్రాజ్యవాదం ఒక పక్క నయా ఉదారవాదాన్ని, రెండో పక్క యుద్ధాన్ని సాధనాలుగా చేసుకుని తన ప్రపంచ వ్యాప్త పెత్తనానికి ప్రయత్నిస్తోంది. ఈ ప్రయత్నం ఒక పక్క నయా ఫాసిజానికి, రెండో పక్క మానవ జాతి వినాశనానికి దారి తీస్తుంది.

## మాయావాదాన్ని అల్లుతున్నారు

ప్రధాని నరేంద్ర మోడీ, ‘సనాతన ధర్మానికి’ తన మద్దతును బహిరంగంగా ప్రకటించినప్పుడే అసలు గుట్టు బయట పడింది. సామాజిక న్యాయాన్ని, సమానత్వ భావనను ‘సనాతన ధర్మం’ తిరస్కరిస్తుందని ఉదయనిధి స్టాలిన్ గతేడాది సెప్టెంబరులో చాలా పదునైన, విమర్శనాత్మక వ్యాఖ్యలు చేసినప్పుడు, మోడీ ఆ సనాతన ధర్మాన్ని గట్టిగా సమర్థించారు. ‘సనాతన ధర్మ’ వినాశనమే లక్ష్యంగా ఓ రహస్య ఎజెండా నడుస్తోందంటూ తమ వ్యతిరేకులను తీవ్రంగా నిందించారు. ‘సనాతన ధర్మ’ విరోధులపై ఎదురుదాడి చేయడానికి హిందూత్వ ప్రచారదళంలో భాగస్వాములయ్యేలా మంత్రుల్ని, తన పార్టీ సభ్యుల్ని సైతం పురిగొల్పారు. ఒకవైపు సామాజిక న్యాయం కోసం, దళితుల గౌరవ ప్రతిష్టల కోసం తాను కట్టుబడి వున్నట్టు పదే పదే మోడీ చేస్తున్న ప్రకటనలు బూటకమని, అంబేద్కర్‌పై ఆయన కురిపిస్తున్న ప్రశంసలు, సంత్ రవిదాస్ విగ్రహం పట్ల ఆయన చూపిస్తున్న భక్తి యావత్తూ ఒట్టి డొల్ల మాత్రమేనని మోడీ తాజా ప్రకటన తేటతెల్లం చేస్తోంది. “భారత దేశాన్ని వేల సంవత్సరాల పాటు ఐక్యంగా ఉంచిన ఆలోచనలు, విలువలు, సాంప్రదాయాలు అన్నీ కలిసి ‘సనాతన ధర్మం’గా ఉన్నట్టు



మోడీ ప్రకటించారు. అయితే ‘ప్రాచీన’, ‘శాశ్వత’, ‘సార్వత్రిక సత్యాలు లేదా ధర్మాలు’ లాంటి అస్పష్టమైన పదాలను తప్ప, ‘సనాతన ధర్మం’ చెప్పే ఆలోచనలు, విలువలు, సాంప్రదాయాలు ఏమిటి అన్న సంగతిని మోడీగానీ, ఎదుటివారిని తిట్టిపోయడమే పనిగా పెట్టుకున్న ఆయన అనుచర గణంగాని వివరించలేదు. ‘సనాతన ధర్మం’ యొక్క మౌలికమైన, ప్రత్యేకమైన ‘వర్ణ లేదా కుల వ్యవస్థ’ లక్షణాన్ని మరుగుపరచడం కోసమే ఏ వివరణా ఇవ్వలేదు. అన్ని హంగులూ కలిగివున్న అతగాడి సేనానులు తమ మాటల గారడీతో సనాతన ధర్మానికి కొమ్ము కాయడానికి తయారయ్యారు. లోకజ్ఞానం, మానవ విలువలు, వ్యక్తిగత విధులు, బాధ్యతలు, ప్రవర్తనా ప్రమాణాలు, నైతిక విలువలు లాంటి మాటల ముసుగులో దాని అసలు సారాంశాన్ని కప్పిపుచ్చుతున్నారు. ‘సనాతన ధర్మం’ యొక్క నిజ స్వభావాన్ని దాచిపెట్టడానికి దాని చుట్టూ ఆధ్యాత్మిక మాయావాదాన్ని అల్లుతున్నారు. దీనిని సద్గురు వాసుదేవ్ లాంటి ప్రముఖులిచ్చిన వివరణల్లో మనం చూడవచ్చు. “ఈ సనాతన ధర్మం అనే ప్రక్రియ నీలో ప్రశ్నలు రేకెత్తించడం కోసమే ఉంది. ఆ ప్రశ్నల లోతుల్లోకి పోయి దీనంతటికీ మూలం ఏమిటో నువ్వే సహజంగా తెలుసుకుంటావు”. ఇలాంటి మరొక గురువు ‘సనాతన ధర్మం’ “అందర్నీ ప్రేమించి, అందర్నీ కలుపుకొని పోతుందని” వ్యాఖ్యానించాడు. ఒకవేళ మనం ఈ వాదనలను ‘సనాతన ధర్మం’ యొక్క సారంగా అంగీకరించినా, ఇలాంటి శాశ్వతమైన సత్యాలే మనకు అన్ని మతాల్లోనూ కనిపిస్తాయి. కాని, అమానవీయ కుల, లింగ వివక్షతను ఎదుర్కొంటున్న దళితులు, ఇతర బలహీన కులాల వారి దైనందిన జీవితానుభవాల నుండి తలెత్తే ప్రశ్నలకు ఇట్లాంటి వాదనలు ఏ సమాధానాన్నీ ఇవ్వగల పరిస్థితి లేదు. ఇంతకూ సనాతన ధర్మం ప్రత్యేకత ఏమిటి? ఏ మాత్రమూ సమర్థించుకోలేని స్థితిలో ఉన్న హిందూత్వ తత్వవేత్తలు తప్పించుకోవడానికి ఇచ్చే వివరణలు, వ్యక్తం చేసే ధర్మాగ్రహం మాట ఎలా వుందన్నదానితో నిమిత్తం లేకుండా వారు సనాతన ధర్మంలో ఉన్న శాశ్వత సత్యాన్ని కప్పిపుచ్చలేరు. కఠినమైన, అమానవీయ, వారసత్వ, పుట్టుక ఆధారిత, నిచ్చెనమెట్ల కుల వ్యవస్థను దాచిపెట్టలేరు. అత్యంత నిరంకుశమైన, హానికరమైన ‘వర్ణాశ్రమ ధర్మం’ లేక ‘కుల ధర్మం’ కొన్ని వేల సంవత్సరాలుగా భారతదేశమంతా విస్తరించివున్న ఏకైక ముఖ్యమైన ఆలోచన, విలువ, సాంప్రదాయం అనే వాస్తవాన్ని వారు విస్మరిస్తున్నట్టు భావించాలి. కాబట్టి మోడీ, సంఘ్ పరివార్ ప్రత్యేకమైన బుద్ధి మాంద్యంతో బాధపడుతున్నట్లు భావించాలి. వేదాలు, ఉపనిషత్తులు, ధర్మ సూత్రాలు, గృహ్య సూత్రాలు (గృహస్థులు ఆచరించాల్సిన ధర్మాలు, సంస్కారాలు), పురాణాలు, భగవద్గీత అన్నీ వర్ణ లేదా కుల వ్యవస్థను సమర్థిస్తాయి. ఈ వాస్తవాన్ని వారు నిరాకరించగలరా? వర్ణ ధర్మం నుండి పక్కకు మళ్ళుతున్నందుకు కఠినమైన శిక్షను విధించడమే కాక, వర్ణ ధర్మ పరిరక్షణ పాలకుల ప్రాథమికమైన బాధ్యత అని చెప్పే మనుస్మృతిని మనం పట్టించుకోకూడదని వారు కోరుకుంటున్నారా? ఒకవేళ ‘కుల వ్యవస్థ వేరు, సనాతన ధర్మం వేరు’ అని కుల వ్యవస్థను బలపరిచే వాదనలతో విడగొట్టుకోవాలనుకుంటే, మోడీ ఆ విషయాన్ని ముందు స్పష్టం చేయాలి. ఆ తర్వాతనే తన వ్యతిరేకుల మీద విమర్శలకు పూనుకోవాలి. అది అతనికి కచ్చితంగా తెలియకుంటే శ్రేణీగత, వివక్షాపూరిత ‘వర్ణ లేదా కుల ధర్మం’ వారి పవిత్రమైన గ్రంథాల్లో భాగంగా ఉన్నాయా లేవా అనే విషయంపై వివరణ ఇమ్మనమని వారు సాధువుల్ని, మత ప్రచారకులని, శంకరాచార్యుల్ని వేడుకోవచ్చు. అయితే, మోడీ ఈ పని చేస్తారని ఎలా ఆశించగలం? అలా అయితే అతని కపటత్వం బైట పడుతుంది కదా! ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యల నుండి తలెత్తిన వివాదం హిందూత్వ దళం అసలు రంగును ప్రజల ముందు బయటపెట్టింది. మోడీ, ఆయన అనుచర గణం తాము 19వ శతాబ్దానికి చెందిన అభివృద్ధి నిరోధకులైన సనాతనవాదులకు నిజమైన వారసులుగా మన ముందు నిలబడ్డారు. ఆ కాలంలో బ్రహ్మ సమాజం, ఆర్య సమాజ్, ప్రార్థనా సమాజ్, రామకృష్ణ మిషన్ వంటి సంస్థలు హిందూ మతానికి అనేక సంస్కరణలు ప్రతిపాదించాయి. ఆ సంస్కరణలను వ్యతిరేకిస్తూ పలు ఛాందసవాద, సాంప్రదాయ హిందూ సంస్థలు పుట్టుకొచ్చాయి. ఆ సంస్థల నాయకులే, ‘సనాతన ధర్మానికి’ ప్రాచుర్యం కల్పించారు. ‘హిందూ’ అనే పదం పర్షియన్ మూలాలు కలిగి ఉన్నందువల్ల ఈ ‘సనాతన వాద’ సేవా తత్పరులు ‘హిందూ’ పదాన్ని ఇష్టపడక, దానికి బదులుగా ‘సనాతన ధర్మం’ అనే పదానికి ప్రాధాన్యత ఇవ్వడం ఆసక్తికరమైన విషయం.

## హర్యానా హెచ్చరిక, కాశ్మీర దీపకళిక

రెండు రాష్ట్రాల శాసనసభ ఎన్నికల ఫలితాలతో దేశంలో రాజకీయ చర్చను కొత్త మలుపు తిప్పినట్టు కనిపిస్తుంది. లోక్‌సభ ఎన్నికల్లో హ్యాట్రిక్ హంగామా చేసి దెబ్బతిన్న బిజెపి హర్యానాలో మాత్రం దాన్ని సాధించగలిగింది. ఎగ్జిట్ పోల్స్, సర్వేల ఫలితాలు, కాంగ్రెస్ అంచనాలు ఆశలు దారుణంగా విఫలమైనాయి. మీరు సక్రమంగా పనిచేసి వుంటే విజయం దక్కేదని, మీ స్వప్రయోజనాలే పరమార్థంగా మన పార్టీని దెబ్బ తీశారని రాహుల్ గాంధీ ఆగ్రహం చారంటే వారి పరిస్థితి అర్థమవుతుంది. జమ్ము కాశ్మీర్ 370 అధికరణం రద్దు ద్వారా దేశమంతా విజయం సాధించాలనుకున్న బిజెపి అక్కడే అనుకున్న లక్ష్యం సాధించలేకపోగా నేషనల్ కాన్ఫరెన్స్ చాలా కాలం తర్వాత మళ్లీ అధికారంలోకి వస్తున్నది. ఒమర్ అబ్దుల్లా మరోసారి ముఖ్యమంత్రి పదవి చేపడతారని ఆ పార్టీ సీనియర్ నేత ఫరూక్ అబ్దుల్లా ప్రకటించారు. బిజెపి జమ్మూలో పూర్తి ఫలితాలు సాధించిందనే ప్రచారం కూడా జోరుగానే నడుస్తున్నది. ఇంకోవైపున బిజెపి ఎన్నికల విజయాలు సాధించే యంత్రంగా పని చేస్తుందనీ దాని వ్యూహాలు అమోఘమనీ మోడియాలో భజన కీర్తనలు వినిపిస్తు న్నాయి. కేంద్ర ఎన్‌డిఎ కూటమి పాలనలోనే వున్న ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హర్యానా గెలుపును కీర్తించడంతో పాటు జమిలి ఎన్నికలు కూడా మంచిదని ప్రకటించారు. తిరుపతి లడ్డూ వివాదం హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల కోణంలో ముందుకు తెచ్చారనే విమర్శ తన సంపాదకీయంలో ప్రస్తావించిన హిందూ పత్రిక ఇప్పుడు దాన్ని మతతత్వ రాజకీయాల వైపు మరల్చవద్దని మరోసారి హితవు పలికింది. ఎ.పి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వంటి వారు బిజెపిని మించి సనాతన ధర్మం, హిందూత్వ వాదనలతో చెలరేగిపోవడానికి కారణాలేమిటని జాతీయ మీడియాలో ఎడతెగని చర్చ సాగుతున్నది. విజయదశమి ముంగిట్లో దేశ రాజకీయ ముఖచిత్రం ఇది. దేశానికి వ్యతిరేకంగా జరిగే కుట్రలకు కాంగ్రెస్ సహకరిస్తున్నదని హర్యానా విజయోత్సవ సభలో ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్య బిజెపి తదుపరి ప్రచారాలు ఎలా వుంటాయో చెబుతున్నది. దీంతోపాటుగానే వామపక్షాలు, ఇతర లౌకిక పార్టీలపైన బిజెపి హర్యానా ఫలితాల ప్రభావం వెనువెంటనే జరిగే మహారాష్ట్ర ఎన్నికలపై ఎలా పడుతుందనే రకరకాల అంచనాలు వినిపిస్తున్నాయి.



మహారాష్ట్రలో ‘ఇండియా’ వేదిక కీలక పార్టీ అయిన ఉద్ధవ్ థాకరే శివసేన ఎం.పి సంజరు రౌత్ కాంగ్రెస్ అహంభావం గురించి అందరికన్నా తీవ్రమైన వ్యాఖ్యలు చేయడం యాదృచ్ఛికం కాదు. హర్యానాలో కాంగ్రెస్ ఓటమి ప్రధానంగా స్వయంకృతాపరాధమన్నది రాహుల్ గాంధీ మాటల్లోనే స్పష్టమవుతున్న విషయం. మిగిలిన నేతలను పక్కన పెట్టి కేవలం భూపేందర్ హుడా నే ఏకైక అధిపతిగా పోటీ పడాలనుకోవడం ఆ పార్టీ మొదటి తప్పిదం. తెలంగాణలో రేవంత్ రెడ్డి, కర్ణాటకలో డి.కె.శివకుమార్ వంటి గట్టి నేతలపై ఆధారపడటం వల్లనే గెలిచామని కాంగ్రెస్ అధిష్టానం వ్యూహకర్తలు భావించడం ఇందుకు కారణమని చెబుతున్నారు. అధిష్టానం చుట్టూ తిరుగుతూ అంతర్గత కలహాలలో మునిగి తేలడం అనే జాడ్యం ఆ పార్టీని ఇంకా వదిలిపెట్టలేదు. బిజెపి మతతత్వ వ్యూహాలనూ కులాలవారీ ఎత్తుగడలను గట్టిగా ఢకొనడంలోనూ కాంగ్రెస్ పెద్దగా ఆసక్తి చూపలేదు. ఇందుకు తగినట్టే ప్రాంతీయ పార్టీలూ చీలిక వర్గాలు తమ మనుగడ కోసం కాంగ్రెస్, బిజెపి ల మధ్య దాగుడు మూతలాడే లక్షణాన్ని కొనసాగి స్తున్నాయి. ఇవన్నీ హర్యానా ఫలితాలపై ప్రభావం చూపించాయి. మతాన్ని రెచ్చగొట్టడంతో పాటు సామదానభేద దండోపాయాలతో అధికారంలోకి రావాలనే బిజెపి వ్యూహాలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ఇవే అవరోధాలుగా మారుతున్నాయి. జాట్ ఆధిపత్య వర్గాలకు ప్రతిబింబమైన హుడానే నమ్ముకోవడంతో ఇతర తరగతుల వారు దూరమైనారని ఇప్పుడు ప్రతివారూ గుర్తిస్తున్నారు. అంతేగాక ఆయననే ఏక బిందువుగా చేసుకోవడంతో మిగిలిన కీలక నేతలు, వర్గాలు దూరమైనాయి. లోక్‌సభ ఎన్నికల నాటికీ శాసనసభ ఎన్నికలకూ మధ్య కాంగ్రెస్ ఓట్లలో వచ్చిన తేడా ఆశ్చర్యం కలిగించేంత వుందంటే ఇవన్నీ కారణాలే.

### హర్యానా ఫలితాల విశేషాలు


హర్యానా ఎన్నికల ఫలితాలపై అనేక వ్యాఖ్యలు వెలువడ్డాయి గానీ లోక్‌సభ ఎన్నికల నాటికీ ఇప్పటికి ఇంతలోనే వచ్చిన తేడా నిజంగా దిగ్భ్రాంతి కలిగిస్తుంది. కనీసం 36 అసెంబ్లీ విభాగాల్లో దాని ఓట్లు అప్పటికంటే ఒకో చోట పదివేలకు పైగా పడిపోయాయి.18 స్థానాల్లోనైతే ఏకంగా 20 వేల చొప్పున తగ్గాయి. 28 నియోజక వర్గాలలో అయిదో వంతు ఓట్లు తగ్గిపోయాయి. మరీ ముఖ్యంగా హుడా కుటుంబ నియోజకవర్గమైన రోహ్తక్ లోక్‌సభ స్థానంలోని తొమ్మిది అసెంబ్లీ సీట్లలో అప్పుడు 7.83 లక్షల ఓట్లు వస్తే ఇప్పుడు కేవలం 5.93 లక్షలు వచ్చాయి. అంటే దాదాపు రెండు లక్షల ఓట్లు తగ్గిపోయాయి. నిజానికి హర్యానా వరకూ లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే శాసనసభలో కాంగ్రెస్ పుంజుకోవడమే గత రెండుసార్లు జరిగింది. ఇప్పుడు అది తారుమారైంది. పార్టీలో ముఠా తగవుల వల్ల, టికెట్టు రాని వారు పోటీ అభ్యర్థులుగా వుండటం లేదా ఓట్లు మరోవైపు మరలించడం వల్ల ఇలా జరిగిందని భావించక తప్పదు. అసలు అభ్యర్థుల కంటే రెబల్ కే చాలా ఎక్కువ ఓట్లు వచ్చిన సీట్లు కూడా వున్నాయి. బిజెపి ఓటింగు పెద్దగా పెరిగింది లేదు గానీ సీట్లు విపరీతంగా పెరిగాయి. కాంగ్రెస్ ఓటింగు ఊహించలేనంతగా పడిపోయింది. 2014లో అత్యధికంగా వచ్చిన దాన్ని మించి బిజెపికి 48 స్థానాలు రాగా కాంగ్రెస్‌కు 37 వచ్చాయి. ఐఎన్ఎల్‌డికి రెండు, ముగ్గురు స్వతంత్రులు కూడా గెలిచారు. బిజెపికి ఓట్లలో 39.9 శాతం, సీట్లలో 53.3 శాతం దక్కాయంటే ఐఎన్ఎల్‌డి, బిఎస్‌పి, హెచ్ఎల్‌పి కూటమితో లోపాయికారి అవగాహన కీలక పాత్ర వహించింది. సిర్సా స్థానంలో బిజెపి నేరుగా తన అభ్యర్థిని ఉపసంహరించుకుని ఈ కూటమికి మద్దతు ప్రకటించింది. మిగిలిన చోట్ల అవగాహన ప్రకారం ఓట్ల బదలాయింపు జరిగిందని పరిశీలకులు చెబుతున్నారు. సిర్సా లోక్‌సభ స్థానంలోనే తీసుకుంటే మూడు అసెంబ్లీ సీట్లలో బిజెపి ఓట్లు దారుణంగా తగ్గిపోగా మరో మూడు చోట్ల గణనీయంగా పెరిగాయి. అంటే ఇక్కడ ఒక అవగాహన ప్రకారమే పరస్పరం గెలిపించుకున్నారనే సందేహాలు సహజం. 18 వేల ఓట్లు తగ్గిన కాంగ్రెస్ మూడు అసెంబ్లీలు కోల్పోగా వాటిలో రెండు ఐఎన్ఎల్‌డికి, ఒకటి బిజెపికి వచ్చాయి. మరికొన్ని చోట్ల ఈ కూటమికి వచ్చిన ఓట్లు బిజెపి ఆధిక్యత కంటే ఎక్కువగా వున్నాయి. కనుక కావాలనే పోటీ పెట్టించారనే ఆరోపణలున్నాయి. ఇవన్నీ ఎన్నికలలో అసాధారణమేమీ కాదు గాని కాంగ్రెస్ అనైక్యత, ఆప్ వంటి పార్టీలను దూరం చేసుకోవడం ఘోరంగా దెబ్బ తినడానికి కారణమైనాయి. ఐఎన్ఎల్‌డి జాట్లు, దళితుల ఓట్ల కోసం కాంగ్రెస్‌తో పోటీ పడిందని గుర్తు పెట్టుకోవాలి. ఇంత క్లిష్ట పరిస్థితిలోనూ మైనార్టీ వర్గాలు మాత్రం కాంగ్రెస్‌కే ఓటు వేశారు గానీ బిజెపి మతతత్వ దాడిని ఆ పార్టీ గట్టిగా ఎదుర్కోలేదనే అసంతృప్తి వారిలోనూ వచ్చింది. ఐక్యత కోసం ప్రయత్నించి విఫలమై 89 చోట్ల పోటీ చేసిన ఆప్ 1.8 శాతం ఓట్లు తెచ్చుకుంది. కనీసం ఈ రెండు పార్టీలు కలిసివున్నా పరిస్థితి చాలా మారివుండేదని ఒక అంచనా. సమాజ్‌వాది పార్టీ కూడా ఈ విషయంలో తన అసంతృప్తిని వెలిబుచ్చింది.

### ఇవిఎంలు, ఇతర పార్టీలు

ఇక పది స్థానాల్లో ఇవిఎంల అవకతవకలు జరిగాయని కాంగ్రెస్ ఫిర్యాదు చేసింది. అసలు తాము ఈ ఫలితాలను ఆమోదించడం లేదని మొదట్లో జైరాం రమేష్ వంటి వారు ప్రకటించారు. ఇ.సి కి ఫిర్యాదు కూడా చేశారు. అయితే ప్రజల తీర్పును ఆమోదించ లేదని చెప్పడం అప్రజాస్వామికమని ఇసి ఆ పార్టీ ఆరోపణలపై విరుచుకుపడింది. ఎ.పి లో వైసీపీ కొన్నిచోట్ల ఆరోపించినట్లుగా ఇవిఎంల బ్యాటరీ ఛార్జింగ్ ఎక్కువగా వుండటం బట్టి తప్పు జరిగిందని ఆరోపించడం సరికాదని సమర్థించుకుంది. మరింత లోతుగా అధ్యయనం చేశాకే ఈ అంశంపై ముందుకు పోవాలని ప్రస్తుతానికి కాంగ్రెస్ నిర్ణయించింది. ఏమైనా లౌకిక పార్టీలనూ ‘ఇండియా’ భాగస్వాములను కలుపుకొని పోవడంలో వైఫల్యం, ఎన్నికల ఎత్తుగడలు, నినాదాల లోపాల గురించి ఇంతవరకూ మాట్లాడింది లేదు. గతంలో మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్ లలో జరిగిన తప్పులే ఇక్కడా పునరావృతమైనాయని అన్ని వైపుల నుంచి వచ్చిన విమర్శను పరిశీలించుకున్నదీ లేదు. ఒక విధమైన ఆశాభంగం అసహనంలో, అనైక్యత మరింత పెరుగుతున్న స్థితిలో వుండిపోయింది. ఈ ఫలితం తర్వాత ఢిల్లీలో తాము వంటరిగానే పోటీ చేస్తామని ఆప్ ప్రకటించింది. యు.పి లో రానున్న ఉప ఎన్నికల్లోనూ ఎస్.పి కాంగ్రెస్‌ను దూరం పెడుతుందని మొదట కథనాలొచ్చినా అఖిలేశ్ యాదవ్ కలిసే పోరాడతామని స్పష్టం చేశారు. ఆ పార్టీ నాయకత్వం ఆత్మావలోకనం చేసుకోవాలని సిపిఎం కూడా సూచించింది. మహారాష్ట్రలోనూ ఇలాంటి విమర్శ ఇంతకు ముందే వుంది. హర్యానాలో బిజెపి మంత్రులు ఎనిమిది మంది ఓడిపోయారంటే ప్రజల్లో వ్యతిరేకత తక్కువ లేదని తెలుస్తుంది. అయితే లోక్‌సభ పోటీలోనూ ఇరు పార్టీలకూ సరిసమానంగానే సీట్లు వచ్చాయని కూడా గుర్తు పెట్టుకోవాలి. అందువల్ల ఈ ఫలితాన్ని మరీ ఏకపక్షంగా చూపించి బిజెపికి తిరుగులేదనో గొప్ప వ్యూహాలతో గెలిచిందనో టముకు వేయడం అర్థరహితం. ఎటొచ్చీ లౌకిక పార్టీలు కలసికట్టుగా గట్టిగా పోరాడవలసిన అవసరాన్ని హర్యానా ఫలితాలు హెచ్చరికగా నిలిచాయి.

### కాశ్మీర్‌లో జరగాల్సిందేమిటి?

జమ్ము కాశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్, దాని మిత్రులు పూర్తి మెజార్టీ సాధించారు గానీ కాంగ్రెస్ సీట్లు తగ్గిపోయాయి. కాన్ఫరెన్స్‌కు 42, బిజెపికి 29, కాంగ్రెస్‌కు 6, పిడిపికి 3, సిపిఎంకు 1, ఆప్‌కు 1, జెపిసికి 1, ఇండిపెండెంట్లకు ఏడు వచ్చాయి. బిజెపితో జట్టు కట్టిన పిడిపిని ఓటర్లు తిరస్కరించి నేషనల్ కాన్ఫరెన్సుకు పాలన అప్పగించారు. జమ్మూలో బిజెపికి సీట్లు, ఓట్లు కూడా బాగా వచ్చాయి. ఈ రెండు ప్రాంతాల ఆకాంక్షలను, అవసరాలను అందుకోవడం ఇప్పుడు ఒమర్ అబ్దుల్లా నాయకత్వంలో ఏర్పడే ప్రభుత్వం ముందు సవాలుగా వుంటుంది. సంపూర్ణ రాష్ట్ర ప్రతిపత్తి పునరుద్ధరణ తమ మొదటి కర్తవ్యమని ఒమర్ ప్రకటించారు. అదే సమయంలో వ్యక్తిగతంగా ప్రధాని మోడీ పట్ల సానుకూల ధోరణిలో మాట్లాడటం కాశ్మీర్ పరాధీనతకు ఒక నిదర్శనం. ఏమైనా బిజెపి కాశ్మీర్‌లో ఓట్లను చీల్చడానికి అనేక వేర్పాటువాద పార్టీలను ఉపయోగించిందనే ఆరోపణలున్నాయి. పైగా లెఫ్టినెంట్ గవర్నర్‌కు ముందే విస్తారమైన అధికారాలు కట్టబెట్టడంతో పాటు అయిదుగురు ఎంఎల్ఎలను నామినేట్ చేసే పెత్తనం కూడా ఇచ్చారు. ఆ విధంగా కేంద్ర పెత్తనం, బిజెపి కుయుక్తులు కొనసాగుతూనే వుంటాయి. నలుగురు ఇండిపెండెంట్ల మద్దతు ప్రకటించడంతో కాన్ఫరెన్స్‌కు సర్కారు ఏర్పాటు చేసే ఆధిక్యత వచ్చింది. కాంగ్రెస్, సిపిఎం, ఇండిపెండెంట్ సభ్యులను కలుపుకుంటే 53 సీట్లతో బలమైన మద్దతు వుంటుంది. ప్రజల తీర్పునకు అనుగుణంగా వేగంగా చర్యలు తీసుకోవడం అబ్బుల్లా కర్తవ్యం కాగా అందుకు పూర్తిగా సహకరించడం, తమ ఏకపక్ష నిరంకుశ పోకడలు మార్చుకోవడం కేంద్రంపై వున్న బాధ్యత.





# సెమీస్‌కు కివీస్

## భారత్ అవుట్

## 54 పరుగులతో పాకిస్థాన్ పరాజయం

## మహిళల వరల్డ్‌కప్‌లో నేడు

## ఇంగ్లండ్ అండ్ వెస్టిండీస్ రా. 7.30

దుబాయ్: మహిళల టీ20 వరల్డ్ కప్ నుంచి భారత జట్టు నిష్క్రమించింది. గ్రూపు 'ఎ' ఆఖరి లీగ్ మ్యాచ్‌లో భాగంగా సోమవారం న్యూజిలాండ్ చేతిలో పాకిస్థాన్ దారుణంగా ఓడడంతో మన అమ్మాయిల సెమీఫైనల్ ఆశలు గల్లంతయ్యాయి. స్వల్ప స్కోరు చేసినా..కట్టుదిట్టమైన బౌలింగ్‌తో న్యూజిలాండ్ అదరగొట్టింది. 54 పరుగులతో గెలిచి ఇటు పాకిస్థాన్‌ను అటు భారత్‌ను నాకౌట్ చేసింది. గ్రూపులో రెండో స్థానంతో సెమీస్ బెర్త్ దక్కించుకుంది. ఇక నాలుగింటికి నాలుగు మ్యాచ్‌లు నెగ్గి గ్రూపు 'ఎ' టాపర్‌గా ఆస్ట్రేలియా ఇప్పటికే సెమీఫైనల్లో అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. తొలుత న్యూజిలాండ్ 20 ఓవర్లలో 110/6 స్కోరుకే పరిమితమైంది. సుజీబేట్స్ (28), హాలీడే (22), సోఫీ డివైన్ (19) రాణించారు. నష్రా సంధూ 3 వికెట్లు పడగొట్టింది. స్వల్ప ఛేదనలో పాకిస్థాన్ 11.4 ఓవర్లలో 56 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ ఫాతిమా సనా (21) టాప్ స్కోరర్. ఆ తర్వాత మునీబా అలీ (15) మాత్రమే రెండంకెల స్కోరు చేసింది. అమీలియా కెర్ 3, 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కార్సన్ 2 వికెట్లు తీశారు.భారీ షాట్లతో బోల్తా: 10.4 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదిస్తే సెమీస్ బెర్త్ లభిస్తుందన్న లెక్కతో..దూకుడుగా ఆడేందుకు యత్నించిన పాకిస్థాన్ ఆ క్రమంలో వికెట్లు పారేసుకుంది. ఫలితంగా పవర్ ప్లే ముగిసే సరికి 28/5తో కోలుకోలేని స్థితికి చేరింది. కానీ ఫాతిమా సనా, నిదా దర్ (9) ఆరో వికెట్‌కు 24 పరుగులు జోడించడంతో పాకిస్థాన్ జట్టు కనీసం మ్యాచ్‌ను గెలుస్తుందని, తద్వారా భారత్ సెమీఫైనల్ చేరుతుందనే ఆశ ఏర్పడింది. నిదా దర్‌ను ఊరించే బంతితో కెర్ స్టంపౌట్ చేయడం..ఆపై ఒమైమా (2), అరూబ్ (0) ఇలా వచ్చి అలా వెళ్లడం..ఫాతిమా సనాను కెర్ అవుట్ చేయడంతో అటు పాకిస్థాన్ గెలుపు ఆశలు ఇటు భారత్ సెమీస్ అవకాశాలు గల్లంతయ్యాయి. నష్రా హవా: పాకిస్థాన్ బౌలర్లు ముఖ్యంగా లెఫ్టామ్ స్పిన్నర్ నష్రా సంధు ప్రత్యర్థి బ్యాటర్లకు పూర్తిగా కళ్లెం వేసింది. ఇక పాకిస్థాన్ ఫీల్డర్లు ఏకంగా ఎనిమిది క్యాచ్‌లు వదిలేశారు. అందులో నాలుగు క్యాచ్‌లను నిదా దర్ బౌలింగ్‌లోనే వదిలేయడం గమనార్హం. అయితే పాకిస్థాన్ చెత్త ఫీల్డింగ్‌ను న్యూజిలాండ్ సద్వినియోగం చేసుకోలేకపోయింది. ఓపెనర్లు సుజీ బేట్స్, ప్లిమ్మర్ వేగంగా ఆడడంతో పవర్ ప్లేలో కివీస్ 39/0 స్కోరు చేసింది. దూకుడుగా ఆడుతున్న ప్లిమ్మర్ (17)ను, అనంతరం బేట్స్‌ను నష్రా పెవిలియన్ చేర్చింది. అమీలియా (9) విఫలం కావడంతో కివీస్ 58/3తో నిలిచింది. ఈ దశలో కెప్టెన్ సోఫీ, హాలీడే నాలుగో వికెట్‌కు 38 రన్స్ జోడించి ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టారు. కానీ పాకిస్థాన్ బౌలర్లు మరోసారి విజృంభించి న్యూజిలాండ్‌ను కట్టడి చేశారు.



సంక్షిప్తస్కోర్లు

న్యూజిలాండ్: 20 ఓవర్లలో 110/6 (బేట్స్ 28, హాలీడే 22, డివైన్ 19, ప్లిమ్మెర్ 17, నష్రా సంధు 3/18)

పాకిస్థాన్: 11.4 ఓవర్లలో 56 ఆలౌట్ (ఫాతిమా సనా 21, మునీబా అలీ 15, కెర్ 3/14, కార్సన్ 2/7).

# రిస్క్ తీసుకుంటేనే మజా

## మా బ్యాటర్ల దూకుడును ఆపలేను

## టీమిండియా చీఫ్ కోచ్ గంభీర్

టీమిండియా ప్రాక్టీస్ సందర్భంగా

కోచ్ గంభీర్, కెప్టెన్ రోహిత్



బంగ్లాదేశ్‌తో జరిగిన రెండో టెస్టులో భారత బ్యాటర్ల ఆటతీరు విశ్లేషకులను ఆశ్చర్యపరిచింది. దాదాపు మూడు రోజుల ఆట వర్షార్పణమైనా చివరి రెండు రోజుల ఆటలోనే మ్యాచ్ ఫలితం వచ్చేలా రోహిత్ సేన చెలరేగింది. అలా రిస్క్ తీసుకుని ఆడితేనే ఫలితం వస్తుందని కోచ్ గంభీర్ చెబుతున్నాడు. పైగా అలాంటి ఆటను ప్రదర్శించగల సత్తా ఉన్న తమ ప్లేయర్లను ఎందుకు అడ్డుకోవాలని ప్రశ్నించాడు. బుధవారం నుంచి కివీసతో టెస్టు సిరీస్ ఆరంభం కానుండగా కోచ్ గంభీర్ విలేకరులతో మాట్లాడాడు. 'తమ సహజమైన శైలితో బ్యాటింగ్ చేస్తూ ఒక్క రోజులోనే 400-500 పరుగులను సాధించగల సత్తా ఉన్న బ్యాటర్లను నేనెందుకు ఆపాలి? ఆడాల్సి వచ్చినప్పుడు అలాగే ఆడతాం. ఎంత రిస్క్ తీసుకుంటే అంత ఫలితం ఉంటుంది. అలాగే ఒక్కోసారి 100 పరుగులకే ఆలౌట్ అయ్యే పరిస్థితి కూడా ఎదురవ్వచ్చు. మరోవైపు డ్రా కోసం ఆడాల్సివస్తే రెండు రోజులైనా క్రీజులో నిలవగలిగేలా జట్టు ఉండాలని కోరుకుంటున్నా. అలా ఆడే బ్యాటర్లు కూడా మా దగ్గర ఉన్నారు. ఏదేమైనా పరిస్థితులకు తగ్గట్టుగా ముందుకెళ్లాల్సి ఉంటుంది. అదే టెస్టు క్రికెట్ అంటే. ఎప్పుడూ ఒకేలా ఆడితే ఎదగలేం' అని గౌతీ తేల్చాడు. మరోవైపు భారత్‌ను ఓడించే సత్తా న్యూజిలాండ్‌కు ఉందని, ఆ జట్టులో అద్భుత క్రికెటర్లున్న విషయం మరువరాదన్నాడు. అందుకే ఈ సిరీస్ తమకు సవాల్‌లాంటిదేనని చెప్పాడు. ప్రస్తుతానికైతే వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప ఫైనల్ గురించి ఆలోచన లేదని, కివీసతో సిరీస్ నెగ్గడంపైనే దృష్టి సారించినట్టు గంభీర్ పేర్కొన్నాడు.

### విరాట్ ఫామ్‌పై ఆందోళన ఎందుకు?

బంగ్లాదేశ్‌తో టెస్టు సిరీసలో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ స్థాయికి తగ్గట్టుగా రాణించలేకపోయాడు. అయితే ప్రతీ మ్యాచ్‌కూ అతడి ఫామ్‌ను అంచనా వేయడం సరికాదని కోచ్ గంభీర్ స్పష్టం చేశాడు. 'విరాట్ అత్యుత్తమ ఆటగాడు. అరంగేట్రం చేసినప్పుడున్న పరుగుల దాహం నేటికీ కొనసాగుతోంది. రానున్న కివీస్, ఆసీసతో సిరీస్‌ల్లో భారీగా పరుగులు సాధించగలడనే నమ్మకం ఉంది. అందుకే అతడి ఫామ్‌పై ఆందోళన పడాల్సిన అవసరం లేదు. ఏదేమైనా ఓ మ్యాచ్‌కో.. సిరీసకో ఆటగాడి ప్రదర్శనను అంచనా వేయడం సరికాదు. ప్రతీ ఆటగాడికి మద్దతుగా నిలవాల్సిన అవసరం నాకుంది' అని గంభీర్ స్పష్టం చేశాడు.



# మా ఆటకు హద్దుల్లేవ్..

## రోజుకు 400-500 పరుగులైనా..



టీమిండియా క్రికెటర్లు ఎవరైనా సరే తమ సహజ శైలిలో చెలరేగుతుంటే... జట్టు వ్యూహాల పేరుతో వారి దూకుడుకు హద్దులు పెట్టబోమని హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ స్పష్టం చేశాడు. 'బ్యాటింగ్ కింగ్' విరాట్ కోహ్లి ఫామ్‌పై తమకెలాంటి ఆందోళనా లేదని, అతని పరుగుల దాహం ఎప్పటికీ తీరదని గంభీర్ తెలిపాడు. అయితే, బుధవారం నుంచి న్యూజిలాండ్‌తో జరిగే మూడు టెస్టుల సిరీస్‌లో టీమిండియాకు కఠిన సవాళ్లు తప్పవన్నాడు. ఇటీవలే ముగిసిన బంగ్లాదేశ్ సిరీస్ సహ కివీస్‌తో టెస్టులు, ఆస్ట్రేలియా పర్యటనలపై గంభీర్ సోమవారం జరిగిన మీడియా సమావేశంలో తన అభిప్రాయాలు వెల్లడించాడు. భవిష్యత్తులో జరిగే సిరీస్‌లకంటే ప్రస్తుత సిరీస్‌పైనే తమ దృష్టి ఉంటుందని చెప్పుకొచ్చాడు. ఇంకా ఏమన్నాడంటే...

అడ్డు ఎందుకు?

"భారత బ్యాటింగ్‌కు నిర్దిష్టమైన శైలి ఇదని, ఇలాగే ఆడాలనే కచ్చితమైన ప్రణాళికలేమీ లేవు. ఆటగాళ్లు దూకుడుగా ఆడితే ఆడని... చెలరేగితే చెలరేగని ఇందులో అడ్డుకట్టలెందుకు పెట్టాలి. వారి సహజశైలిని వారు కొనసాగించే స్వేచ్ఛ ఇవ్వాలి కదా! గట్టిగా చెప్పాలంటే... మేం ఒక రోజులో 400-500 పరుగులైనా చేయాలనుకుంటాం. తప్పదు అవసరమనుకుంటే రెండు రోజుల పాటు జిడ్డుగా ఆడి 'డ్రా' అయినా చేసుకోగలుగుతాం. ఎందుకంటే కొన్నిసార్లు 100 పరుగులకే ఆలౌటయ్యే ప్రమాదం రావొచ్చు. అప్పుడు క్రీజులో నిలబడే ఓపిక, గంటల తరబడి ఆడే సామర్థ్యం కూడా అవసరం. టీమిండియా ఇలా తయారుకావడమే ముఖ్యం. అప్పుడే దూకుడైన ఆటతో అభిమానులకు మజా దక్కుతుంది.

పరిస్థితులను బట్టే నిర్ణయాలు

ఈ సిరీస్‌లో ఇలా ఆడాలని, ఆ ప్రత్యర్థిని అలా ఎదుర్కోవాలనే ముందస్తు ప్రణాళికలపైనే ఆధారపడటం కుదరదు. వీలును బట్టి, అప్పటి పరిస్థితులు, పిచ్‌లో ఎదురయ్యే సవాళ్లు దృష్టిలో ఉంచుకునే నిర్ణయాలుంటాయి. దీనికి పక్కా ప్రణాళికంటూ అమలు కాదు... అప్పటి పరిస్థితులే ప్రామాణికం. దాన్నిబట్టే ఆటతీరు మారుతుంది. ఆడే శైలి మరో దశకు చేరుకుంటుంది.

కివీస్‌తో గట్టిపోటీ

న్యూజిలాండ్ సాదాసీదా ప్రత్యర్థి కానేకాదు. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా షాక్‌లు తప్పవు. సొంతగడ్డ అనే అనుకూలతలు, గత సిరీస్ గెలిచాం... ఇదీ గెలుస్తామనే ధీమా తప్పు. బంగ్లాదేశ్‌తో పోల్చితే కివీస్ పూర్తిగా భిన్నమైన ప్రత్యర్థి. ఆ జట్టు గట్టి పోటీ ఇస్తుంది. నాణ్యమైన ఆటగాళ్లు, అనుభవజ్ఞులైన ప్లేయర్లు అందుబాటులో ఉన్నారు. కాబట్టి ప్రతీ మ్యాచ్‌లోనూ మాకు సవాళ్లు తప్పవు. అయితే ప్రత్యర్థి కివీసా లేదంటే ఆసీసా అని చూడం. జట్టు గెలుపొందడమే లక్ష్యంగా బరిలోకి దిగుతాం. వచ్చే నెలలో మొదలయ్యే 'బోర్డర్-గావస్కర్ ట్రోఫీ' గురించి ఇప్పుడెందుకు ఆలోచిస్తాం. ఇప్పుడు ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్‌లో ఫైనల్ బెర్తే లక్ష్యంగా కివీస్‌ను ఓడించేపనిలో ఉంటాం .

వరల్డ్‌క్లాస్ ప్లేయర్

కోహ్లిపై నా ఆలోచనలు సుస్పష్టం. అతనో విశ్వవిఖ్యాత క్రికెటర్. సుదీర్ఘకాలంగా గొప్పగా రాణిస్తున్న బ్యాటర్. కోహ్లి అరంగేట్రం చేసినపుడు ఎలాంటి పరుగుల దాహంతో ఉన్నాడో... ఇన్నేళ్లుగా ఆడుతున్నా ఇప్పటికి అలాంటి ఆకలితోనే ఉన్నాడు. కివీస్‌తో జరిగే మూడు టెస్టుల సిరీస్‌లో తప్పకుండా రాణిస్తాడనే ఆశిస్తున్నాను. ఇకపైనా అదే ఆటతీరును ఆస్ట్రేలియా పర్యటనలోనూ కొనసాగిస్తాడనే నమ్మకంతో ఉన్నాను. వరుసగా కొన్ని మ్యాచ్‌ల్లో... లేదంటే ఒకట్రెండు సిరీస్‌లలోనే విఫలమైనంత మాత్రాన అతడిబ్యాటింగ్‌లో సత్తా లేదని కాదు. ఆటగాళ్లు కదా... ఎవరికైనా వైఫల్యాలు సహజం. అలాగే వాటిని అధిగమించడం కూడా జరుగుతుంది" అని గంభీర్ పేర్కొన్నాడు.

# కళ్లన్నీ వాళ్లిద్దరిపైనే..

ఒడెన్స్ (డెన్మార్క్): ఈ సీజన్‌లో ఫామ్‌లోకి వచ్చేందుకు భారత స్టార్ షట్లర్ పీవీ సింధు పట్టుదలగా ఉంది. గత వారం ఫిన్లాండ్‌లో జరిగిన ఆర్కిటిక్ ఓపెన్ వైఫల్యాన్ని అధిగమించి డెన్మార్క్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 టోర్నీలో శుభారంభం చేయాలనే లక్ష్యంతో సింధు సన్నద్ధమైంది.

ఆ అడ్డంకిని దాటితేనే

రెండు ఒలింపిక్ పతకాలు సాధించిన సింధుకు గత ఈవెంట్‌లో అనూహ్యంగా తొలి రౌండ్లోనే కెనడా ప్లేయర్ మిచెల్లీ లీ చేతిలో ఓటమి ఎదురైంది. గతంలో మిచెల్లీపై పదిసార్లు విజయం సాధించిన భారత షట్లర్‌కు ఫిన్లాండ్‌లో మాత్రం నిరాశ ఎదురైంది. తాజా డెన్మార్క్ ఓపెన్ తొలి రౌండ్‌లో ఆమె చైనీస్ తైపీకి చెందిన పాయ్ యు పొతో తలపడుతుంది. ఈ అడ్డంకిని దాటితే సింధుకు రెండో రౌండ్లో చైనా షట్లర్ హాన్ యువె ఎదురవనుంది. మహిళల సింగిల్స్‌లో ఆమెతో పాటు మాళవిక బన్సోద్, ఆకర్షి కశ్యప్, ఉన్నతి హుడాలు కూడా ఈ టోర్నీలో శు భారంభంపై దృష్టి సారించారు.



లక్ష్య సేన్ గాడిన పడతాడా?

పురుషుల సింగిల్స్‌లో భారత స్టార్ లక్ష్య సేన్ కూడా మెరుగైన ఆటతీరుతో ఈ సీజన్‌లో గాడిన పడేందుకు శ్రమిస్తున్నాడు. ఈ టోర్నీలో 23 ఏళ్ల లక్ష్య సేన్ తొలిరౌండ్లో లూ గ్వాంగ్ జు (చైనా)తో పోటీపడతాడు. ఈ మ్యాచ్‌లో గెలిస్తే రెండో రౌండ్లో కిష్టమైన ప్రత్యర్థి ఎదురవనున్నాడు. ఇండోనేసియాకు షట్లర్ జొనాథన్ క్రిస్టీతో లక్ష్య సేన్ తలపడే అవకాశముంది.

డబుల్స్‌లోజి

ఇక మహిళల డబుల్స్‌లో గాయత్రి-ట్రెసా జాలీ జంట తొలి రౌండ్లో ఐదో సీడ్ పియర్లీ తన్-తినా మురళీధరన్ (మలేసియా) జోడీతో ఆడుతుంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో సిక్కి రెడ్డి-సుమిత్ రెడ్డి ద్వయానికి తొలి రౌండ్లో కెవిన్‌లీ- ఎలియాన జంగ్ (కెనడా) జంట ఎదురవుతుంది. గతంలో భారత క్రీడాకారులకు డెన్మార్క్ ఓపెన్ కలిసొచ్చింది. సింగిల్స్‌లో ప్రకాశ్ పదుకొనే (1980లో), శ్రీకాంత్ (2017లో), సైనా నెహ్వాల్ (2012లో) విజేతలుగా నిలిచారు.